
40.పై.
1-5-70
ఆంధ్ర
సచిత్ర వ
పత్రి


క్రూక్స
లాక్టో-కేలమైన్
ఏస్ట్రింజంట్ రూపములో?
అవునండి!
లాక్టో-కేలమైన్
Lacto Calamine
ఇప్పుడు
మినీ సైజులో కూడా లభిస్తోంది


చక్రవర్తి చిత్ర సమర్పించు
మరో ప్రపంచం
నిర్మాతలు: అక్కినేని-ఆదుర్తి దర్శకత్వం: ఆదుర్తి సుబ్బారావు
NVKR

ఉత్తరాలు

కథలు

'నే నెందుకు బతికాను' కథ ఇప్పుడు వస్తున్న కథల్లో ఆణిముత్యం లాంటిది. సరిగా సంవత్సరం క్రితం వచ్చిన తుఫానును ఇతివృత్తంగా తీసుకొని హృదయాల్ని కదిలించేలా కథను వ్రాసిన రచయిత కోటేశ్వరరావుకు ధన్యవాదాలు. కథ మొదటి నుంచి చివరివరకు వచన గేయంలా వుండి చదువరుల మనసులను రంజింప చేసింది. ముగింపు అందరికీ నచ్చేలా వుంది.

వి. శివరామ్, [బాపట్ల]

* * *

'నాకు నువ్వూ—నీకు నేను' అనే శ్రీ అవసరాల రామకృష్ణరావు గారి కథను చదివేక ఎప్పుడూ పత్రికలకు ఏమి రాయటం అలవాటు లేని నాకు ఈ వుత్తరం రాయాలని పించింది. మధ్యతరగతి కుటుంబాలలో వుండే సామాజిక జీవిత సమస్యలు, ఆర్థిక యిబ్బందులు, ఎల్లప్పుడూ ఏదో జబ్బులతో బాధలు పడే కుటుంబాలని చూస్తూ వుంటే పెళ్లంటే భయం, సంసారమంటే ఓ విధమైన భీతి కలిగి, పెళ్లి అనేదే లేకుండా జీవించగలిగితేనే హాయిగా గడపొచ్చునేమో అనే అభిప్రాయాలు గలిగే వారికి ఈ కథానిక చక్కని సందేశమిస్తోంది. ఇకపోతే శ్రీ అవసరాల వారు వ్రాసే తీరు హాస్యంగాను, తేలికగాను వున్నప్పటికీ ఈ కథానిక మేటర్ మాత్రం చాలా పెద్ద విషయం. ఇన్ని కష్ట నష్టాలున్న సంసార సాగరంలో కనిపించే సౌఖ్యాలు యిసుక ఎడారిలో నీటి బొట్లు వలె వుంటుంది. కాని మనిషి జీవించటానికి ముఖ్యంగా కష్టసుఖాలలో పాలు పంచుకొనేందుకు జీవితాంతము కలసి జీవించే వారెవరో ఒకరు వుంటేనే తప్ప సామాన్య వ్యక్తి జీవితానికి తృప్తి, ఆనందం అనేవి వుండవని తెలియ జేసే చక్కని కథానిక ఇది.

బచ్చు లలిత (బరంపురం)

ఉగాది ప్రత్యేక సంచిక

ఉగాది సంచికలో ప్రచురించిన 'ఇది న్యాయం' కథ చాలా బాగుంది. స్త్రీ యొక్క బాధ సాటి స్త్రీయే అర్థం చేసుకోగలుగుతుంది. మన సంఘంలో కరుణాదేవిలాంటివారు మరి నలుగురుంటే స్త్రీలకు జరుగుతున్న అన్యాయమును రూపుమాపి న్యాయాన్ని చేకూర్చగలరు. మనిషికి కావలసింది చదువ్వూ, అందమే కాకుండా మంచి హృదయము కూడా వుండాలని రచయిత్రి బాగా తెలియపరిచారు. రచయిత్రికి నా ధన్యవాదాలు.

'భయపెట్టాను అంతే!' అన్న కథలో యువ మానసరాలు రామునికిచ్చిన శిక్ష చదువుతుంటే అంత కఠిన హృదయులైన స్త్రీలు కూడా వుంటారా అనిపించింది.—శ్రీమతి రెహానా జీలాని, [కందుకూరు]

ఉగాది సంచికలో 'బాగుపడే దెప్పుడు' అనే కథ చదివాను. ఎవరుసార్, ఈ ఎస్. ఉమామహేశ్వర రావు? ఆయనకు నా ధన్యవాదాలు. ఈ కథ వేసినందుకు మీకు కూడా నా ధన్యవాదాలు.

కథలని చదువుతుంటాగాని, ఎప్పుడూ పత్రికలకి ఉత్తరాలు రాయలేదు—బాగుందీ, బాగోలేదు, ఫలానా కథని. ఈ కథ చదివినప్పుడు మాత్రం నాకు రాయాలనిపించింది. రచయిత కథను మంచి సిన్సియారిటీతో వ్రాసినట్లు కనపడింది నాకు.

ఎందుకంటే, ఆంధ్రదేశంలో నాటకరంగం దెబ్బ తిందీ అని సందేహపడేవాళ్ళకు ఈ కథ మంచి జవాబు

పాలపర్తి రామచంద్రమూర్తి, [విజయవాడ]

* * *

ఉగాది సంచికకు 'బాగుపడే దెప్పుడు' కథ నూతన శోభను చేకూర్చింది. కొందరైన బాగుపడితే రచయిత శ్రమ ఫలించినట్టే. ముఖ్యంగా సారథి పాత్రను చాల బాగా చిత్రీకరించారు. నానాటికి దిగజారిపోతున్న నాటకరంగం వెనుకనున్న కొన్ని కారణాలను రచయిత ధైర్యంగా రాసారు. తరుచు ఇలాంటి కథలను మీ [మా] పత్రికలో ప్రచురించిన నాటకరంగానికీ దోహదము చేసినవారవుతారు. శ్రీ ఉమామహేశ్వరరావు ఎంతేని అభినందనీయులు.

పి. రాధాకృష్ణ రాజా [బెంగుళూరు]

* * *

సాధారణ ఉగాది ప్రత్యేక సంచికలో కుమారి పద్మిని జవాబులన్ని సూటిగా నిర్భయంగా ఉన్నాయి. పద్మశ్రీ వ్యయంతో కూడ ఇంటర్వ్యూలు బాగున్నాయి. ముఖ్యంగా యూపారి బాలెట్‌లో వచ్చిన వారందరికీ మీ పత్రికద్వారా నా శుభాకాంక్షలందజేస్తున్నాను. సి. ఎస్. నారాయణగారి 'మేఘమాల' పూర్తయింది. ఈ సీరియల్ చాలా బాగుంది. రచయిత అందరికీ అర్థమయ్యే విధంగా చక్కని భాషలో నడిపించారు కథని. నారాయణగారి నవలల్లో ఒక ప్రత్యేకత గోచరిస్తుంది. ముఖ్యంగా ప్రేమ సన్నివేశాలు, సెక్సు విషయంలో అతి సున్నితమైన భావాలతో నడిపిస్తారు కథని. ఆయన నవలల్లో వున్న ప్రత్యేకత యిదీ! 'బాగుపడే దెప్పుడు' కథ నేటి మన నాటక రంగానికి ప్రతిబింబం! రచయిత వున్న విషయాలను నిర్భయంగా వెలువరించారిందులో.

కుమారి వి. లక్ష్మి, [శ్రీకాకుళం]

వ్యాసాలు

ఆ. ప్రసాదరావుగారి "ఆంధ్రప్రదేశ్ సమగ్రతకి ఆంధ్రుడు బలి పశువు" అను వ్యాసం చదివాక ఈ లేఖ వ్రాయవలెననిపించింది. తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడాలని చేసే ఉద్యమము నడుపబడి సంవత్సరము దాటి పోయింది. మనదేశంలో అంతకాలంగా సాగిన ఉద్యమాలు స్వతంత్రం వచ్చిన తరువాత వేరే లేవనే చెప్పాలి. విశాలాంధ్ర ఏర్పడ్డ దగ్గర నుండి తమకెంతో అన్యాయము జరిగిందని తెలంగాణా పౌరులు కొంతమంది అనుకుంటున్నట్లే, సర్కారు, రాయలసీమలోని పౌరులలో కూడా కొంతమంది అదేవిధంగా తమ ప్రాంతాలకు కూడా అన్యాయం జరిగిందనుకుంటున్నారు. కాకపోతే ఒక విషయం మాత్రము ఆలోచింపవలసి ఉంటుంది.

గమనిక

ఉత్తరాల శీర్షికకి రాసేవారు ఈ క్రింది నియమాలు పాటించాలని మనవి: 1. ఉత్తరాలు వీలయినంత చిన్నవిగా ఉండాలి 2. రాసేవారి పూర్తి పేరు, చిరునామా ఇవ్వాలి 3. ఇంగ్లీషు లిపిలో అక్షరాలు రాయరాదు 4. కాగితానికి ఒకవయిపునవే రాయాలి. 5. సిరాతోనే రాయాలి. —సం॥

మన ఆంధ్రదేశము మొత్తములో రాయలసీమ తక్కిన ప్రాంతాలకన్నా ఎంతో వెనుకపడి, కరువు కాటకాలకు ఏటా లోనవుతున్నది కదా? మరి ఈ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమము అక్కడ ఉత్పన్నమవక, ఒక్క తెలంగాణాలో మాత్రమే ఎందుకు ఆవిర్భవించింది? అసలు తెలంగాణా వెనుకపడ్డ ప్రాంతమని వాళ్ళంతా అటున్నప్పుడు 'రెవిన్యూ సర్‌ప్లస్' ఎలా వచ్చింది? అది ఇన్ని కోట్లు అయినదాకా ఎలా ఊరుకున్నారు? ఆ డబ్బు ఎక్కడ ఖర్చు పెట్టేరు? ఎవరి బాధ్యత ఎంత మొదలగునవి ప్రజలకు ఎందుకు తెలియపర్చదు ప్రభుత్వము

నిజం చెప్పాలంటే మనకు సరియైన నాయకత్వము ఎప్పుడూ లేదు ఆంధ్రులకు ఐకమత్యము అసలే లేదు. ఎంతో చదువుకొని, పెద్ద పదవులలంకరించిన వాళ్ళే నానరే కులాభిమానంతో [illegible] ఉండినవాళ్ళే తెలుగువాళ్ళకు భాషాభిమానములేదు ఆఫీసులలోగాని బయటగాని ఇద్దరు తెలుగువాళ్ళు కలుస్తే ఇంగ్లీషులో మాట్లాడుకుంటారు, లేదా హిందీలో. తెలుగులో మాట్లాడడమంటే నామోషి అయితే వీరి తెలుగు చక్కగా మాట్లాడే శక్తి లేనందువల కాదు నామోషి, తెలుగులో మాటాడితే గౌరవహాని అని అనుకోవడంవల్లనే అందువల్లే ఇతర పట్టణాలలో ఉన్న తెలుగువాళ్ళు కొందరు మా పిల్లలకు తెలుగు రాదండీ అంటూ ఇంగ్లీషు, హిందీలలోనే మాటాడేది అని గొప్పగా చాటి చెప్తారు. అదే అరవవాళ్ళు, ఇతర ఏ భాషల వాళ్ళయినా అయితే ఉమ్మి వేస్తారు అట్లాంటి మాటలకు. ఇక కులాభిమానాలు ఎంతవరకు ఉంటాయంటే, తెలుగు అసోసియేషన్లు ఒకటిగాక ఎన్నో ఏర్పడి తగవులు, పోట్లాటలతో సభ్యత ఉన్న ప్రతివాళ్ళకు అసహ్యం కలిగించేట్లుగా అధ్వాన్న స్థితిలో ఉంటవి. అందువల్ల అసలు జాతిగా ఆంధ్రులకు, ఐకమత్యమునను, ఏకనాయకత్వమునకు పొత్తు కుదరదేమో అనుకుంటాను.

తెలుగు రాష్ట్ర మేర్పడి ఇన్నేళ్ళయినా, తెలుగు భాషంటూ ఒకటుందని అది మన దేశంలకి హిందీ తరువాత అత్యధికులు మాట్లాడే భాషని ఎందరకు తెలుసు. తెలుగు నాడన్నా, తెలుగు ప్రజలన్నా కేంద్రానికి ఎప్పుడూ చిన్నచూపే. అది, ఇది అని చెప్పడం ఎందుకు, అన్నింటా తెలుగు దేశానికి అన్యాయం జరుగుతుంది కాని మనము ఎన్నిక చేసి పంపించిన నాయకులు, ఎమ్. పి లు ఎన్నిసార్లు పార్లమెంటులో మాట్లాడేరు. అసలు వాళ్ళు మాట్లాడినట్లు పత్రికలలో ఎప్పుడైనా ఎవరైనా చూచారా? మన తెలుగు ప్రజల సంక్షేమానికై ఏమి చేశారు? తెలుగు ప్రజలు ఎందువల్ల వీటిని గురించి ఆలోచించరు. ఏ ప్రజలకైనా వాళ్ల కర్మనిబట్టే నాయకులు దాపురిస్తారు అందుచేత మనకు కేవలము చేతులెత్తు నాయకులుమాత్రమే లభించారు ఒండొరులను దుమ్మెత్తి పోసుకోవడం తెలిసినంతగా ఒకరి కొకరు సహించి, అందరూ కలసి అందరి మంచికీ పాటుపడటం మనకు తెలియదు. మన భాషపట్ల, మన సంస్కృతిపట్ల, మన రాష్ట్రంపట్ల అభిమానమున్న నాయకులు మనకు లభించాలి. అప్పుడు వాళ్ళు తెలుగు ప్రజ

నీరవత

ఏ సుదూరాల తీరాలకో
ఏ నీరవ సీమలకో
పోవాలనివుంది
ఎగిరి
పోవాలనివుంది!

ప్రకృతి మాత వడిలో
పరవశించి పోవాలని
విశ్వ చిత్రకారుని
వైచిత్రి కనుల జూడాలని
ఏ సుదూర తీరాలకో
ఏ నీరవ సీమలకో
పోవాలని వుంది
ఎగిరి
పోవాలనివుంది!

మమతా, బాంధవ్యాలు
మమకారపు బంధాలు
మానవుడే స్వార్థంతో
పన్నిన వల దారాలు! అందుకే ..
ఏ సుదూర తీరాలకో
ఏ నీరవ సీమలకో
పోవాలనివుంది
ఎగిరి
పోవాలని ఉంది!

ఇలనుండీ కలకంటూ,
కలలో కాపురముంటూ,
కలవరింతవోలె బ్రదుకు
గడపడమే నా మార్గం?
ఈ స్వార్థం, ఈ ద్వేషం,
ఈ క్రౌర్యం, ఈ మోసం
ఎటుచూసిన కళ్ళు, దగా
అందుకే.....
వీటన్నిటి కడవి, వడిగ
ఏ సుదూర తీరాలకో
ఏ నీరవ సీమలకో
పోవాలనివుంది
ఎగిరి
పోవాలని ఉంది!

—ఇ. రాధామురళి

లందరినీ ఏకంచేసి, మేలొ్కలిపి. మన రాష్ట్రాన్ని భారత దేశంలో ఉన్న రాష్ట్రా లన్నిటిలో గొప్పదనిపించ గలరు. అంతదాకా మన రాష్ట్రమూ ముక్కలయి చిన్నాభిన్నము కాకుండా ఉంటుందని ఆశిద్దాము.

ఎస్. ఎస్. సోమరాజు, [న్యూఢిల్లీ]

*   *   *

"ఆంధ్రప్రదేశ్" సమగ్రతకే ఆంధ్రుడు బలి కావు" అనబడే ప్రసాదరావుగారి వ్యాసం చదివాను. ఈ వ్యాసం తెలంగాణాలోని సమైక్యతావాదులకు ఆందోళన కలిగిస్తుంది. కాపున మీరు ఇటువంటి వ్యాసాలనుకాక తెలుగుజాతి సమైక్యత నుద్దేశించి వ్రాసిన వ్యాసాలను ప్రచురించి "ఆంధ్రప్రదేశ్" సమగ్రతకే కొంతైనా తోడ్పడగలరని ఆశిస్తున్నాను.

బి. దేవిప్రసాద్, [తిమ్మాపురం]

*   *   *

తెలంగాణా సమస్యపై ఉత్తరాలను ప్రచురిస్తున్నందుకు మనసారా అభినందిస్తున్నాను. తెలంగాణ సమస్యకు తెలంగాణ వ్యక్తులు అంటే అధికారుల స్వార్థం కారణంగా భావిస్తున్నాను. ఇటీవల ఎమ్. ఎస్సి. అడ్మిషన్లను ఉస్మానియా విశ్వవిద్యాలయంవారు చేశారు. నాన్ ముల్కీలకు ప్రత్యేక కేటాయింపు ఈ విశ్వ విద్యాలయంలో ఉంది. అయినా కొందరు నాన్—ముల్కీలు, తెలంగాణ ముల్కీ సర్టిఫికేట్లు తెచ్చి ప్రవేశం తీసుకున్నారు. అసలే తెలంగాణ విద్యా విషయకంగా ఎంతో వెనకబడి ఉంది. 'స్వార్థం' అన్నది తెలంగాణ జిల్లా అధికారులలో కనబడకపోవటం లేదు....ఉస్మానియా విశ్వవిద్యాలయమునకు సంబంధించిన స్వంత కళాశాలలో నిజాం సైఫాబాద్, యూనివర్శిటీకాంపస్ బి. యస్. సి. ప్రవేశార్హత నిబంధనలో "ముల్కీ సర్టిఫికేటు" ఒక అంశం. అప్పుడు "ముల్కీలు" తీసుకురాని వాళ్ళు ఇప్పుడు ఏ విధముగానో ముల్కీలు తీసుకవచ్చి, సోదరులకు రావలసిన సీట్లను పొందుతున్నారు. "అన్యాయం" సుస్పష్టంకదా! ఈ విషయంలో 'తెలంగాణ ప్రాంతీయ సంఘం' యూనివర్సిటీ అధికారులు తగు రీతిగా ఆలోచిస్తారనే ఉద్దేశంతో, పత్రికపై ఉన్న ఎనలేని అభిమానంతో రాసిన లేఖ ఈ లేఖ "అసంతృప్తి" ఎంత నిండియుందో అన్న విషయాన్ని ప్రకటిస్తుందని నా ఉద్దేశం....

యస్. వెంకట రంగారెడ్డి, కొల్లాపూర్.]

*   *   *

మాల కొండయ్యగారి "నవ్వు—నవ్వించు" అన్న వ్యాసం ఎప్పుడూ ఏడుస్తూండే వారికి చక్కని గుణపాఠం. రచయితగారికి నా కృతజ్ఞతలు.

విష్ణు, యూ అండ్ జార్జి, [రామవరం]

సీరియల్

సి. ఎస్. నారాయణగారు వ్రాసిన 'మేఘమాల' సీరియల్ చాలా బాగుంది. కథా గమనము సంభాషణలు చాలా చక్కగా వర్ణించినారు. సీరియల్ ముగింపు నన్ను చాలా సంతోషపరచినది.

ఎస్. వి. కృష్ణయ్య, [హైదరాబాద్]

ఉత్తరాలు

సినిమా

రవిశర్మగారి ఉత్తరం (27—3—70 పత్రిక) చూశాక ఈ ఉత్తరం రాయాలనిపించింది.

'తల్లా—పెళ్లామా?' చిత్రంలో న్యాయానికి కోడలి పాత్ర స్వతహాగా మంచిదే. ప్రేమించిన వాని కోసం ధనాన్నీ, తండ్రినీ వదలి వచ్చింది (కాని అదే ఆమె అహంకారాన్ని తర్వాత పైకి తెస్తాయి) అందుకే దర్శకుడు ఆ పాత్రను గయ్యాళిగా చిత్రించలేదు. ప్రత్యక్షంగా అత్తాకోడళ్ళు తలపడక పోయినా, జరిగిన ప్రతి చిన్న విషయాన్నీ భూతద్దంలో పెద్దది చేసి చూస్తుంది కోడలు. అత్త త్యాగమూర్తి కావడం వల్లనే కొడుకును పంపించి వేస్తుంది. కోడలు అర్థం చేసుకోకుండా పరోక్షంగా కొడుకు తల్లికి దూరం అవడానికి తోడ్పడుతుంది. సుఖాలకు అలవాటు పడ్డ ఆమెకు పేదరికం దుర్భరంగా ఉండడం వల్లనే ఆమెలో నిస్పృహ, అత్తపై అదొక కోపంతో కూడిన భావం ఏర్పడి తమ దాంపత్య సుఖం కోసం భర్తను తీసుకు పోదామని చూస్తుందే కాని, తల్లికీ, బిడ్డకూ ఉన్న అనురాగాన్ని గ్రహించలేదు. అందుకే ఆ అనురాగం ఎలాటిదో, ఎడబాటుల్లో బాధ ఎలాటిదో భర్త తెలియజేస్తాడు. రవిశర్మ గారన్నట్లు విడిపోటం బలంగా లేకున్నా ముఖ్యపాత్రలు మూడూ మంచివి, నిండు హృదయం గలవి అన్న అంశం, ఆ సన్నివేశం ఇంకా బలంగా ఉండకుండా చేస్తుంది. భార్యను కూడా మంచి దానిగా (విలన్‌గ కాకుండా) చూపాలన్న భావమే దానికి కారణం. ఏమైనా చిత్రం చివరలో చెప్పినట్లు 'పూజలందెడు దేవి మాతృమూర్తి, ప్రేమ లందెడు మూర్తి గృహిణి' అన్న సూక్తిని యువకులు జ్ఞాపకం పెట్టుకుంటే దాంపత్యం సుఖంగా గడుస్తుందనడంలో సందేహం లేదు.

ఏమైనా ఇలాటి గొప్ప సమస్యను ఎన్నుకొన్న దర్శకుడు రామారావు అభినందనీయుడు. (ఈ కాలములో ఇద్దరినీ సమంగా నిర్లక్ష్యం చేసే వారున్నారు. మారవలసింది ఇరుకుగా ఉన్న దృక్పథాలే!)

సి. భక్తవత్సలరావు (గుంతకల్)

ఫిలిం బాలట్

"ఫిలిం బేలట్" లో వరుసగా మూడు సంవత్సరములనుండి మా అభిమాన ఉత్తమ నటుడు శ్రీ శోభన్‌బాబు ఉత్తమ సహాయ నటుడుగా ఎన్నిక కావడం, గర్వ కారణం. పత్రికకూ నిష్పాక్షిక ఫిలిం బేలట్‌కూ, బేలట్ విజేతలకూ మా అభినందనలు.

కుమారి బాపాని విమలకుమారి, శ్రీమతి దన్నా నాల రజనీకుమారి, కుమారి ప్రసన్న [ఏలూరు]

గమనిక

తే. 17–4–70 సంచికలో ప్రచురించిన 'పచ్చవిప్లవం' వ్యాసం రాసినవారు 'దేవి సత్యనారాయణ.' రాసినవారి పేరు పొరపాటున వదిలివేయడం జరిగింది. పొరపాటుకి చింతిస్తున్నాము. —సం॥

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 1—5—'70
శ్రీ సాధారణనామ సం॥ చైత్ర బహుళ ఏకాదశి
సంపుటము : 63 సంచిక : 33

స్థాపితము:
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

పోస్టు ద్వారా


సంవత్సర చందా	26.00
6 మాసముల చందా	13.00
3 మాసముల చందా	6.50

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
'భలేపాప'లో బేబీరాణి


గురించి
వాళ్లలో వాళ్లే
దెబ్బలాడు
కుంటు
న్నారు
కొత్త కాంగ్రెస్
జగ్‌జీవన్‌రాం నాయకత్వం
విచ్ఛిన్నత
రోజురోజుకీ పెరుగుతున్నది
స్వతంత్ర పార్టీ
విచ్ఛిన్నతా? ఫరవాలేదు, అన్ని పార్టీలూ అలాగే వున్నాయి

అపోలో-13 అద్భుతగాథ



అపోలో-13 వ్యోమగాములు: జాన్ స్విగర్ట్, జేమ్స్ లోవెల్, ఫ్రెడ్ హైసే.

నూరు ముప్ఫయి సంవత్సరాల క్రితం కొందరు శాస్త్రజ్ఞులు విమానాలు శబ్దం వేగంకన్నా వేగంగా వెళ్ళవని అంటూ ఉండేవారు. ఇప్పుడు ఈ రకం వేగం సర్వ సామాన్యం. చంద్రుడిమీద మానవుడు దిగితే తను 'టోపీని తింటా' నని ఒక బ్రిటిష్ ఖగోళ శాస్త్రజ్ఞుడు పందెం కాశాడు. టోపీని తిన్నారా లేదా సరిగ్గా తెలియదుకాని సాంకేతికాభివృద్ధి వేగాన్ని ఊహించటం అతి కష్టం అని మాత్రం ఇటువంటి ఉదాహరణలు నిరూపిస్తాయి! (దీనికి 'విరుద్ధం' అనిపించే కథ ఒకటి ఇటీవల వెలువడింది; రష్యాలో 'పాలి వాటర్' లేక 'బహుజలం' కని పెట్టబడిందనే ప్రకటన కొంత పొరపడిన ప్రయోగం ఆధారంగా వెలువడిందని తర్వాతి ప్రయోగాలు లేక పరిశోధనలు తెలుపుతున్నాయని ఇటీవలే ఒక రచయిత ఒక బ్రిటిష్ పత్రికలో రాశాడు. సిద్ధాంతానికి విరుద్ధంగా ప్రయోగం ఉన్నట్లు ఉంటే ప్రయోగమే తప్పు అనవచ్చు నన్నాడు!) ఈ సాంకేతాభివృద్ధి చిన్నవిగా కనిపించే ఎన్నో విషయాలు అతి ముఖ్యమయిన పరిణామాలకి దారి తియ్యవచ్చు. ఇవి మంచివి కావచ్చు, చెడువి కావచ్చు.

అపోలో చంద్రలోక ప్రయోగాలు అతి జాగ్రత్తతో జరిగినవి. వాటి ప్రయోగాలలో శాస్త్రజ్ఞులు తీసుకున్న జాగ్రత్త అని ఊహించటంకూడా కష్టం. మూడు ప్రయోగాలు నమ్మశక్యం కానంత చక్కగా జరిగాయి, ముగిశాయి. నాలుగవది మాత్రం సర్వ మానవజాతిని ఆందోళనతో నింపింది. ఎందుచేతనంటే గణించే యంత్రాల సహాయంతో కూడా ఊహించలేనటువంటి ప్రమాదం అపోలో 13 కి సంభవించింది. దీని ఫలితంగా చంద్రలోకం మీదకి అంతరిక్ష నావికులు దిగే ప్రయత్నాన్ని వదులుకుని వారిని భూమి మీదకి తెప్పించి వెయ్యవలసి వచ్చింది. ఒక ప్రఖ్యాత రచయిత అన్నట్లు ఈ ప్రమాదమే గనుక అంతరిక్ష నావికులు తిరిగి వచ్చేటప్పుడు జరిగిఉంటే సురక్షితమయిన తిరుగు ప్రయాణం వీలయ్యేది కాదు. ముగ్గురు అమెరికన్ అంతరిక్ష నావికులూ తిరిగి భూగోళంమీదకి సజీవంగా వచ్చినందుకు ప్రపంచం అంతా హర్షిస్తోంది. వారి ధైర్య సాహసాలు ఆదర్శ ప్రాయమయినవి, వారి ప్రయాణాన్ని నడిపించిన శాస్త్రజ్ఞుల నేర్పరితనం అవర్ణనీయం. సుఖాంతం అయిన ఈ విషాదఘట్టం సాంకేతిక నిపుణులందరికీ ఒక గుణపాఠం కావచ్చు. కాని, మానవుడి ధైర్య సాహసాలవల్లనే ఏ రంగంలో నయినా పురోగమనం వీలవుతుందని అపోలో 13 అద్భుతగాథ నిరూపిస్తుంది.

—(ఎ. వి)



తమ సంతానం బార్బరా, జెఫ్రీ, సుసాన్‌లతో మార్లిన్ లోవెల్, భర్త జేమ్స్, మరొక కొడుకు [illegible]



ఫ్రెడ్ హైసె, భార్య మేరీ తమ పిల్లలు స్టీఫెన్, మేరీ, ఫ్రెడరిక్‌లతో.

అజ్ఞానాన్ని వినియోగించే ఉపాయాలు

అజ్ఞానులయిన ప్రజలని పరిపాలించటానికి ఉపయోగపడే ఉపాయం— వారి ధ్యాసని అత్యవసరమయిన విషయాల నుంచి అనవసరమయిన విషయాల మీదకి మరల్చటమే. రెండేళ్ళ కింద రాజస్థాన్‌లో నీటి కరువు వచ్చింది. ఆ సమయంలో హిందీ అమలు పరచటం మీద ప్రజల దృష్టిని మరల్చారు. ఆహారం కోసం అల్లరులు జరగవలసింది పోయి భాష కోసం అల్లరులు జరిగాయి.

డా. జకీర్ హుస్సేన్ మరణం భారత చరిత్రలో ఒక అతిముఖ్యమయిన ఘట్టం. ఆయన మరణానంతరం నీతి, కీర్తిని అంతరాత్మ జయించింది. అంతరాత్మ, పిరికితనం ఒకటే అని ఆస్కార్ వయిల్డ్ అన్నాడు. 'అంతరాత్మ' ఒక రకమయిన పుణ్యవస్తువు. దారిద్ర్యం ధర్మమా అంటూ జీవితం సంతృప్తికరంగా ఉంటే అంతరాత్మ మాట ఎందుకు వినరాదు? ఇదీ డా. జకీర్ హుస్సెయిన్ మరణం తర్వాత వెలువడిన ప్రశ్నలలో ఒకటి. 'పేదరికం బహిష్కరించండి!' నినాదం శ్రీ సి. సుబ్రమణ్యం పోయిన డిశంబరులో పలికిన నినాదం.

అప్పులు

బాంకులు జాతీయం అయిన తర్వాత ప్రజలలో ఉత్సాహం పెరిగిందని గ్రహించి [ఈ ఉత్సాహాన్ని తెలుపటానికి శ్రీమతి అరుణా అసఫ్‌అలీ సహాయపడ్డారు] మేడమ్ గాంధీగారు తాకట్టు లేకుండా టాక్సీవారికి, స్కూటర్ నడిపే వారికీ అప్పులు ఇప్పిస్తామన్నారు. శ్రీ కృష్ణ మీనన్ సలహాని అనుసరించి అప్పుల అర్హతకి కొన్ని ప్రమాణాలని తయారు చేశారు. ఆస్తికీ, అప్పుకీ సంబంధం లేదన్నారు. పని చెయ్యగల డమే ఆస్తికి అర్హత అన్నారు.

నెలలు గడిచాయి. కాని, అప్పులు పుట్టలేదు. బాంకులలోని నిధులు మేడమ్ గాంధీవీ, శ్రీ కృష్ణమీనన్‌వీ అయితే కదా పుట్టటానికి? అవి కొన్ని లక్షలాది జనానివి. వారి కష్టార్జితాలకి అవి చిహ్నాలు. కష్టపడి ఆర్జించే వారిలో కమ్యూనిస్టులు కూడా ఉన్నారని వేరే చెప్పనవసరం లేదు. కొంత కాలం ఇదంతా సుప్రీంకోర్టు తప్పు అన్నట్టు కొందరు మాట్లాడారు. చివరికి పార్లమెంటులో బాంకింగ్ బిల్లు ఒకటి అమలులోకి వచ్చింది. మరి రాళ్ళు కొట్టేవాళ్ళకీ, రిక్షాలు లాగేవాళ్ళకీ అప్పులు ఇచ్చేది ఎవరు? ఉద్యోగాలు లేని ఇంజనీర్లు ఇక సంతోషించవచ్చు— ఎందుకంటే గ్రామ ప్రాంతాలలో పెట్రోలు బంకులని వాళ్ళకి ఇప్పిస్తారుట.

బిజూ పట్నాయిక్

రాష్ట్రాలలో పరిస్థితి బాగా విషమిస్తోంది. ఒరిస్సాలో శ్రీ బిజూపట్నాయక్‌గారు తమ రాష్ట్రంలో మేడమ్ గాంధీగారి అధికారం నిరంకుశం కాదని నిరూపించారు. ఆయనని శిక్షించటానికి జరిగిన ప్రయత్నాలు ఫలించలేదు. ఒక ఉత్తరప్రదేశ్‌లో శ్రీ కమలాపతి త్రిపాఠీ శ్రీ చరణ్‌సింగ్‌తో వేగటం కష్టం అని పార్లమెంటుకి ఎన్నిక అవటానికి ప్రయత్నిస్తున్నట్టు ప్రకటించారు. శ్రీ దరోగా రాయ్ బీహారులో తమ ప్రభుత్వం నిలవాలంటే ఊరికే ఉండటమే మంచిదని అనుకున్నట్టున్నారు. పాత కాంగ్రెసు నాయకులు కొందరు కోర్టువారి విమర్శకి గురి అయ్యారు కాని శ్రీ దరోగారాయ్ ఈ విమర్శని పాతిపెట్టేస్తున్నారు.

పంజాబు పార్టీ అల్లకల్లోలంగా ఉంది. మహారాష్ట్రంలోనూ పరిస్థితి బాగాలేదు: ఇక మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లలోనూ, హర్యానాలోనూ ముఠా రాజకీయాలకు అనుకున్నంత తక్కువ కాదని ఎందరో గ్రహిస్తున్నారు.

రాజస్థాన్‌లో జరుగుతున్న క్రిమినల్ కేస్ జరుగుతూనే ఉంది. మేడమ్ గాంధీ అనుచరులలో ముఖ్యులయిన శ్రీ ద్వారకాప్రసాద్ మిశ్రాని సుప్రీం కోర్టువారు ఖండించారు. [వారు తెలిసిన ఒక పెద్ద మనిషి అన్నాడు— ఇప్పుడు శ్రీ మిశ్రా ఒక గ్రాండ్ యునీక్ అయిపోయారు, అని.]

శ్రీమతి గాంధీ ఇతర కాబినెట్‌మంత్రుల మధ్య విశ్వాస పూరితమయిన భావాలు లేవు. ఒకరిని చూస్తే ఒకరికి అనుమానం, అపనమ్మకం. ఇదంతా పుకార్లు అనవచ్చు కాని తరుచు పత్రికలలో మహాజరులు, దూషణాలు, ఆరోపణలు కనిపించటం చేత పార్టీలో ఏవో గడబిడలు జరుగుతూ ఉన్నాయని ఊహించవచ్చు.

దీనంతటికీ తోడు సుప్రీం కోర్టులో వైర దోరణి, పార్లమెంటు నాయకుల సఖ్యంతో వెయ్యం. ధనవినియోగం ఆరోపణలు.....

గత్యంతరం

పోనీ, గత్యంతరం ఏదయినా ఉందా అంటే అదీ లేదు. ప్రభుత్వంతో పాటే నడుస్తున్నారు ప్రతిపక్షాలవారు— బాధ్యతారహిత ప్రవర్తనలోనూ అవకాశవాదంలోనూ.

అందుచేతనే, ముఖ్యంకాని విషయాలతో జనాన్ని మభ్య పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. సంస్థానాధీశ్వరుల రాజాభరణాలు, ఇండియన్ సివిల్ సర్వీస్ వారి ఉద్యోగ సదుపాయాలూ రద్దు చెయ్యాలనటం ఈ రకం ప్రయత్నాలే. ఇవి రెండూ రద్దయిపోతే భారతదేశంలో దారిద్ర్యం రద్దయి పోతుందనే ప్రచారం జరుగుతున్నదనవచ్చు.

ప్రణాళికా సంఘాల సృష్టికర్తలలో ఒకరు డా. త్రిలోకసింగ్. వారు 'భారతదేశంలో దారి[ద్ర్యం] సాంఘిక పరిణామం' అనే పుస్తకం రా[సిన] పీటికలో రచయిత యిలా అన్నారు.

'భారతదేశంలో దారిద్ర్యం చాలా [వరకు] గ్రామీణ సమస్యే...భారత దేశంలో దారి[ద్ర్యం] పోవాలంటే మా సాంఘిక, ఆర్థిక పునాదులని [పున]ర్నిర్మించాలి.

'ప్రధాన విషయాలు కొన్ని మాట[లలో] చెప్పవచ్చు. కొన్ని ప్రాంతాలని మినహాయి[స్తే] భారతదేశంలోని గ్రామీణ సమాజం రెండు [రకా]లది: 1. రయితాంగం. 2. ఇతర గ్రామీణ[ులు]. రయితులు ఉండే గ్రామాలు రెండు ర[కాలు]. ఒక రకం గ్రామాలలో భూమి రయితు[లది.] ఇటువంటి గ్రామాలు మదరాసు, బొంబా[యి,] బీహార్, అస్సామ్, మొదలైన ప్రాంతా[లలో] ఉన్నాయి. ఉత్తర ప్రదేశ్‌లో కూడా [కొన్ని] ప్రాంతాలలో ఉన్నాయి. రెండవరకం గ్రా[మా]లలో జమీందారీ పద్ధతి ఉంది. ఇవి బెంగా[లు,] బీహారు, మదరాసు, ఒరిస్సా, ఉ. ప్ర., మ. [ప్ర.] లలో కూడా ఉన్నాయి. ఇక్కడ భూమి[పై] అధికారం కౌలుదారులది. ఈ అధికారం పారంపర్యంగా వస్తుంది. వీరు అద్దెలని 'స[...] వారికి ఇస్తారు. వీరు ప్రభుత్వానికి 'అద్దె[లు'] ఇస్తారు. ఈ 'అద్దెలు' [లేక సిస్తులు] వసూలు చేసే బాధ్యత వీరిదే.

సూచనలు

'భారత గ్రామానికి సరిపోయే పద్ధతి [ఎ]వంటిదయి ఉండాలి? ప్రతి ప్రాంతం[లో] ఫలవంతమయిన వ్యవసాయం జరగాలంటే నా[లుగు] విషయాలు ముఖ్యంగా చూసుకోవాలి: 1. సంత భూవైశాల్యం, 2. పరిపాలన, 3. పె[ట్టు]బడి, 4. సరయిన పంటని ఇచ్చే సాధన[ాలు] వాడటం...

పయి నాలుగింటిని గురించి రచయిత [...] సూచనలు చేశారు. ఇవి సర్వసామాన్య[ంగా] అందరూ అంగీకరించేవే. అంతేకాక, ఆయన [...] పరిస్థితులు సంస్కరణ అతి అనుకూలంగా [...] యనీ., పోతే తిరిగి రావనీ అన్నారు. యు[...] నుంచి తిరిగివచ్చేవారు గ్రామాలలో నాయక[ులు] కాగలరని శ్రీ త్రిలోక్‌సింగ్ అభిప్రాయం[.] ఈ నాయకత్వానికి కావలసిన తర్ఫీదు సెయి[...] లోనే జరగాలని ఆయన సూచించారు.

శ్రీ సింగ్ స్వీడెన్‌లో ఉన్నారు ఇప్ప[ుడు.] పల్లెలలో ఉండేవారి గొడవ వారిది, మేడమ్ గా[ంధీ]గారి గొడవ వారిది.



(గత సంచిక తరువాయి)

భేతాళుడు మరొక కథ చెప్పడం ప్రారంభించాడు.

గౌరీదేవి తండ్రి అయిన హిమవత్పర్వతం శిఖరంమీద కాంచనపురి అనే పట్టణం వుంది. ఆ పట్టణం చుట్టూ వున్న రత్నప్రాకారం కిరణాలు నిరంతరం ఆకాశాన్నెదిరిస్తూ వుంటాయి. ఆ పట్టణం రాజు విద్యాధరపతి అయిన జీమూతకేతువు. అతని భార్యపేరు కనకవల్లి. ఆమె శేష యశస్సనే విద్యాధరరాజు కుమార్తె. ఆ సుందరి మన్మథుని ఖ్యాతికి ఆటపట్టులాగ వుండేది.

వారిద్దరికీ కల్పవృక్ష వరంతో జీమూతవాహనుడనే కుమారుడు కలిగాడు. అతడు గుణసంపదల సమూహం. త్యాగసుభగమయిన అతని యశస్సును స్వర్గాంగణంలో, అమర పర్వతమయిన మేరుపర్వతంమీది బంగరు పొదరిండ్లలో గానం చేస్తారు.

సర్వగుణ సంపన్నుడయిన తన కుమారునికి తండ్రి రాజ్యానికి పట్టం కట్టి నానాసిద్ధులకు అమృతఫలంవంటి కల్పవృక్షాన్ని అతనికి బహూకరించాడు.

ఈ ధనం, యౌవనం కాంతల కటాక్ష విక్షేపంలాగ చపలమయింది. ఈ జీవితంకూడా అలాంటిదే అనుకొని జీమూతవాహనుడు ఆ కల్పవృక్షాన్ని అర్థులకు దానం చేశాడు. ఆ కల్పవృక్షం ప్రపంచంలో దారిద్ర్యం తొలగించడానికి ఉండినట్టిది; అది ఒకక్షణంలో ప్రపంచాన్నంతా సువర్ణపూర్ణం, సువర్ణమయం చేసి, మరుగైపోయింది. కులక్రమాగతమయిన కల్పవృక్షం కూడా ఆ అపూర్వ త్యాగి దానమిచ్చి వ్యయం చేయగా, మూడు లోకాలూ ఆశ్చర్యపడ్డాయి.

సురతరువయిన కల్పవృక్షం అతని వద్ద లేదని తెలిసి శత్రుసామంతులు అతనిరాజ్యం హరించివేద్దామనే కుట్రతో ఒక్కటిగా అయ్యారు. జీమూతవాహనునికి విద్యాధర విద్యతో ఈ సంగతి తెలిసి, వారిని యుద్ధములో బాధపెట్టడం ఎందుకనే భావంతో, రాజ్యంపట్ల నిస్పృహతో రాజ్యమే వదిలిపెట్టివేశాడు. అక్కడినుంచి ఖేచరుల విలాస నిలయమయినది, సిద్ధులు నివసించేది అయిన మలయపర్వతానికి తన తలిదండ్రుల తోపాటు బయలుదేరాడు.

మలయపర్వతం సానువులలో సర్పాలు ఆడుకుంటున్నాయి. సిద్ధులు గుంపులు గుంపులుగా నివసిస్తున్నారు. చంద్రునంత లాగ నీలకంఠ కాంతులు (నల్లని మెడ కాంతులు, నెమళ్ల కాంతులు) వ్యాపిస్తున్నాయి. ఎటుచూచినా, నడయాడుతున్న సిద్ధకాంతల పాదపద్మాల కాంతులు చూడగా, సమీపంలో వున్న సముద్రం లోని పగడపుతీగలువచ్చి ముట్టుకున్నాయా అన్నట్టుంది. ఎటుచూచినా తెల్లని

పవ్వులాటి, ముత్యాల దండలలాటి మక రందం తెల్లని గుడ్డలాగ కప్పి వుంది. చందన వృక్షాలు, అగరు వృక్షాలూ అంతటా అలంకారంగా వున్నాయి. సర్వ సిద్ధులకు ఆశ్రయంగాను, సకల సంపద లకు విషయంగాను వుంది, ఆ మలయ పర్వతం. అలాంటి పర్వతంచేరి, అక్కడ, ఉలిదంద్రుల సపర్య చేస్తూ వున్నాడు.


ఒకమారు అతడు మధుకరుడనే నర్మ సచివునితోపాటు ఆ పర్వతంమీద విహ రిస్తున్నాడు. అక్కడ ఒకచోట అతనికి సుందరమైన అడవి కనిపించింది. దాని పేరు కుసుమ మరందం. దానిలో ప్రవే శించారు. సౌరభాలు విరజిమ్మే పూల తీగలు అందంగా వున్నాయి. ఖేచర స్త్రీలు అందెల కాళ్లతో తన్నగా అశోక వృక్షాలు పూచి రాగులసలె కనిపిస్తు న్నాయి. విద్యాధర వనితలు మధుపానం చేసి మిగిలినదానిని పుక్కిలించగా, పొగ డలు పూవులనే ముఖాలు ఎత్తి ఆవులిస్తు న్నట్టుంది. దివ్యాంగనల తుంగస్తనాలనే తరగలతో మందార వృక్షాల మకరం దాలు నింపుకొని, వాయువులు వీస్తు న్నాయి. తుమ్మెదలు వనంపైకి ఎగిసి దట్టంగా కమ్ముకొనగా మేఘాలు ముసురుకొన్నాయనే భ్రాంతితో ఆడ నెమళ్లు బంగారు అరటితోటలలో నృత్యం చేస్తున్నాయి. కిన్నర కాంతలు ఉత్కంఠతా సుకుమారంగా పాడుతుండగా ఆడజింకలు కదలక మెదలక కన్నీరు కురిపిస్తూ వింటున్నాయి.

అక్కడ గౌరీదేవి ప్రాసాదం కనిపిం చింది. అది ఉన్నతంగా వుంటూ కైలాస శిఖరపు శోభతో వుంది. ఆకాశ గంగావదే ఆ ప్రాసాదంపై కదిలే పతాకలాగా వుంది. తన కుమార్తెమీది వాత్సల్యంతో హిమవంతమే తన తెల్లటికాంతులతో దిగంతాలను తెల్లగా చేస్తూ ప్రాసాద రూపంలో నిలబడి వున్నదా అన్నట్టుంది.

ఆ దేవీప్రాసాదం గర్భాలయంలో చెవులకు అమృతంవంటిది, హృదయా నికి ఆనందపు సెలయేరు వంటిది అయిన గీతం వినబడింది. ఆ గీతంవెంట వీణా స్వనమూ వినిపించింది.

జీమూతవాహనుడు కుతూహలం కొద్దీ గిరిజాలయంలో ప్రవేశించాడు. అక్కడ ఒక కన్యకను చూచాడు. ఆమె ఈ సంసారం సారమే మూర్తీభవించినట్టుంది. కమలాలవంటి కళ్లు. పెదాలు పగడాల కాంతితో, చిగురుటాకుల మార్దవంతో ఉన్నాయి. పాదాలకు ఆ రంగు ఎలా వచ్చి వుంటుంది అంటే, ఆమె రాగసాగరంలో సంచరించడంవల్ల ఆ ఎర్ర రంగు పాదాలకు అంటుకుందేమో! ఆమె పిక్కలు లావణ్యకమలం తూడులులాగా వున్నాయి. అవి ఆమె కాంతి అనే హంస ఆరగించ డానికి వున్నాయా అన్నట్టు వుంది. ఆమె ఊరువులు, ఆమె విలాసమయూరం వాలే అరటిచెట్లలాగ వున్నాయి. ఆ రెండు తొడలు ఆమె దేహకాంతి నదికి ఇసుక తిన్నెలవంటివిగాను, రతీదేవికి పట్టుపరుపు వంటివిగాను పుష్పాయుధుని పట్టణపు దంత తోరణ స్తంభాలలాగాను మెరిసి పోతున్నాయి. ఆమె పొత్తికడుపు మన్మ థుని సుందర పట్టణంలాగా వుంది. ఆ పట్టణానికి అగడ్త ఆమె ధరించిన మేఖల. ఆమె లోతయిన నాభి, నూగారు చూడగా, హరుని కోపాగ్నిలో మండిపోయిన మన్మథుడు ఆ మంటల బాధ భరించలేక ఆ నాభీహ్రదంలో మునక వేశాడేమో! ఆ మంటల పొగలే బంగారువాయల నూగారు. పాలిండ్ల మీద ముత్యాలదండల కాంతి మొగ్గలుతొడిగి వ్యాపించి వుంది. దాని చూడగా, చక్రవాకాలు తమ చంచువులతో లేత తామర తూడును పట్టుకున్నాయా అన్నట్టు ఉంది. ఆమె ధరించిన బంగారు గాజులు, కేయూరాల ఇంద్రనీల రత్నాల కాంతులు నల్ల నాగుబాముల లాగా తారుణ్యమనే చందనపు కొమ్మల వంటి ఆమె హస్తాలను చుట్టుకుంటు న్నట్టు వున్నాయి. ఆమె అధరకాంతులతో వనస్థలి చిగురుటాకులను స్మరవసంతులు నిర్మించుకున్నారా అన్నట్టు పెదవులు మెరిసిపోతున్నాయి. స్పష్టమైన నాసికా దండం అలాటమనే గొడుగు వున్నా ఆమె కటాక్ష కాంతులు ఉన్నతంపై ఉద్దం డంగా దాయ భాగానికి దండెత్తాయి. ఆమె ముఖం కమలం. ఆ కమలంమీద ముంగురు లనే తుమ్మెదలు కదలాడుతున్నాయి. సౌభాగ్య మహారాజా ప్రశస్తిని అక్కడే మన్మథుడు వ్రాశాడా అన్నట్టుగా అవి ఉన్నాయి.

జీమూతవాహనుడు అలాటి ఆమెను చూచి, ఆశ్చర్యంతో కళ్లు విప్పుకొని చూచాడు; తన్మయుడైపోయాడు. వెంటనే నరావతారం చెందిన మన్మథునితో కొత్త



రితులు నింపుకొన్నవాడిలా కనిపించాడు.

ఆ కన్య కూడా జీమూతవాహనుణ్ని చూసింది. అతడు అపార సుకృతంతో పండదగినవాడుగా కనిపించాడు. కారుణ్య వృక్షంలాగా వున్నాడు. శరీరం, మాట ప్రశాంతంగా వున్నాయి. తన ధనుస్సు వదలిపెట్టి వచ్చిన మన్మథుడులాగ వున్నాడు. రెండు భుజాలు లక్ష్మీ నివాస భవనానికి స్తంభాలలాగా వున్నాయి. పద్మ వనములినివంటి ఆ కన్య రాజహంసవంటి ఆ రాజహంసను చూసింది. సిగ్గుతో దేహం అణగిపోయింది. ఒళ్లు పులకరించి తరంగాలు కొట్టినట్టయింది. ఒళ్లంతా చెమటపట్టి, దారంలేని ముత్యాల పందిలాగా అయింది. మన్మథబాణాలు హృదయంలో గాటంగా నాటుకుంటున్నాయా అన్నట్టుగా, ఆ పూల బాణాల కేసరాలు వెదజల్లి వ్యాపించాయా అన్నట్టుగా ఆమె పాలిండ్లు పులకించి కొత్త అందం సంపాదించుకున్నాయి.

ఇంతలో జీమూతవాహనుడు సవిలాసంగా ఆమె వద్దకు వచ్చి, తన దంత కాంతులనే కర్పూర ఖండాలను ముందుగా కానుక ఇస్తున్నట్టుగా పలుకరించాడు:

'ఓ సులోచనా, ఏమిటి నీ ఆచార

...బృహత్కథామంజరి

క్రమం? ఎంత అందంగానైనా వుంది? ఇష్టుడయిన వ్యక్తిని పలకరించి స్వాగతమివ్వవద్దా?' అని...

ఇలా అన్న తన కనులనే తుమ్మెదలను ఆమె ముఖ కమలంమీదే పెట్టి పక్కకు తిరిగి ఆమె చెలికత్తెతో ఇలా అన్నాడు. ఆయన ఇటు తిరిగినప్పుడు కుండలాలు కదిలి, ఆ కాంతికి ముఖమంతా కాంతితో వెలిగిపోయింది.

'రసానికి ఆధారమయిన వస్తువు గుణాధారమూ అవుతుంది. అలాటిదాని మీదికి ఎవరికునస్సు పోదు? వీడేమో కౌతుకం మనస్సులో మొగ్గతొడగగా, చపలస్వభావం కలవాడు. బ్రహ్మ నిర్మాణానికి అవధివంటిది, త్రైలోక్యప్రజల నయనాలకు పండుగవంటిది అయిన ఈ లలితాకృతిగల కన్య ఎవరికులానికి అలంకరణం?'

జీమూత వాహనుడు అలా అడుగగానే ఆ చెలికత్తె స్నేహంతో నిండి తొణికిసలాడుతూ, గంభీరమూ, ఉదారమూ, మధురమూ అయిన ఆతని ఆశయాన్ని గ్రహించి, ఇలా అన్నది:—

'ప్రభూ, ఉన్నతసత్వులయిన మీబోటివారి దర్శనంతో నా చెలి మనస్సు నృత్యం చేస్తున్నది. అందువల్ల క్షణమాత్రం నోటినుంచి మాట వెగల్లేదు. ఈమె కన్య, సిగ్గుకు ఉనికి వంటిది. సంభాషణతో సుప్రతిభులయిన గరితలాగ మీముందు ఎలా ప్రవర్తిస్తుంది? ఈమె విశ్వావసువనే సిద్ధరాజు వంశముక్తాలతవంటిమణి. ఈమెపేరు మలయవతి. ప్రతిదినం గౌరీస్తుతి చేయడం ఈమె వ్రతం.'


చెలికత్తె ఇలా చెప్పింది; జీమూతవాహనుని మిత్రుడయిన మధుకరునుంచి జీమూతనుని పధను, మహోదాత్తమయిన దానిని విన్నది.

జీమూత వాహనుడు నూతనంగా ఉదయించిన మన్మథునివల్ల ఉప్పొంగి తరంగిత అయినట్టు కనిపిస్తున్న ఆ కాంతను కళ్లతో తాగివేసేట్టు చూస్తూ, ఇలా అన్నాడు—

'చెలీ, మీ సఖికి సహజమయిన అభిలాష, గుణాలు, సౌందర్యకాంతి, ఇవన్నీ ఎంతో అందం తెస్తున్నాయి. ఇలాటి ఆమెను ఇష్టంగా చూడడమనేది ఈ జన్మ ఫలం. ఆనంద మధురమైన చూపు, ప్రీతి తరంగితమయిన మనస్సు — ఇంతమాత్రం ఉత్తములకు ఔచిత్యం. తక్కినదంతా బాహ్యాచార డంబరం. ఇలాటి సుందర విగ్రహాన్ని కలుసుకొనడమే అమృత వర్షమని, ఆమె చూపు పడడమే అనుగ్రహమని, ఎవరుమాత్రం అనుకోరు?'

ఇలా ఆ విద్యాధరాధిపుడు ఆనందంతో మాట్లాడుతూండగా, ప్రతీహారి అంతఃపురానికి తిరిగి వెళ్లడానికి వేళయిందని హెచ్చరించాడు. ఆమె బయలు దేరింది. ఆమె వెళ్లుతుంటే అందెలు రవళించాయి. ఆ రవళి 'ఇదిగో నా మనస్సు నీకు ఉంక్షువగా పెట్టాను. ఇది చాల విశాలమయింది దీనిని రక్షించాలి.' అన్నట్టువుంది.

(ఇంకా వుంది)




ఒక వారం విపరీతం
ఫాలాక్షుడు

■ రూనీకి 114 కిలోమీటర్ల దూరంలో వున్న ఆరాయ్ అనే వూళ్లో ఒక మిఠాయి కొట్లో బేరం తగాదా వచ్చినందువల్ల ఆ దొర తన మిఠాయి కొన బోయిన భగవాన్ అనే ఆయన్ని పట్టుకొని కొడవలితో నరికేశాడట.

మృతదేహం పక్కన మహోత్సవాల కరపత్రాలు

కన్నణూరుకు 12 మైళ్ళ దూరంలో కజియం గాడి అనే వూరున్నది. ఆ వూరుకు చెందిన క్రిష్ణన్ నంబియార్ అనే ఒక భూస్వామి ఇంటిమీదికి సుమారు నూరుమంది దండెత్తి ఇంటి ప్రహరీ గోడ కూలగొట్టడం ప్రారంభించారట. ఆ ఇంటా



టికి మళ్ళ మేల్కొని అంచేసరికి, ఆ అరుపు విన్న నౌకరు బయటకువచ్చి ఆ దౌర్జన్యం చూసి, యింటి యజమానితో చెప్పాడట. విషయమేమిటో అర్థంకాక నంబియార్ యిల్లుదాటి ప్రహరీగోడ గేటువద్దకు వెళ్ళేసరికి గోడ తవ్వుతున్నవారతనిమీద పడి అతని నరికి చంపివేశారట. ఆయన మృతదేహానికి పక్కన మహోత్సవ సంబంధమైన కరపత్రాలు పడి ఉన్నాయట— మానవులకు విశ్వాసంగుండా అతి వేగంగా ప్రయాణం చేసి చివరికి మళ్ళీ మొదటి దశకే వెళ్ళిపోతున్నారు—భూమి గుండ్రం కదా!

* * *

తనతో పోట్లాడి తన భార్య పుట్టింటికి వెళ్లి పోయినందుకు మనస్సు విరిగి, జీవితం మీద రోసి పెట్టి పల్లె వంద్యం అనే వూళ్లో 30 ఏళ్ల రాముడు అనే యువకుడు మూడు పాకలకు నిప్పంటించి అందులో ఆత్మహత్య చేసుకున్నాడట. చూస్తున్న జనం ఆ మంట నార్పేసేలోగా మూడు పాకలు కాలి బూడిదైపోయాయట.


* * *

10 ఏళ్లబాలుని మింగిన 30 అడుగుల సర్పం

జకార్తాకు చెందిన అన్నరత్న అనేచోట ధాన్యం పొలంలో పడుకుని నిద్రపోతున్న 10 ఏళ్ల బాలుణ్ణి ముప్ఫయి అడుగుల మహాసర్పం ఒకటి గుటుక్కున మింగేసిందట. ఈ మింగడంలో ఆ కుర్రాడి కాళ్ళు మాత్రం దాని నోట్లోంచి బయటకు వ్రేలాడుతున్నాయట. ఇది చూసిన గ్రామ ప్రజలు ఆ సర్పాన్ని చంపి బాలుణ్ణి బయటకు లాగారట. కాని ఆ బాలుడు చనిపోయాడట.

కాపీ పట్టుకున్న లెక్చరర్ హత్య

మొరదాబాద్ [యు. పి.]లో పరీక్షలు జరుగుతున్నాయట. కాపీ కొడుతున్న ఒక విద్యార్థిని డాక్టర్ యస్. సి. శ్రీనివాసన్ అనే లెక్చరరు పట్టుకున్నందుకు మొన్న ఏప్రియల్ 7 తేదీన ఆయన్ని కాలేజీ ఆవరణలో కాల్చేశారట. సోమవారం 6 వ తేదీన ఇదే కారణంమీద మరో పర్యవేక్షకుడికి లాఠీ కర్రలతో బాదించారట. విద్యార్థులు—కాపీ రైట్—అంటే కాపీ కొట్టడమే మా హక్కు అని అర్థం!




పిల్లలకి విషం పెట్టి ఆత్మహత్య చేసుకున్న తండ్రి

బెంగళూరు బి. డి. యస్. ఆఫీసు ప్రాంతంలో నివసిస్తున్న మునియప్ప అనే అతను తన ముగ్గురు పిల్లలకు [12 ఏళ్ల తిమ్మ, 9 ఏళ్ల గౌరి] విషం పెట్టి, తనూ తిన్నాడట. ఈ ముగ్గురూ చనిపోయారట. వారు తిన్న అన్నం పక్కన విషం సీసా ఉందట. ఈ దారుణానికి కారణం మాత్రం తెలియలేదింకా.

బ్రహ్మచారుల కోర్కెలు

అందమైన పోటీ జరుగుతుంది. బ్రహ్మచారులకు తమకు అందమైన భార్యలు కావాలనీ, అంతేగాను తమ స్కాటిష్ గ్రామాన్ని మరపురానిదిగా చేసి పరిశోధన గ్రామంగా చేసి పొరసత్వమని శపథ




పట్టారట. వీరికి యూరప్ దేశాలనుంచి యువతుల దగ్గరనుంచి ఇంకా సంబంధాలు వస్తున్నాయి— నాకేం నచ్చినా నచ్చి... మాకు బ్రిటిష్ వాళ్ళే కావాలి. వాళ్ళ శరీరం ఒంపు సొంపులు మరెవరికీ రావు...వాళ్ళు అందాలూ...వాళ్ళూ!... వాహ్ అన్నారట—యునైటెడ్ ఆర్ బాచిలర్స్!!

వారానికి 14 లక్షలు

ప్రపంచంలో నిముషానికి 138 మంది పుడుతున్నారని, అనగా వారానికి సుమారు 14 లక్షల మంది పుట్టుకొస్తున్నారన్న యిదే లెక్కన పోతే ఇక 35 సంవత్సరాలలో ప్రపంచ జనాభా యిప్పుడున్నదానికి రెట్టింపవుతుందనీ ఆ శాఖ ఆందోళనను ప్రకటించింది. ఇప్పటి జనాభా 3632 మిలియనులట. ●

రక్తాక్షి

కొమ్మకూరి శేషగిరిరావ్



'అబ్బ! ఎంత బాగుంది రా ఆ బొమ్మ! ఎవరు గీసారో కాని, జీవకళ ఉట్టిపడుతూ, ఎంతో ఆకర్షణీయంగా ఉంది' అన్నాడు రామానందం.

నాకు బోల్డునవ్వు వచ్చింది, అతని మాటలు వింటూంటే.

'సరి, సరి ఆ బొమ్మకి జీవకళ కూడానా? ఎవడో ఆడభయం ఉన్నవాడు ఊహించి రాసిన పచ్చి శృంగారం, గీసిన అర్ధ నగ్నదేహం, బొమ్మకోసం కొన్నా నేమిటి? ఆ బరువైన, అందంగా నగిషీలు చెక్కిన ఫ్రేముకోసం కొన్నానంతే' అంటూ తేలిగ్గా ఈసడించి పారేసాడు బ్రహ్మజీ.

పచ్చి అబద్ధం ఆ సంగతి నాకు తెలుసు. లీలగా ఒళ్ళంతా కనిపిస్తున్న ఆ అర్ధనగ్న ఊహా సుందరిని తలుచుకుంటూ, ఎన్ని రాత్రుళ్ళో కొట్టుకు పోలేదూ ఈ ప్రబుద్ధుడు?

'ఒరే, అలా తీసి పారేయకురా! ఎవరు, ఎలా ఊహించితే ఏం గాని, ఆ బొమ్మలో నిండుగా జీవకళ ఉట్టిపడు తూంది. అవయవాల సొంపుల్లో అయితే నేం, మెరుపుల్లో అయితేనేం, ఎంతో ఆహ్లాద జనితంగా ఉంది. ముఖ్యంగా ఆ కళ్ళు చిత్రీకరించిన విధానం చూడు. ఆ యువతి శృంగార జనితంగా కూర్చు న్నట్లే, ఆమె కళ్ళలో కాంక్షా పూరిత మైన ఎర్రని జీర ఎలా ప్రకాశిస్తూందో!'

కళా ప్రపూర్ణమైన రామానందం హృదయానికి బొమ్మలోని ప్రేమవిహ్వలతే కానవస్తాయి.

'కట్టిపెట్టవోయ్ నీ కవిత్వం. ఆ కళ్ళు కాంక్షా పూరితంగానూ లేవు. కాంక్షా జనితంగానూ లేవు. త్రాగి ఉన్నట్లు, కోపంతో బుసలు కొడుతున్నట్లు, నెత్తురుడికి ఎర్రగా ఉన్నాయి అంతే. అందుకే ఆ మహాతల్లికి రక్తాక్షి అని పేరుపెట్టాను. ఇంక ఆ ఫ్రేముని ఊరికే పొగడక వచ్చిన పనిగురించి ఆలోచించడం మొదలుపెట్టు.' అని గసిరాడు బ్రహ్మజీ.

'ఛీ, కళని ఆస్వాదించలేని పశుప్రాయుడు' అని నాలో నేనే కృంగిపోయాను.

బ్రహ్మజీ మాటలకి ఒక్కసారిగా కళాప్రపంచం లోంచి కుళ్ళు ప్రపంచం లోకి వచ్చిపడ్డాడు రామానందం.

'ఒరేయ్ బ్రహ్మజీ, నా సంగతి నీకు తెలియనిది ఏముంది? రెక్కలమీదేగదా నేను పూర్తిగా ఆధారపడేది. వెనక ఇంకేమీలేదు. గత ఆరునెలలనించి చచ్చి చెడి ఓ వెయ్యి రూపాయలు పోగేసాను. అవి ఇప్పుడు చెల్లిస్తాను. అలాగే ప్రతి ఆరునెలలకి వెయ్యి, వెయ్యి చొప్పున నీ బాకీఅంతా తీర్చుకుంటాను. నా బాల్య

మిత్రుడివి, ప్రాణమిత్రుడివి కదా అనే ధైర్యంతోనే, నీదగ్గర అప్పు తీసుకుని ఇంత సాహసం చేసాను. మాకున్న ఒక్క ఆధారాన్ని పణగొట్టకుండా, నేను చెప్పి నట్టు ఒప్పుకోరా' ఇవి చేతులుకావు కాళ్ళు అనుకోరా ప్లీజ్.'

అతి దైన్య వచనంతో, శిలావతారమై కూర్చున్న బ్రహ్మాజీ చేతులు పట్టుకొని ప్రాధేయ పడుతున్న రామానందాన్ని చూస్తుంటె నాకదుపు తరుక్కుపోయింది.

'హు! వేర్పావులే చాలావేషాలు. ఇప్పు డొచ్చిందా మన బాల్యమిత్రత్వం జ్ఞాప కానికి? డబ్బు ఎంత పాపిష్టిదో నీకు తెలియదా? ప్రాణమిత్రుల్ని సైతం బద్ధ శత్రువుల్ని చేస్తుందన్నసంగతి అప్పు అడిగిననాడు మర్చిపోయావా? సాహ సంట, సాహసం. కామాంధకారంలో కళ్ళు కప్పుకుపోయాయిరా నీకు. అందుకే, ఎంతో మంచివాణ్ణి అనిపించుకుందామని, అందాల చిలకని చేతిలో చిక్కించుకుందామని, నా దగ్గిర్నించి పదివేల రూపాయలు ఊడ్చుకుని తీసుకుపోయి, గుప్పించి ఆ జలజని నీదాన్ని చేసుకున్నావు. ఒకటా, రెండా? పదివేల రూపాయలు, వడ్డీ చేరిస్తే పన్నెండువేలు. నువ్వు ఏడాదికి రెండువేలు, అదైనా చచ్చీ చెడ పోగేసి, ఇవ్వగలిగితే, చెప్పున తీరు స్తావా? అంటే ఇంకో ఆరేళ్ళపాటు ఈపాట సాగాలా? నేను ఇన్నాళ్ళూ గాజులు తొడిగించుకుని కూర్చోవాలా? అబ్బో, ఏం సరసంగా మాట్లాడు తున్నావురా, రామానందం' అలాంటి పప్పులేవీ నా దగ్గర ఉడకవురోయ్. తీర్చదల్చుకుంటే వెంటనే తీర్చు. లేక పోతే నీకున్న ఆ ఒక్క ఇంటినీ వెంటనే వేలం వేయించాల్సి ఉంటుంది. నువ్వూ, నీ అందాలభార్యా రోడ్డుపాలైపోతారు. నాకే వింతాలేదు, మధ్య వచ్చేది మీకే, ఇదే నా నిర్ణయం.

'ఎంత నిర్దయగా, నిష్కర్షగా మాట్లాడావు బ్రహ్మాజీ' అనుకుంటూ ఆశ్చర్యపోయాన్నేను.

అబ్బ కూడబెట్టిన గంపెడు డబ్బు మూలుగుతోంది బ్రహ్మాజీకి, ఇనప్పె ట్టెలో. బ్రహ్మాండమైన ఆస్తి ఉంది. పదివేల రూపాయలు, పది చిల్లిగవ్వలో కూడా లెక్కకాదు అతనికి. ఇప్పటికిప్పుడు ఊపుకుంటూ, పంచరంగుల రామచిలక ఒకటి అతనిపక్కలోకి వస్తానంటె, వందలకు వందలు ధారాప్రవాహంగా ధార పోస్తాడు. అంతవరకూ ఎందుకు. సంగతి చెప్పకుండా రామానందం పదివేల రూపా యలు అప్పు అడిగిననాడు, మారు మాట్లాడకుండా సొమ్ము చేతిలో పెడ్తూ 'ఒరేయ్, నువ్వు నా ప్రాణస్నేహితుడవి. ఈ డబ్బు నాకు తిరిగి ఇవ్వడం గురించి బెంగపెట్టుకోకు, నాకుట్టుకు నేను దానం చేసాననుకుంటాను. నీకుట్టుకు నీవు వీలునిబట్టి తీర్చుకోవచ్చు' అని అత్యుత్తముడిలా కబుర్లు చెప్పాడు నాకళ్ళ ముందే అలాంటివాడు. ఇంతట్లో ఎంత పాషండుడిలా మారిపోయాడు!

బ్రహ్మాజీ, రామానందం, వీధిబడి వయస్సునుండీ కలిసి చదువుకున్నారు. ఆర్థిక స్తోమతలో తేడావున్నా చిన్నప్పటి నుంచీ వచ్చిన స్నేహమేమో. ఆ బేధం వాళ్ళ మిత్రత్వానికి ఏనాడు అడ్డు నిలవలేదు. గుణాల్లోకూడా వాళ్ళిద్దరికి మధ్య హస్తిమశకాంతరం ఉంది. రామా నందం సహజంగా బుద్ధిమంతుడు. మంచి సంస్కారవంతుడు. బ్రహ్మాజీ చిన్నప్పట్నించీ జులాయివాడే. దానికి తోడు, రెండు చేతులతోను ఖర్చుపెట్ట డానికి, డబ్బుకి కొదవేమీలేదేమో, వయసు వచ్చినకొద్దీ దురలవాట్లకీ, చెడ్డతిరుగుళ్ళకి అలవాటు పడిపోయాడు. కాని ఇన్నాళ్ళదాకా వాటిప్రభావం అతని సహజసౌజన్యంమీద ముద్ర వేసిన సంగతి నాకు తెలియదు.

జలజ మంచి సాంప్రదాయం గల కుటుంబంలో పుట్టిన పిల్ల. కాని చిన్న ప్పుడే తల్లిని కోల్పోయింది. జలజ తండ్రి తిరిగి వివాహం చేసుకోలేదు కాని దురదృష్టవశాత్తు చెడ్డ స్నేహాలకు, అలవాట్లకు ఆహుతైపోయాడు. పేకా టకి, త్రాగుడుకి పూర్తిగా లొంగిపోయి ఉన్న ఆస్తంతా కర్పూరంలా హరింప చేసి అప్పులపాలైపోయాడు. తను వేళ తప్పి ఇంటికి వచ్చినప్పుడు తిండి పెట్టే పనిపిల్లలాగా మాత్రమే చూసేవాడు జలజని. అంతేగాని, ఆమె తన కూతురని, ఆమెకు పెళ్లి అది చేసి ఒక యింటిదాన్నిగా తీర్చిదిద్దవలసిన బాధ్యత తనకున్న సంగతే మర్చిపోయాడు ఆ మహానుభావుడు.

అసలే మెరుపుతీగెలా ఉండే జలజ — వయసు వస్తున్నకొద్దీ మానవాకారం దాల్చిన జలదేవతలా రూపు దిద్దుకుంది. 'ఈమె జలజ కాదు. అసలు సిసలయిన పంకజం. రాళ్ళలోని రత్నం' అనుకొనేవా రంతా ఆమెను చూసి.

రోజులన్నీ ఒక్కలాగే గడుస్తాయా? చివరకి జలజ తండ్రి పాపం బద్దలైంది. అప్పటికప్పుడు డబ్బు కట్టడమో, లేక ఉన్న ఒక ఇంటిని వదులుకొని శ్రీకృష్ణ జన్మస్థానం అలంకరించడమో తప్ప ఇంకొక గత్యంతరంలేని పరిస్థితివచ్చింది. సమయం మించిపోయాక కళ్ళు తెరిచి ప్రయోజనం ఏముంది? చివరికి చెయ్యదేమీ లేక, తనకి చిన్నప్పటి నించీ తెలిసిన బ్రహ్మాజీని శరణుకోరా డాయన. బ్రహ్మా జీకి అంతకుముందే జలజ తెలుసు. ఆమెని చూస్తూ ఎప్పుడో సొర్లు నోరూరించు కున్నాడు కూడా. అందువల్ల ఇప్పుడు ఈ అవకాశాన్ని జారవిడుచుకో దల్చుకోలేదు బ్రహ్మాజీ.

'అయ్యో పాపం, మీ కింత కష్టం మొస్తే నా కొచ్చినట్టు కాదుటండి. నో తప్పకుండా డబ్బు సర్దుతాను. రాత్రికి జలజని పంపించండి, ఆమె చేతి కిచ్చి డబ్బు పంపిస్తాను' అన్నాడు చాలా నిర్లి ప్తంగా బ్రహ్మాజీ.

కొరడా ఛెళ్ళుమన్నట్లయింది జలజ తండ్రికి. ముందు నోట ఏమాట రాక తెల్లబోయా రాయన. చివరికి యెలాగో నిబ్రదొక్కుకుని 'అయ్యో నాయనా, నీకు మా జలజమీద మనసు ఉన్నట్లు ఇన్నా ళ్ళూ తెలియనే లేదే! దానికేముంది నువ్వు సై అంటే వెంటనే మీ యిద్ద రికీ ముడి పెట్టేస్తాను' అన్నారాయన.

ఒక్కసారి తోక తొక్కిన తాచులా లేచాడు బ్రహ్మాజీ. 'చిల్లిగవ్వ కూడా చెయ్యని త్రాగుబోతువాడివి. సాంప్రదాయ హీనుడివి. నీ కూతుర్ని నేను పెళ్ళిచేసు కుంటానని ఎలా అనుకున్నావ్? ఏదో కష్టంలో ఉన్నావ్ కదా, ఊరికేకాకుండా ఏదో చిన్న ప్రత్యుపకారం తీసుకుని నీకి సాయం చేద్దామనుకున్నాను. నన్నుమీది

పోతున్నావ్ ! చెనువిన్నాను కదా అవిశ్వాస్కి ఎక్కడ, నాగలోకం యెక్కడ ? 'గెటవుట్!' అని గర్జించాడు బ్రహ్మాజీ.

జలజని పెళ్లి చేసుకొని జీవితాంతం తనదాన్ని చేసుకోడానికి ఆమె తండ్రి యొక్క త్రాగుబోతుతనం, పేదరికం అడ్డు వచ్చాయట బ్రహ్మాజీకి. కాని ఒక రాత్రి ఆమెను అనుభవించడానికి అది అడ్డుకాదు కాబోలు! ఆహా! ఏమి మానవ సమాజం !

అసలే సంఘంలో దిగజారిన జలజ తండ్రికి ఏమీ పాలుపోలేదు. చివరికి బ్రహ్మాజీతో ఒప్పందం చేసుకొని బరువుగా ఇల్లు చేరి, చల్లని వార్త జలజ చెవిలో వేసారాయన. అసలే లోటు జీవితం భారంగా గడుపుతున్న జలజ చెవుల్లో ములుకుల్లా, విసుముక్కల్లా గుచ్చుకున్నాయి ఆ మాటలు. ఆమె హృదయమంతా పెనుతుఫాను కార్చిచ్చులా అలుముకుపోయింది. ఆమెకు, తన శీలాన్ని బలి ఇవ్వడానికైనా వెనుదీయని తన తండ్రినీ, తన మానాన్ని బలిగొనడానికి సాహసించిన బ్రహ్మాజీనీ కూడా ఏమాత్రం తృప్తి పరచడం ఇష్టం లేకపోయింది. అబల, ఏమి చెయ్యగలదు, ఏ నుయ్యో గొయ్యో చూసుకోవడం తప్ప? చివరికి ఆ నిర్ణయానికే వచ్చిందామె.

రాత్రి ఎనిమిది గంటలకు, యెవరికీ తెలియకుండా మానానికి బదులు తన జీవితాన్ని బలి ఇవ్వడానికి కాలువకేసి పరుగెత్తుకు వెళ్లింది జలజ. దైవవశాత్తూ పక్క వూరికి చుట్టాల్ని చూడడానికి వెళ్లి తిరిగి వస్తున్న రామానందానికి కాలువ ఒడ్డున, భగవంతునికి నమస్కారం చేసి లోపలకు దూకబోతున్న జలజ కనిపించింది. ఒక్క ఉదటున వెళ్లి ఆమెను వాటేసుకుని రక్షించాడు రామానందం. కళ్లల్లో వెల్లువలై నీరు పారగా తన జాలిగాథను వివరించింది. జలజ, రామానందంతో. అప్పటికప్పుడే ఆమెను తనదాన్ని చేసుకోడానికీ, ఆమె తండ్రిని చిక్కుల్లోంచి బయటకు తీయడానికి నిర్ణయించుకున్నాడు రామానందం కాని, అప్పటికి అతనికింకా తన మిత్రుడు బ్రహ్మాజీయే, ఆమె మానాన్ని పణంగా తీసుకుని ఆమె తండ్రిని రక్షించ దల్చుకొన్న ప్రబుద్ధుడని తెలియదు.

[illegible]

కుంది జలజ. జరిగినదంతా తన తండ్రికి తెలియబర్చింది. ఆయన ఆనందానికి మేరలేదు. రామానందం చేసిన నిర్ణయ ప్రకారం ఇంకో రెండు మూడు రోజుల దాకా ఈ విషయాన్ని రహస్యంగానే ఉంచడంకోసం, ఆయన మర్నాడు పొద్దున్నే బ్రహ్మాజీ దగ్గరకు వెళ్లి, క్రితం రాత్రి జలజను అతనివద్దకు పంపడానికి వీది అడ్డు పడిందని, ఇంకో మూడు నాలుగు రోజుల తర్వాత తప్పకుండా పంపిస్తాననీ, అంతవరకు తన పలుకుబడిని ఉపయోగించి తనమీద ఏ చర్యారాకుండా కాపాడమని ప్రాధేయపడ్డాడు. సరేనని ఒప్పుకున్నాడు బ్రహ్మాజీ, ఆనందంతో నాలుగు రోజుల ప్లాను వేసుకుంటూ.

ఆనాడు మధ్యాహ్నమే రామానందం తన ప్రాణమిత్రుడైన బ్రహ్మాజీ వద్దకు సహాయార్థం వచ్చాడు. అతనుకూడా తమ నిర్ణయం ప్రకారం అసలు సంగతి దాచి ఇంకో అవసరమేదో ఉన్నట్టు చెప్పాడు బ్రహ్మాజీకి. అందువల్ల మారుమాటాడకుండా బ్రహ్మాజీ తన మిత్రుడికి అడిగిందంతా ఇచ్చేసాడు. ఆ డబ్బుతోనూ, జలజా వాళ్లఇంటితోనూ, జలజా తండ్రి యొక్క అప్పులన్నీ తీర్చివేసి, ఆమెను నిరాడంబరంగా వివాహం చేసుకొని వాళ్లని తనఇంటికి తీసుకుపోయాడు రామానందం.

ఇదంతా తర్వాత తెలిసి, అగ్గిపిడుగై పోయాడు బ్రహ్మాజీ. వాళ్లంతా, రామానందంతోసహా, కలిసి, కూడ బలుక్కుని తనని మోసం చేసారనీ, తన నోటిముందు కూడు పడగొట్టారనీ మండిపోయాడు, తను ఏ దుర్మార్గుని బారినుండి జలజని రక్షించాడో, అతడు తనకి సహాయంచేసిన తనమిత్రుడు బ్రహ్మాజీయే అని తెలిసిన రామానందం ఆశ్చర్యపోయాడు. ఇదంతా విధి ప్రేరితం కాబోలు!

ఒక్కసారి గతంలోంచి వర్తమానంలోకి మేలుకున్నాడు. రామానందం ఇంకా ప్రాధేయపడుతూనే ఉన్నాడు. బ్రహ్మాజీతో తనని సర్వనాశనం చెయ్యవద్దని.

ఒకసారి వికటంగా నవ్వాడు బ్రహ్మాజీ. 'ఊ నాతో అనవసరంగా బీదకూతలు కూయబోకురా. ఈ వెయ్యిరూపాయలు ఏమూలకి? నీ దగ్గిర ఉంచుకో. రేపు పొద్దుటిలోగా [illegible] తీర్చుకుంటాలో.

లేక సర్వనాశనం అవుతావో నీ ఇష్టం నిక్కచ్చిగా చెప్పేసాడు బ్రహ్మాజీ.

'అలా అంటె ఎలారా ? ఏదో ఉపాయం ఆలోచించు. కనీసం ఒక్కనెల గడువియ్యి. తెలిసిన వాళ్లందరివద్దా కడుపు చేతిలో పెట్టుకుని అడుక్కుని నీ అప్పు ఎలాగో తీర్చుకుంటాను' అని వాపోయాడు రామానందం.

'ఇదేం సిలుకేదు ఈ సంగతి రేపటిలోగా తేలి తీరాల్సిందే. ఒక్క గంట కూడా గడువిచ్చేది లేదు. అంతగా బతిమాలుతున్నావు కాబట్టి, ఎంత లేదన్నా బాల్య మిత్రుడవి కాబట్టి, ఏదో ఉపాయం ఆలోచించమన్నావుకదా అని చెబుతున్నా. ఈ వెయ్యి రూపాయలతోనూ జలజని రాత్రికి ఇక్కడికి పంపించు. ఇదే పదివేల రూపాయలుగా జమకట్టి నీనోటు చెల్లు పెట్టేస్తా. ఇదే ఆఖరి ఉపాయం. ఇక తిరుగులేదు. వెళ్లు' అని గదమాయించి లేచి పెద్ద పెద్ద అంగలతో గదిలోంచి బయటకు వెళ్లిపోయాడు బ్రహ్మాజీ, 'వీరయ్యా, ఆ గదిలోని రామానందాన్ని సాగనంపు' అని అరుచుకుంటూ.

పిడుగు విరిగిపడ్డట్టు స్థాణువై పోయాడు రామానందం. 'ఎంత నీచత్వానికి దిగజారావు బ్రహ్మాజీ' అనుకుంటూ పళ్లు పటపట లాడించి కోపంతో ఊగిపోయాన్నేను. భరించలేని బాధతో, కోపంతో నిస్తబ్ధుడై పోయిన రామానందాన్ని నౌఖరు వీరయ్య తోలుకు పోయాడు.

మృత్యుదేవత కౌగిలిలా, చల్లగా, నల్లగా ప్రవేశించింది కాళరాత్రి. తెల్లని మల్లు పంచె, లాల్చీవేసుకుని, అత్తరు వాసనలు ఘుమాయిస్తూ, కారాకిళ్లీ నములుతూ, సిగరెట్టు పొగలురింగురింగులుగా వదులుతూ, అయోమయంగా పచార్లు చేస్తున్నాడు బ్రహ్మాజీ. బ్రహ్మాస్త్రం విసిరాడు. ఏమవుతుందోనని ఫలితంకోసం ఎదురు చూస్తున్నాడు. రామానందం మనసు ఎలా బాధపడుతూందో, జలజహృదయం ఎలా జలదరించి పోతోందో తనకు అనవసరం. క్రిందటిసారిలాగే ఆత్మహత్యా ప్రయత్నం చేసుకుంటుందా. పీడావదిలింది. ఏమీ చెయ్యకుండా ఊరికే ఉంటారా, రేపటి్నుంచీ దిక్కులేని పక్షులే, సర్వనాశనమే. అలాకాక జలజని తనవద్దకు పంపే పొ దా—అబ్బ ఎంతఅదృష్టం! ఎవారు

చెస్తూనే సుఖదుఃఖ స్వప్నాల్లో మునిగ పోతున్నాడు బ్రహ్మాజీ.

'ఆమె ఎవరో వచ్చారండీ' అంటూ హార్త చేరవేసాడు వీరయ్య.

ఉలిక్కిపడ్డాడు బ్రహ్మాజీ. ఉలిక్కిపడ్డాను నేను.

అడుగులో అడుగులేసుకుంటూ, ఛీత హరిణేక్షణాలతో చుట్టూ చూసుకుంటూ భూలోకానికి దిగిన అప్సరసలా ముందుకి వచ్చింది జలజ.

'ఇదిగో వచ్చాను. ఇదిగో వెయ్యి రూపాయలు' అని కుర్చీలో కూర్చుంది జలజ.

'చాలా తెలివైన పనిచేసావు. నిన్ను, రామానందాన్ని, నన్ను అందర్నీ రక్షించావు' అని కామాతురమైన ఎర్రని కళ్లతో ఆమె అందాన్ని త్రాగివేస్తూ తలుపుకేసి నడిచాడు బ్రహ్మాజీ.

'ఆగండి' అంటూ విలాసంగ పైట దిగజార్చి అతనికేసి నవ్వుతూ నడిచింది జలజ.

'మీ నమ్మకం నాకేమిటి? నన్ను తీరా దోచుకున్నాక నోటు చెల్లు పెట్టక పోతే మాగతేంకాను? నేనెలాగో మీకు వంటింట్లో కుందేలునేకదా. ఎక్కడికీ పోను. ముందు నోటు చెల్లు పెట్టండి. తర్వాతే మీకునాపొందు' అంది జలజ, వయారాలు వలకపోస్తూ.

'ఓస్ అంతకన్నానా? అసలు ఈ వెయ్యి కూడా అక్కర్లేదు. నువ్వేతీసుకో. ఇదిగో నోటు చెల్లుపెట్టేస్తా' అంటూ ఆనందంతో తేలిపోతూ ఇనప్పెట్టె తెరిచి, నోటు తీసుకు వచ్చాడు బ్రహ్మాజీ.

'ఇదిగో చూసుకో. నీచేత్తో నువ్వే చింపిపారెయ్యి' అన్నాడామెతో.

జలజ ఆనోటుని జాగ్రత్తగా పరీక్షించి పరపరా చింపి పారేసింది.

మరుక్షణంలో ఆ సౌందర్యదేవత, భీషణ మృత్యుదేవతగా మారిపోయింది. చీర మడతల్లోంచి రివాల్వర్ తీసి బ్రహ్మాజీకేసి గురిపెట్టింది.

'దుర్మార్గుడా. నీలాంటి వానికిదే మంత్రం. అపాయంలోంచి ఉపాయం వల్లే తప్పించుకోవాలి. ఇది బొమ్మ రివాల్వర్ అనుకోకు. ముందు అడ్డు తప్పుకో. ఏమాత్రం కదిలినా జాలిమాప కుండా కాల్చి పారేస్తా' అని ఆడపులిలా గర్జించింది జలజ. ఎనలేని సంతోషంతో నామనసు ఊగిసలాడింది ఆమె వెర్రుకి.

అనుకోని ఈ హఠాత్ పరిణామానికి మ్రాన్పడిపోయాడు బ్రహ్మాజీ. చేసేదిలేక ఆమెకు దారివదిలాడు.

చెంగున లేడిపిల్లలా తలుపుతీసి పరుగు తీసింది జలజ. కాని, మనిషి ఒకటి తలిస్తే, భగవంతుడు ఇంకోటి తలుస్తాడు కాబోలు. ఎంతో ప్రశాంత చెందిన వాతావరణం మరుక్షణంలో మళ్లీ ప్రళయావతారం దాల్చింది. పులినోటినుండి తప్పించుకుని పారిపోవాలన్న కంగారులో జలజ కాలిబొటనవేలు, నేలమీద పరచిన తివాసీ త్రాడులో చిక్కుకుని ఆమె 'అమ్మో' అంటూ నేలమీద పడిపోయింది. చేతిలోని తుపాకి అల్లంత దూరంలో పోయిపడింది. భగవంతుడిచ్చిన ఈ అవకాశాన్ని వదులుకోలేదు బ్రహ్మాజీ. కళ్లు బైర్లుకమ్మి లేవబోతున్న జలజను తన పశుబలంతో చుట్టు ముట్టాడు.

వేసుకున్న ఉపాయం మట్టిపాలవ్వగా చేసేదిలేక, లేనిబలంకూడ గట్టుకొని తన శీలంకోసం బ్రహ్మరాక్షసిలా బ్రహ్మాజీతో తలబడింది జలజ. గోళ్లతో రక్కుతోంది. కాళ్లతో తంతోంది. పళ్లతో కరుస్తోంది కాని దున్నపోతులాంటి ఆ మానవుడిమీద వాటి ప్రత్యక్షశక్తిగాని, పరోక్ష శక్తిగాని ఏ మాత్రం ఫలితం చూపించలేక పోతున్నాయి.


ఎదురుగా జరగబోతున్న ఘోరమైన మానభంగానికి నా హృదయమంతా కంపించిపోతోంది. కాని ఏంచెయ్యగలను? ఆ అబలని ఎలా రక్షించగలను? ఓ భగవంతుడా ఆ శక్తిని నాకియ్యి అని ఆక్రోశించాన్నేను, వృధాకోపంతో ఎర్రగా చూస్తున్నాను.

బ్రహ్మాజీ చేతులు జలజదేహమంతా నృత్యం చేస్తున్నాయి. కాని ఆమె ఇంకా వివస్త్రకాలేదు. లేని శక్తితో పోరాడుతోంది. ఇద్దరూ నుంచునే ఉన్నారు. ఆమెను ఎలాగైనా సోఫామీదకు తోసి ఆక్రమించుకుందామని చూస్తున్నాడు బ్రహ్మాజీ. ఆమె నెలాగైనా వివస్త్రను చెయ్యాలని చూస్తున్నాయి అతనిచేతులు. ఆ సమయంలో లేని బలమంతా కూడ గట్టుకుని ఒక్కసారి గట్టిగా తోసింది జలజ బ్రహ్మాజీని. ఆ ఊపుతో ఆమె రవికను అంది పుచ్చుకున్న అతని రెండు చేతులూ, ఆమె రవికను చింపుకుంటూ ఊడిపోయాయి. అతను వెనక్కు కూలిపోయి, నా క్రిందుగా గోడకు తగిలాడు. ఇదే సమయంకోసం ఎదురు చూస్తున్న నేను ఒక్కదూకుతో నామేకుని ఊడదీసుకుని అతని తలమీద గట్టిగా పడ్డాను నెత్తురు చిందిస్తూ. మరుక్షణంలో జలజ ఆ గదిలోంచి పారిపోయింది.

కొన ఊపిరితో నా ముఖంలోకి తేరిపారి చూసాడు బ్రహ్మాజీ.

'ర ... క్త ... క్షి' అంటూ కన్ను మూసాడు. ●

ఉద్యోగమిస్తాను లంచం కావాలంటారా సార్.. మా నాన్నగారిక్కి తాతగారిక్కి ముత్తాతగారిక్కి లంచాలిచ్చి పుచ్చుకోవడమే గాని ఇవ్వడం ఆనవాయితీ లేదండి ---!



ప్రశ్నలు

....కె. రామలక్ష్మి....

కె. వి. ఎస్. పి. మచిలీపట్నం

నాకు ఇండియా అంతా తిరగాలని ఉంది. ఏనగరములలోనైనా చూడదగిన ప్రదేశములు తెలుసుకొనుటకు మార్గమేది ?

టూరిస్టు సమాచారం అంతా అందించేది టూరిస్టు బ్యూరో. వారికి రాస్తే—విశేషాలన్నీ తెలియచేస్తారు.

ఎస్. ఎస్, మొగలవల్లి

ముందొచ్చిన కొమ్ములకంటే వెనక వచ్చిన కొమ్ములు వాడిగా ఉంటాయని ఇప్పుడిప్పుడు తెలుసుకొను చున్నాను.

ముందు కూడా కొమ్ములే వచ్చాయా ఏమిటి మీకు? పాపం!

వై. ఎస్. ఆర్, కడప

పతివ్రత అనుపదానికి ఇంగ్లీషుపదం ఏమిటి రామలక్ష్మిగారూ ?

ఇంగ్లీషులో పతివ్రత లుండరని కాబోలు మీ ఉద్దేశ్యం సుబ్బారాయుడుగారూ?! మీ ఉద్దేశ్యమే కాదు. చాలా మందిదిలా ఉంది—అప్పుడే బదారుగు రడిగారు!

ఎస్. ఏ. ఆర్, ఇల్లో జమ్‌షెడ్‌పూరు

రామలక్ష్మిగారూ నాకూ మా ఆవిడకూ లేని ఎడమచెయ్యివాటం మా పెద్ద బ్బాయికే వచ్చింది...

భయపడకండి. నాదీ, సూర్యకాంతందీ కూడా ఎడం చెయ్యివాటమే. సుఖపడతాడు పిల్లాడు!

కె. ఎస్. ఎస్, కాకినాడ

నాకు తెలుగుభాషా ప్రవీణ పరీక్ష వ్రాయాలనిఉంది...వివరాలు కావాలి.

మీరు ఆంధ్రా, తిరుపతి, మైసూరు విశ్వ విద్యాలయపు రిజిస్ట్రారులకి రాస్తే వారా వివరాలు పంపుతారు.

వై. ఎస్. ఆర్, పెదవల్లి

రామలక్ష్మిగారూ, మీరు పాఠకుల ప్రశ్నలకు సమాధానాలు యివ్వరన్నీ మీరు చాలా గర్వముగా ఉంటారని విన్నాను ... మీరిస్తున్న సమాధానాలను చూస్తే అలా అనిపించదు...

మీ అభిప్రాయం మీరు ఏర్పరచుకోవాలి గాని ఎవరో అనగా విని నిర్ణయిస్తే ఎట్లా?...

బి. ఎస్, పెద్దేవం

శ్రీమతి మాసపత్రిక తెలుసా మీకు? తెలుసు!

టి. ఆర్, కాకినాడ

తూర్పువాళ్ళు పడమటివాళ్ళు అంటా రేమిటి ?

ఏమో బాబూ, మా అమ్మగారిని నాన్నగారు తూర్పు దానివి అంటే మా నాన్నని అమ్మ అలాగే అనేది. మీ అమ్మది కోటనందూరు. నాన్నది తుని!... ఇంక మీరే నిర్ణయించండి!

జి పి. ఆర్, విజయవాడ

మరోప్రపంచం ఏది ?

ఇందిరమ్మ కోరుకున్నదేనటగా? గాంధీ ఊహిం చినదీ నటగా మొన్న విన్నాను!

ఎస్. ఎస్. ఆర్, కొమరిగిరిపట్నం

ప్రస్తుత రాజకీయ గందరగోళానికి కారణమేమిటి ? దానికి కారకులెవరు ? ఈ పరిస్థితివల్ల ప్రజాస్వామ్యానికి దూర మవుతున్నామని కొందరు, ప్రజాస్వామ్యం మరింత పెరుగుతుందని కొందరు వాగ్వి వాదా లాడుతున్నారు. ఏదినిజం ?

నేటి రాజకీయపు గందరగోళానికి పూర్తిగా కారణం నాయకుల వ్యక్తిగత స్వార్థం....వారిలో ఏ ఒక్కరికి అవకాశం చిక్కినా నియంతలై నెత్తెక్కి కూర్చుంటారు. గందరగోళంలోంచి ఒక రకం ఆర్డరు పుట్టుకొస్తుంది అంటారు. మరి దాన్ని ఎంత కాలానికి చూస్తామో తెలియదు. కాని ఒకటి మటుకు నిజం. పీకు మేకైపోయే పార్టీ నాయకత్వాలు—నెత్తుటికూడు, అలజడి అశాంతి రేపే ఇతర రకపు పెత్తందారీలకంటే యీ గందరగోళపు ప్రజాస్వామ్యం ప్రిఫరబుల్. ఈ నుయ్యి గొయ్యి మధ్య ఊగులాడుతూంది నేటి సామాన్యుని దైనందిన జీవితం. అతివాదులూ, ఆందోళనాపరుల పాలిట పడితే నుయ్యే. గందరగోళపు ప్రజాస్వామ్యపుగోతిలో పడితే దులుపుకుని లేచే అవకాశమేనా ఉంటుంది.

టి. కె, విజయనగరం

మీరు వాలుజడ వేసుకుని పెద్ద బొట్టు పెట్టుకుంటారు అనుకునేదాన్ని. కాని మీరలా ఉండరట. నిజమేనా ?

నా వాలుజడ ఎప్పుడూ భుజాలు దాటిన జ్ఞాపకం లేదు! అయినా తినబోతూ రుచులెందుకు? రేపు మే లో మీ ఊళ్లో సభలున్నాయిగా! చూద్దురు గాని.

కె. ఎస్. ఆర్, జెక్కాం

రామలక్ష్మిగారూ ఎప్పుడూ మీనాడు గెడ్డం పెంచుకుంటూనే ఉంటారు కారణం ఏమిటి ?

ఇదివరకుఏమిటో అనుకునేదాన్ని—ఈరోజుల్లో ఇష్టం వచ్చినట్టు గెడ్డం పెంచుకునే హక్కు కూడా లేదు మగవాళ్లకి!

జి. జి. ఆర్, బన్సబెరియా, (వ బెంగాల్)

అక్కయ్య జపానుమనుష్యులు 'జెత్ ఈజ్ తాలీ. ఐఫిల్‌ఫైన్. నొడైన్. వై? అంటారు...నాకు కన్‌ఫ్యూషన్‌గా ఉంది.

నీకు అయోమయంగా ఉందిగాని నాకైతే గో టు హెల్ అనాలని ఉంది దిబ్బితల్లి !

కె. పి. ఆర్, లక్ష్మీనారాయణపురం

అక్కయ్య నాకొక మిత్రుడు ఒక శత్రువు ఉన్నారు. మిత్రుణ్ణి రక్షించి, శత్రువుని నాశనం చేయాలనే ఉద్దేశ్యంతో అడుగుతున్నాను.

ముందు శత్రువెవరు? మిత్రుడెవరు—తెల్సుకో బ్రదర్. ఎందుకంటే తమలాంటి వారికి చేబదు లివ్వకపోతే శత్రువుకిందజమకట్టేస్తారు! మీ మాట కాదంటే శత్రువుకింద జమ కట్టేస్తారు. చిక్కే!

ఎస్. ఎస్ ఆర్. ఎమ్, రాజ్యలక్ష్మీపురం

అక్కా నేడు రోగం నయంచేసిన వైద్యుడు గొప్పా? అవసరాని కందు కున్న అప్పిచ్చినవాడు గొప్పా? చెప్పండి?

నిరభ్యంతరంగా అప్పిచ్చినవాడే గొప్ప. రోగం నయం కాకపోతే పోయిరి—సినిమాలోలాగా గోడ మీద బొమ్మగా నిలుస్తాం. అవసరం గడవక ఛస్తే పరువు తక్కువ.

పి వి. వి. ఎమ్. ఆర్, ముంగపాక

మతాంతర వివాహం గొప్పదా? వర్ణాంతర వివాహం గొప్పదా? స్వమత సవర్ణ వివాహం గొప్పదా ?

ఏదేమైనా వివాహం అన్నదే గొప్పది సార్.


జ్వాలాశ్రీ, కర్నూలు

వ్యక్తిత్వాన్ని కోల్పోయి, స్వార్థపరులై సంఘంలో పెద్దమనుషులుగా చెలామణీ అవుతున్న పయోముఖ విషకుంభాలకు మీసందేశం ఏమిటి ?

'ఓ పయోముఖ విషకుంభాలలారా? మీకే వాటు బతుకేం? వెళ్లులోకి రండి, ఈ రాజ్యంమీదే, మీరేలండి!' అని పోచిన్నపాయిటిక్ సందేశం పంపిం చాలని ఉంది—వారి ఎడ్రసు పంపండిసార్.

స్టాప్

కొలకలూరి



టర్మినస్‌లో బస్ బయలుదేరే టప్పుడు అతను వచ్చి కూర్చుని డ్రైవరుకు చూపించాడు స్త్రీని. ఆమె చంకలో పదినెలల ఆడపిల్లవుంది. చేయి పట్టుకొని రెండేళ్ల పిల్లవాడు, రోడ్డుకడ్డంగా నడుస్తూ మూడున్నరేళ్ల పిల్లవాడు వస్తూ పోతూవున్న బస్సులు కారులు సినిమా బొమ్మలుచూస్తూ నడుస్తున్నాడు అయిదేళ్లవాడు.

స్టార్ట్ చేసిన ఇంజను దడదడలాడుతూ వుంటే, ఆమె దడదడలాడుతూ ముగ్గురు పిల్లల్నీ అటూఇటూ నెట్టుకొంటూ గొర్రెల్ని తోలుకు వస్తున్న పిల్లవాడిలాగా, కాకులకూ, గద్దలకు బలి కాకుండా పిల్లల్ని రక్షించే తల్లికోడిలాగా కంగారుపడుతూ వచ్చిందిఆమె.

చంకలో పిల్ల చంకలోనేవుంది. మూడో వాణ్ణి నగల పెట్టెను పెట్టినట్లు బస్సులో పెట్టింది. పొయిమీదనుంచి దించుతుంటే కాలిన పులుసు పాత్రను వదిలినట్లు రెండో వాణ్ణి బస్సులో వదిలింది. బియ్యం బస్తా కూలీలు రైలులోనో, లారీలోనో పడేసినట్టు మొదటివాణ్ణి బస్సులో పడేసింది. చంకలో పిల్లతో అతి కష్టంమీద బస్సులోకి స్థూలకాయం చేర్చి డ్రైవర్ ప్రక్క కాళీగా వున్న ఫోర్ సీటర్‌వైపు కాళ్లతో చేతులుతో పిల్లల్ని నెట్టుకొంటూ వెళుతున్నప్పుడు బస్సు బయలుదేరింది. ఆమె పడబోయి, కూర్చోబడింది సీటులో. పిల్లలు ముగ్గుర్నీ ముందు కూర్చోబెట్టుకొంది. చంకలో పాప వళ్లోకివచ్చింది.

ఆమె స్థూలంగావుంది. శరీరంలో ప్రతి అవయవం అవసరమున్నంతకంటే అధికంగా పెరిగింది. కూర్చుని ఒక్క నిట్టూర్పు విడిచి అతనివైపు చూచింది. అప్పుడతను టిక్కెట్లు తీసుకొంటున్నాడు. ఆమె అతనిభార్య కావచ్చునని ఎవరికయినా అనిపిస్తుంది. ఆమె ఆ పిల్లలతల్లి అనీ అనిపించవచ్చు. అతను భర్త, తండ్రి అనీ అనిపించవచ్చు. అయితే అతనిలో తండ్రి కుండవలసిన లక్షణాలు ఏమేమున్నాయా అనీ అనిపిస్తుంది. భార్యా భర్త లిద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు. 'సరిగ్గా కూర్చో' అని ఆమె మొదటివాణ్ణిమాత్రం హెచ్చరించింది.

మొదటి బస్‌స్టాప్‌లో యువతి ఎక్కింది. లేడీస్ సీటు కాళీగా లేకపోతే ముందుకు వచ్చింది. వస్తూ అతన్ని చూచింది. చూచిన చోటే ఆగిపోయింది. ఆగిపోయి చూస్తూవుంది. కండక్టరు ముందుకు పొమ్మని అరిచింతర్వాత ముందుకు వచ్చి కాళీవున్న చోట కూర్చుంది.

ఇవతలప్రక్క కిటికి దగ్గరగా కూర్చున్న యువతి మూడుసీట్లు వెనుక అవతలప్రక్క కిటికీ దగ్గర కూర్చునివున్న అతన్ని చూచింది చూస్తూ వుండిపోయింది. మెడ వెనక్కు నొప్పి పుట్టేటట్లుగా పెట్టి చూస్తూవుంది.

బస్సులో ఉన్నవాళ్ళ కొందరామె చూపును చూశారు. కొందరతని చూపును చూశారు. ఒకర్నిమార్చి ఒకర్ని బస్సులో అందరూ చూశారు. వాళ్ళ చూచుకొంటూవున్నారు. వీళ్ళ చూస్తూవున్నారు.

సిటీబస్ రెండోస్టాప్‌లో ఆగింది. ఎవరూ దిగలేదు. ఇద్దరో ముగ్గురో ఎక్కారు. కండక్టరు విజిల్ వూదాడు. బస్సు బయలుదేరింది. వాళ్ళ చూచుకొంటూ ఉన్నారు.

పిల్లలతల్లి భర్తను చూచింది. అతను ఆమెను గమనించలేదు. యువతిని చూచింది. ఆమెకూడా చూడలేదు. అటూ ఇటూ ఇద్దరివైపూ చూచింది. ఎవరూ చూడలేదు.పిల్లలవైపు చూచింది. పెద్దవాడు బైటికి చూస్తున్నాడు. రెండోవాడు బస్సు కుదుపుకు కునుకుతున్నాడు. మూడోవాడు తల్లి ఎటుచూస్తే అటు చూస్తున్నాడు. ఆమె రోడ్డుమీదికి చూడసాగింది. బస్సు వేగంగా పోతూవుంది.

వాళ్ళిద్దరూ పరస్పరం చూచుకొంటూ వున్నారు. కండక్టరు రోజుకు కొన్ని వందల మంది స్త్రీ పురుషుల్ని చూస్తుంటాడు. ఎవరినీ ఇంతసేపు చూచిన గుర్తు లేదు. ఇద్దరినీ చూస్తూ విజిల్ ఇవ్వటం మర్చిపోతే స్టాప్‌లో దిగవలసిన మనిషి గోలచేసి 'బస్సు ఆగేటట్లు చూచుకొన్నాడు.

ఎంతకీ బస్సు బయలు దేరటానికి విజిల్ ఇవ్వకపోతే వెనక్కుతిరిగి చూచిన డ్రైవర్ యువతినీ, అతన్నీ చూస్తూన్నప్పుడు వెనుక బస్ హారన్ విన్నాదాకా బస్సు స్టార్ట్ చేయలేదు. రెండోవాడు మళ్లీ కునుకుతుంటే భర్తనూ,ఆమెనూ వాళ్ల చూపులనుచూస్తూవున్న పిల్లలతల్లి, తట్టి లేపి 'నాన్న దగ్గరకు పో' అని పంపించింది. వెడుతున్న

స్టాప్

బస్సులో వెళుతున్న పసివాడు కుదుపులకు అటవుతూ ఇటవుతూ తండ్రి దగ్గరకు చేరుకొన్నాడు.

తండ్రి సుడిగాలి వచ్చి దుమ్ము పడితే విదిలించుకొన్నట్టుగా కళ్ళాపి కొడుతుంటే వెనక్కి తగ్గినట్లు పసివాణ్ణి దగ్గరకు రానీయకుండా వేళ్ళలో వాడిచేయి పట్టుకొని, పో పో అన్నట్లుగా ముందుకు పంపించాడు. వాడు బిక్కముఖం వేసి, మళ్లీ వచ్చిన తోవనే పడుతూ లేస్తూ తప్పటడుగులు వేసుకొంటూ,ముక్కు తుడుచుకొంటూ ముందుకు వెళుతుంటే, యువతి రెండు చేతులూ చాచి, వాణ్ణి పైకెత్తి తన ప్రక్క ఖాళీవున్నచోట కూర్చోబెట్టింది. వాడు అమ్మవైపు రెండుసార్లు, నాన్నవైపు ఒకసారీ చూచి, ఆమె ముఖంలోకి 'ఎవరు నువ్వు' అన్నట్లుగా చూశాడు. యువతి వాడి కళ్ళలోకి తీయగా చూచి, ముక్కు తుడిచి, మూతి తుడిచి, మళ్లీ పైకెత్తి వళ్ళో కూర్చోబెట్టుకొంది.

వాడీసారి అమ్మా నాన్నల అనుమతికోసం అటూ ఇటూ చూడలేదు

యువతి కట్టుకున్న అందమయిన చీరె నలిగిపోతుందేమోనని చూస్తున్నవాళ్లకే అనిపించింది. ఆమె వయస్సు పాతిక దాటదు. ముఖంలో అలసట, బలహీనత లేవు. ఆరోగ్యంగా పుష్టిగావుంది తల్లోపూలు, నుదుటి కుంకుమ కనిపిస్తుంది. కాని మెళ్ళో తాళి చూడలేదు.

పసివాణ్ణి ఆ చెంపా ఈ చెంపా హడావుడిగా ముద్దు పెట్టుకొంది. వాడేమీ అభ్యంతరం చెప్పలేదు. మెదలకుండా వూరుకొన్నాడు. 'నీ పేరేం పేరు బాబు!' అంది. వాడేదో గొణిగాడు. ఆమె వినిపించుకొన్నట్లు లేదు. వెంటనే వెనక్కి చూచింది అతను చూస్తూ వున్నాడు.

అతని వయస్సు ఇరవై ఎనిమిది దాటదు సన్నగా బారుగా ఉన్నాడు. వేసుకొన్న టక్, దువ్వుకొన్న తల చెరిగిపోలేదు. నీటుగా వున్నాడు. ఆమెవైపు చూస్తూనేవున్నాడు. యువతి ఒళ్ళో కూర్చున్న పిల్లవాణ్ణి తల్లి గాని తండ్రిగాని తీసుకోలేదు. తీసుకొనే ప్రయత్నమూ చేయలేదు.

బైటికి చూస్తున్న మొదటివాడు అట్లాగే కునుకుతున్నాడు. వీడు నిద్రకు పడితే కష్టం దించుకుపోవటం—అనుకొందో ఏమో తట్టి లేపింది. వాడు కోపంగా ఆమెను నఖశిఖ పర్యంతం చూచి విసురుగా తల తిప్పుకొని మళ్లీ బైటికి చూస్తున్నాడు

మగపిల్లలు ముగ్గురూ ఆకారంలో తండ్రి పోలిక. తండ్రి చిన్నతనంలో మొదటివాడి లాగా వుండి ఉంటాడని ఎవరికయినా అనిపిస్తుంది. నా దగ్గరకు రావద్దు నన్ను తాకవద్దు అన్నట్లుగావుంది ఇద్దరి వాలకం! ఈ అయిదేళ్లవాడు ఇరవై అయిదేళ్లవాడు అయితే అచ్చంగా తండ్రిలాగా ఉంటాడు, తండ్రిలాగా ప్రవర్తిస్తాడు అనిపిస్తుంది.

మూడోవాడు, మొదటివాణ్ణి అన్నా అన్నా అంటూ నిక్కరు పట్టుకొని లాగాడు. వాడు బైటికిచూస్తూ కనీసం వెనక్కయినా తిరిగి చూడకుండా మూడోవాణ్ణి విదిలించివేశాడు. వాడు బిక్కముఖంవేసి,పెదవి విరిచి, బుగ్గలు గీతలు పడేలాగా ఆవురుమని ఏడ్చాడు. 'లేదులే లేదులే' అంటూ ఆమె వాణ్ణి సముదాయిస్తున్నప్పుడు, నిద్రపోతున్న ఒళ్లోపాప లేచి కేర్ కేర్‌మని ప్రారంభించింది. 'చిచ్చుచ్చుచ్చుచ్చూ' అని ఫ్యాక్టరీ ధ్వనివంటిది— ఆమె సముదాయించ బోయింది,

ఇద్దరు పిల్లల గోల, తోడు తల్లి అల్లరి, బస్సు రద్దిలోనూ వినబడుతుంటే అంత దాకా యువతినో, అతన్నో చూస్తున్న జనం ఇప్పుడామెను చూడసాగారు. యువతి అతని వైపు చూచింది. చూస్తున్నప్పుడామెకళ్ళు కించిన్మీలితాలై, కనుబొమలు వంగాయి. ఆ క్షణంలో అతను వెలుపలికి చూశాడు. ఆమె దృష్టి మరల్చుకొంది.పసివాణ్ణి పైకెత్తి బుగ్గలు నిమురుతూ ముక్కు ముద్దుపెట్టుకొంది.

తల్లి ఏడుస్తున్న పసివాణ్ణి వోదార్చి వూరుకోబెట్టింది. పసిపాప ఏడ్పు రెట్టింపు చేసింది. చేతులుమీద అటూ ఇటూ వూపింది. పాప ఏడ్పు ఆపలేదు. అధికం చేసింది ఏం చేయనండీ అన్నట్లుగా భర్తవైపు చూచింది. అతను చూడటంలేదు. ఆమెవైపు చూస్తున్నాడు. ఆమె అతన్ని చూడటంలేదు. పిల్లవాణ్ణి వూరికే ముద్దుపెట్టుకొంటూ వున్నది.

తల్లికి ఏం చేయాలో తెలియలేదు. ఏదో స్టాప్‌లో బస్ ఆగింది. ఆగినప్పుడు గోల ఎక్కువగా వినిపించినట్లయింది. వాళ్ళు డ్రైవర్ దగ్గర ఉండటంవల్ల డ్రైవర్ అసహనంగా వాళ్లవైపు చూచి కోపంగా స్టార్ట్ చేశాడు బస్సును.

ఒకరో ఇద్దరో దిగిపోయారు. ఒకరో ఇద్దరూ ఎక్కారు. పాప ఏడ్పుకంటే డ్రైవరు చూపు ఆమె భరింపలేకపోయిందేమో పాపను అడ్డం వేసుకొంది. పాలిస్తూ వుంది. డ్రైవర్ ఆమె వైపు చూచి కోపం మాన్పుకొన్నాడు. ఇద్దరు ముగ్గురు యువకులు ఉత్సాహంగా ఆమెవైపు చూస్తున్నారు. నలుగురు అయిదుగురు మగవాళ్ళు పెద్దవాళ్ళు ఆమెవైపు చూడటం మాను




CINTHOL
ఎక్కువ
సువాసన
ఎక్కువ
మెత్తదనము
మెత్తనిది, పూవువలె తాజాయైనది, సువాసనగలది
పోటీలేని క్రిమి సంహారి జి-11 గల
సింథాల్ టాయిలెట్ పౌడరు దాని నేవు వలచే
సువాసన మరియు వట్టువంటి మెత్తదనముతో
మీ చర్మమునకు అంటుకొని ఉండి
మీకు రోజంతా రక్షణ కలిగిస్తుంది.
CINTHOL
DEODORANT
LUXURY
TOILET
జి-11 గల
సింథాల్ మీకు
రక్షణ యిచ్చినట్లు
వేరే ఏ
పౌడరూ
యివ్వలేదు.

స్లాప్

కొన్నారు. తల తిప్పుకొన్నారు.

యువతి, అతన్ని చూడటం లేదు. తల్లిని పాలు తాగుతున్న పిల్లని, పిల్ల పాల బుగ్గల్ని, పెదాల మీద నుంచి జారుతున్న పాల బొట్లునూ చూస్తూ వుండిపోయింది. చేతుల్లో ఉన్న పిల్లవాడి సంగతి, వాడి చేయి తగిలి జారిపోయిన పైట సంగతి ఆమెకు గుర్తులేదు.

యువతి, తన వైపు చూడకుండా ఉన్నప్పుడు తన నెవరయినా చూస్తున్నా రను కొన్నాడేమో అటూ, ఇటూ చూశాడు. తన నెవరూ చూడటం లేదు కానీ ముగ్గురు యువకులు ఆమె వైపు చూస్తుంటే పైట సరిగా వేసుకో అని కూర్చున్న చోటు నుంచే అతను చెప్పాడు. ఆమె అటూ ఇటూ చూచి, హడావుడిగా పైటచెంగు తీసి పాప తలమీదుగా కప్పింది. ఆమె వైపు చూడటం మానుకొన్న యువతి తన పైట చెంగు జారిపోయిన సంగతి గుర్తించి, వెంటనే సరి చేసుకొంది. వెనక్కు తిరిగి అతన్ని చూపింది. అప్పుడామె పెదాలు వ్యాకోచించినట్లుగా సాగి, తక్షణం కుంచించుకు పోయాయి.

అతను నిటారుగా కూర్చున్నాడు. ఏదో దిగ మింగినట్లు కంఠం కదిలింది. తల్లి ప్రక్కనే కూర్చుని పాప పాలు తాగుతుంటే చూస్తున్న మూడోవాడు ఒట్టి నోరు తడి అయితే చప్పరించటం చూస్తూ వుంది యువతి.

మొదటివాడు బైటికి చూస్తూ అలాగే కిటికీలో తలపెట్టి నిద్రపోయాడు. తల్లి వాణ్ణి చూపింది. అటూ ఇటూ చూచింది. డ్రైవరు తిన్నగా రోడ్డు మీదికి చూస్తున్నాడు. ఒకరిద్దరు యువకులు తనవైపు చూస్తున్నారు. అనుకోకుండా భర్త ఆమె వైపు చూశాడు.

వీడు నిద్ర పోతున్నాడు చూడండి ఏం చేసేది నేను. వీళ్లతో వేగటం ఎట్లాగంటూ అన్నట్లుగా చూచింది. భర్త గిల్లమన్నట్లుగా సైగ జేశాడు. అతను చేసిన ఆ సైగ, అందువల్ల కలిగిన శారీరకమైన కదలిక, అప్పుడతని ముఖం చూచి, యువతి, ముఖం వంచుకొని ముంగురులు ఒళ్లోవున్న పిల్లవాడికి తగిలేటట్లు, తనలో తను నవ్వుకొంది.

తల్లి మొదటివాణ్ణి మోచేతిమీద వాడు నిద్రలేచి సరిగా కూర్చునేటట్లు ఎంత అవసరమో అంత గట్టిగా గిల్లింది. యువతి చూస్తూ వుంది. వాడు ఉలిక్కిపడి నిద్ర లేచాడు. కళ్లు మూస్తూ తెరుస్తూ అటూ ఇటూ చూశాడు. ఊ! ఊ! అంటూ తల ఎగుర వేశాడు. పూ? పూ? అని ప్రశ్నించాడు. పసివాడు నూపుతున్న తల, గిల్లమని పంకించిన తల— రెంటిలో ఏదో సమాన ధర్మం గోచరించి, సమన్వయ తాపత్రయంలో యువతి వుంది.

మోచేయి మీద మంటగా వుండటం తెలుసుకొన్నాడు, చూచుకొన్నాడు. కళ్లలో నీళ్లు తిరిగాయి. కోపంగా చూశాడు. ఆ చూపు ఎంతో అందంగా వుంది. నువ్వెవరివి నన్ను నిద్రలేపటానికి, నా సొంత జీవిత పరిధిలోకి వచ్చి, నన్ను కలత పరచి భంగపరచి, వ్యాకులపరిచి, నిద్రాభంగంచేసి, స్వప్నచ్యుతి చేసి, నన్ను మేల్కొలిపే అధికారం నీ కెవరిచ్చారు. ఎప్పుడో అయిదేళ్ల పూర్వం నన్ను కన్నందువల్ల, నో ఏడాది పాటు పాలిచ్చినందువల్ల, రోజూ తిండి పెడుతున్నందువల్ల, నన్నక్కడికి తీసుకు వెళ్లి తీసుకు వస్తున్నందువల్ల, నా జీవితావధిలోకి వచ్చి, నా గిరిలోకి ప్రవేశించి, నన్ను కదిలించే అధికారం నీకే వుంది అన్నట్లుగా ఆ చూపు ఉంది అని యువతి అనుకొంది.

ఎవరు నన్ను గిల్లింది. నువ్వా నాన్నా అన్నట్లుగా చూశాడు. నేనే గిల్లాను. మళ్లీ నన్ను గిల్లవద్దు. నీ గోళ్లు అసలే ముళ్లు అన్నట్లుగా వెనక్కు జరిగి, అందకుండా వుంటాననుకొన్నట్లుగా కూర్చుంది తల్లి.

నువ్వు నన్ను గిల్లావు. నువ్వెవరివి నన్నా కానీయ్. నన్ను గిల్లే అధికారం నీకు లేదు. దెబ్బకు దెబ్బ అంతే అన్నట్లుగా ఆమెను గిల్లబోయాడు. అకస్మాత్తుగా బస్సు కుదుపుతో ఆగింది. ముందుకు వంగి తల్లిని గిల్ల బోతున్న వాడు, కిటికీకి తగిలి సీటులో కూర్చోబడ్డాడు.

అంతదాకా వెలుపలికి రాని ఏడ్పు, ధ్వని రూపం పొందింది. అపురు మని ఏడ్చాడు. ఆ ఏడ్పు తల్లి గిల్లిందనే బాధవల్ల కొంత, మళ్లీ గిల్లలేక పోయాననే కసివల్ల కొంత, కల్గింది గాని, నొప్పివల్ల కలగలేదు. బస్సు బయలు దేరింది.

మళ్లీ గిల్లబోయాడు. కూర్చున్న స్థలం లోంచి కదలలేదు. కదిలితే మునుపటిలాగా కూలబడవలసి వస్తుందని కంటే నిక్కణ్ణుంచి ఎందుకు కదలాలి! నన్నామె గిల్లటమే తనకు జరిగిన ద్రోహం! నేరం!! ఆ నేరానికి ప్రతీకారం చేయటానికి తనిక్కణ్ణుంచి లేచి, ఆమె దగ్గరకు వచ్చి గిల్లపోయే శ్రమ, ఆ శిక్ష అనవసరంగా తన కెందుకు కలగాలి అన్న కోపంవల్ల కదల లేదు.

తల్లి వాళ్లో వున్న పాప ఏ లోకం లేకుండా పాలు తాగుతూ వుంది. మూడో వాడు అన్నను కొంచెం సేపు తల్లిని కొంచెం సేపు మార్చి మార్చి చూస్తున్నాడు. యువతి గుండె మీద తలపెట్టుకొన్న రెండోవాడు అన్నను ఒకటే యిదిగా చూస్తున్నాడు.

మొదటివాడు ఏడ్పు మానలేదు. ఉష్ అన్నాడు డ్రైవరు. డ్రైవరు చూపుతో కాల్చి పారేద్దామన్నంత కోపంగా చూశాడు పెద్దవాడు.

అంతలో తల్లిని చూశాడు. ఆ డ్రైవరు వల్ల తనకు కలిగిన అవమానానికి కారణం ఆమె అనుకొన్నాడు. వెంటనే కొంచెం పైకి లేచి, ఆమెను గిల్లబోయాడు. చేయి అంద నివ్వలేదు. భుజం అందుతూ వుంది. భుజం మీద కచ్చగా గిల్లవచ్చు. కానీ గిల్లలేదు.

ఆమె, తల్లిగానీ, మరెవరయినా కానీ, గిల్లింది మోచేతి మీద. ఆమెనూ మోచేతి మీదే గిల్లాలి. అంతేగాని మరొక చోట కాదు. కాగా, నేరం చేసింది కుడిచేయి. ఎడం చేయి భుజం కాదు. ఏ చేతితో

కొత్తిమిరి చిట్కా

కొత్తిమీరి మితిమీరి వాడక్కర లేదు. శుభ్రంగా కడిగిన కొత్తిమీరి కట్ట ప్లాస్టిక్ బాగ్‌లో పెట్టి ఉంచితే సరి—నాలుగైదు రోజులైనా ఎండిపోదు. కావలసినప్పుడు—రెండు కొసలు కత్తిరించి చారలో, సాంబారులో పెరుగు పచ్చళ్లలో వేసుకో వచ్చు. కొందరు కట్ట నీళ్లలో ఝాడించి అలాగే వడేస్తారు. శుద్ధ దండుగ. కొంచెం వేసినా ఎక్కువ వేసినా కొత్తిమిరి సువాసన వేస్తుంది.

గిల్లిందో ఆ చేతినే ఎక్కడ గిల్లినదో అక్కడే! అంతే! అన్నట్లుగా వుంది అతని చూపు!

తల్లికి తతంగం అంతా అవగతపూర్వం కావచ్చు. కుడిచేయి మోచేతి భాగం అందకుండా పెట్టుకొంది. ఎడం మోచేయి మీద పాప తల వుంది. పెద్దవాడు ఆశోపహతుడయి సీటులో కూలబడటం చూచి యువతి గిలుక్కున నవ్వింది.

అంతవరకు ఆమె ముఖం చూడలేదు. ఇప్పుడా నవ్వును బట్టి ముఖం చూశాడు. చూడటం ఎండకాలం— మంటలు మండే, నిప్పులు చెరిగే ఎండకాలం— ఎండలాగా చూశాడు. గాడిపొయి నిప్పు కణికల సెగలాగా చూశాడు. క్షణకాలం బిత్తరపోయి, ఆ చూపుకు అనుబంధం ఏదో స్ఫురించినట్లయి, నవ్వి, నవ్వుతూ అతని వైపు చూచింది. అతని తల వద్దని వారించినట్లుగా కదలబోతుందనిపించి, నప్పుడు కోపంగా చూడటం మానుకొని మామూలుగా కూర్చుంది.

బస్ స్టాప్‌లో సిటీబస్ ఆగి సాగిపోతూ వుంది. ఎండకాలం మధ్యాహ్నం అత్యవసరం అయితే తప్ప ఎవరూ బస్సులో ఉండరు. బయటికి రారు. అందులోనూ నగరం నడిబొడ్డు మీద చారలాంటిది కదా రోడ్డు! జనం చాలావరకు దిగిపోయారు.

మొదటివాడు కూర్చున్న స్థలం వదలకుండా డ్రైవరునూ, యువతినీ కొలుస్తూ చూచి, ఏడ్పుమాని ముందుకు వంగి తల్లి కుడి మోచేయి అందుకోబోయాడు. అందలేదు. కుర్రాణ్ణి చూస్తూ బస్సు నడుపుతున్న డ్రైవర్ మలుపులో, సైకిల్ మీద పోతున్నవాణ్ణి పడగొట్టినట్లనిపించేటట్లుగా గిరుక్కున మలుపు త్రిప్పేసరికి, మలుపు కుదుపుకో, సైకిల్ కుర్రాడేమయ్యాడనో ఎందుకో యువతి ఎగిరిపడింది. ముందుకు చూస్తూ నడుపుతున్న డ్రైవరును, రోడ్డు మీద కులాసాగా చేతులు వదిలి సైకిల్ తొక్కుకు పోతున్న యువకుణ్ణి చూచి, తాపీగా గాలి పీల్చుకొని, వెనక్కు తిరిగి అతనిని చూచింది. అతను చూస్తూ వున్నాడు. కదలిక లేని బొమ్మ!

మొదటివాడు మళ్ళీ తల్లిని గిల్లబోయాడు. ఆ పట్టుదల ఏమిటో అర్థం కాలేదు. కుడి మోచేయి బస్సులో కాకపోతే అన్నం పెట్టేటప్పుడు కాకపోతే, పక్క వేసేటప్పుడు కాకపోతే, పడుకోబెట్టేటప్పుడు కాకపోతే, ఆమె నిద్రపోయిం తర్వాతఅయినా దొరక్కపోతుందా, గిల్లక పోతానా అన్నంత ప్రతీకారంగా కచ్చగా, కసిగా, పగగా చూస్తున్నాడు.


బస్సులో ఉన్న కొద్దిమందికీ ఆ పసివాడి ప్రవర్తన చాలా వింతగా వుంది. యువతి పసివాణ్ణి చూచి చూచి ఆ వింతకు వ్యాఖ్యానం కావలసిన దాని మాదిరిగా అతని ముఖంలోకి చూచింది. ఆమె తనను తనే అడుక్కొని ప్రశ్నకు అతని ముఖంలో సమాధానం శూన్యంగానే వుంది. డ్రైవరు కుర్రవాణ్ణి చూస్తూ వున్నాడు. ఇతను రోడ్డు చూచి బస్సు డ్రైవ్ చేస్తే బాగుండునేమో అనుకొని, అతను చూడని రోడ్డు ను ఆమె చూస్తూ వుంది.

మొదటివాడు లేచి, తల్లిని గిల్లబోయాడు. కుడి మోచేయి అందినట్లే అందింది. ఆమె వాణ్ణి కొట్టాలను కొన్నట్లు లేదు. చేయి దొరక్కుండా చేసుకోవాలనే అనుకొని వుండవచ్చు. చేయి తీస్తున్నప్పుడు నుదుటికి తగిలి, వుండు మీద కారం చల్లినట్లయి, కచ్చతో రెచ్చిపోయి, అమిత కోపంగా సీటు మీంచి లేవకుండా కుందు కూర్చుని తల్లి జుట్టు రెండు చేతులతో పట్టుకొని, వంచి కుడిచేయి అందుకొని మోచేతి మీద గిల్లబోతున్నాడు. జుట్టు పట్టుకొని, తల వంచినా తల్లికి బాధ లేదు గానీ, చేయి మాత్రం అందకుండా లాక్కుంది.

తల్లి మొండితనం పట్ల యువతికి వళ్ళు మండింది. ఒళ్ళో కూర్చున్న పిల్లవాణ్ణి ప్రక్కన కూర్చో బెట్టింది. లేచి నలిగిన చీరె కుచ్చెళ్ళు సరి చేసుకొంది. ముందుకు వెళ్ళింది. 'బాబూ!' అంది. మొదటివాడు కోపంగా చూశాడు.

ఆమె ఏమీ మాట్లాడకుండా కుడిచేయి మోచేయి మొదటివాడి గుండె దగ్గర పెట్టింది. వాడు చేయి చూశాడు. బొద్దుగా ఎర్రగా నున్నగా వుంది. ముఖం చూశాడు. చ్చగా, పగగా, ప్రతీకారంగా, కసిగా నవ్వు ఎన్నట్లుంది.

ఈ చేయి కాదు నన్ను గిల్లింది అనుకోలేదేమో, ఈమెకాదు నన్ను గిల్లింది అనుకోలేదేమో, ఎడం చేతో యువతి కుడిచేయి మోచేతిమీద గట్టిగా పట్టుకొని, మోచేతి పిక్క బిర్రుగా పైకి ఉబ్బితే, ఆమె అంత వయస్సున్న ఏ స్త్రీ అయినా ఫరవాలేదను



కొన్నాళ్ళుగా కళ్ళ తిరిగి, కొలుక్కోని గోరు, చూపుడువ్రేలు గోరు పోడించి తల నరాలు బిర్రుగా పంకిస్తూ గట్టిగా గిల్లి, వెనక్కు జరిగి సీటు కానుకొని, తాపీగా కూర్చున్నాడు. ఇంకేనా ఇంకా గిల్లుతావా అన్నట్టుగా వాడి ముందే వుంచింది కుడిచేయి. వాడా చేయి మూసి లెక్కలేని తనంతో అవతలకు నెట్టి పారేశాడు.

స్టాప్


రెండు గోళ్ళు దిగి మంట పుడుతున్న మో చేయి పిక్క చూచుకొంది యువతి. పై నంత నొక్కేసిన గుండ్రంగా గోరు గాయం కనబడింది. గాయం పడినంత భాగంలో పై చర్మం చిట్లింది. రక్తం గూడుకట్టి ఎర్రగా పైకి ఉబికింది. అది చూచుకొంటుంటే ఆమె ముఖం ఎందుకో ఎర్రగా కందిపోయింది. ఎవరివైపూ చూడలేక పోయింది. వణుకుతూ నిలబడింది. అంతలో బస్‌స్టాప్ వచ్చింది. ఆమె నిలవకుండా కుర్రవాణ్ణి చూచి నవ్వి, కుర్రవాడి తండ్రి చూచి—ఎలాగో చూచి—దిగిపోయింది. నెక్స్‌ట్ స్టాప్ స్టాప్ అంటున్నా వినకుండా దిగిపోయింది. ఆమె దిగిపోవటం. బస్సు బయలుదేరటం, వంచిన తల ఎత్తకుండా ఫుట్‌పాత్ మీద ఆమె నడచిపోతూ వుండటం, ఒక్కసారైనా చూస్తుందేమోనని చూస్తున్న అతనికి నిరాశే అయింది. కళ్ళు చెమ్మగిల్లాయి.

అతను లేచి రెండోవాణ్ణి తీసుకొని, యువతి గిల్లినవాణ్ణి మొదటివాణ్ణి ఏ చేతో గిల్లాడో, ఆ చేయి పట్టుకొని, తన సీటు దగ్గరకు తీసుకొనివచ్చి, ప్రక్కనే కూర్చో బెట్టుకొన్నాడు. ఆమె సీట్లో కూర్చున్నవాణ్ణి టక్ నలిగిపోతుందనుకోకుండా ఒళ్ళో కూర్చో బెట్టుకొన్నాడు.

తాము దిగవలసిన స్టాప్ వచ్చింది. యువతి దిగవలసిన స్టాప్‌కంటే ఒక స్టాప్ ముందు దిగిపోయింది. తాము ఎక్కిన స్టాప్ కంటే ఒక స్టాప్ వెనుక బస్సెక్కింది. ఎందుకో అతని కళ్ళు తడి అవుతూనే ఉన్నాయి.

తల్లి కూతురును చంకలో ఉంచుకొని, మూడోవాణ్ణి చేతో పట్టుకొని బస్సుదిగింది. తండ్రి రెండోవాణ్ణి భుజాన వేసుకొని, మొదటివాణ్ణి చేతబట్టుకొని బస్సుదిగి, భార్య వెనుక నడుస్తున్నాడు.

జీ...జీవితం వంటిది — వెళిపోతూ వుంది. ●



రక్తచందనం

(పి. త్రివిక్రమ నరసింహం) —



ఈ చెట్టు పేరు అందరికీ పరిచయమే. దాని ఉపయోగాలు మాత్రం అందరికీ పూర్తిగా తెలియవు. మన దేశంలో ఆటబొమ్మలు తయారీకి [తిరుపతి చందనం బొమ్మలు], ఇతర చెక్కలకు నన్నచిన్నెలు తేవడానికి విరివిగా ఉపయోగిస్తారు. యూరపులో మాత్రం దీనితో గుడ్డలకి, చర్మాలకి, ద్రవ్యాలకి [కుర్చీలు, మేజాలు] రంగులువేయడానికి ఉపయోగించుకొంటారు. రక్తచందనం చెక్కలో ఎర్రటి వర్ణపదార్థం ఉంది. దీన్ని సంటాలిన్ అంటారు అంటారు. ఇది ఆల్కహాలులో కరగిపోతుంది రంగువేయడానికి వీలుగా-ఉంటుంది.

• కాని ఇటీవల రక్తచందనం జపానులో వేరేవిధంగా ఉపయోగిస్తున్నారు. 'సమిసెన్' అనే వాద్యపరికరానికి ఇదెక్కువ అవసరం. అందమైన గొడుగు కర్రలకికూడా [పట్టుకొనే భాగానికి] ఉపయోగిస్తారు. అదేకాక ఈ కర్ర పెళ్ళి పండగ సందర్భాల్లో పవిత్ర హోమాలలో ఉపయోగించడం కూడా జరుగుతుంది. దానినుంచి నూనెను తీసి పరిమళ ద్రవ్యాల్లో సువాసనకు కలుపుతారు.

ముఖ్యంగా ఈ చెట్టుని టెరోకార్పస్ సంటాలినస్ అంటారు. ఇది రాయలసీమ ప్రాంతాల్లోనే విరివిగా ఉంది. కర్నూలు, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో ఉన్నప్పటికీ ఎక్కువ కడప జిల్లాలో ఎదుగుతోంది. అందులోనూ, చిత్తూరు కడప సరిహద్దుల్లో ఉండే మామండూరు అడవుల్లో సమృద్ధిగా పెరుగుతోంది. దానికి కారణం అక్కడ నేలలో కొన్ని అనుకూల పరిస్థితులు ఉండటమే.

దీనినుంచి లక్షలాదిరూపాయలు విదేశ మారకద్రవ్యం ఆర్జించవచ్చును. టన్నుకు 5 నుంచి 10 వరకు వేల రూపాయల ఆదాయం లభిస్తుంది. కాబట్టి వంటచెరకుగా కొట్టి దీన్ని వృథాపరచకుండా ప్రభుత్వం చాలా జాగ్రత్త పడుతున్నారు. జిల్లా అటవీ శాఖాధికారులు వీరిని పట్టుకోవడం తరుచు పేపర్లో చదువుతూ ఉంటాము. ఆ ప్రాంతాలలో వీటి తోటల విస్తీర్ణం ఎక్కువచెయ్యటానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ చెట్లు ఉపయోగంలోకి రావడానికి కనీసం 80 ఏళ్ళు పడుతుంది. కాబట్టి దీర్ఘకాలిక ప్రణాళికలు వేసుకోవాలి. అంతేకాక ప్రత్యేక పరిశోధనలు జరిపి, వాటి ఉన్నత లక్షణాలు పెంపొందింప చేయాలి

విద్యకు అవధి అనేది లేదు.

అయినా ఎప్పుడూ విద్యను అభ్యసిస్తూ కూచుంటే యితర కార్యకలాపాలూ, లోక వ్యవహారాలూ జరగవు. అందువల్లనే మనవారు దానికి కొన్ని సంవత్సరాలు అవధి నిర్ణయించారు. తర్వాత స్వయంకృషికి అవకాశం యిచ్చారు. విద్య పూర్తిచేసుకుని స్నాతకుడై గృహస్థాశ్రమాన్ని స్వీకరించవలెననేది మన పెద్దలు చేసిన నిర్ణయం.

ఈ కాలంలో విద్యకు ఒక కాల నిర్ణయాన్ని చేసి విశ్వవిద్యాలయాల స్నాతకులను తయారుచేస్తున్నవి. దానికి చిహ్నంగా పట్టాలు–యోగ్యతాపత్రాలు ఇస్తున్నవి–అవి ఏర్పరిచిన పరీక్షల్లో కృతార్థులయిన వారికి. అవి ఉంటేనేగాని జీవనోపాధిని సంపాదించుకోలేము. యోగ్యతలు ఉన్నా ఉద్యోగం లభిస్తుందని చెప్పలేం. అభ్యర్థిని తెర మీద ఎక్కించి, తెర వెనుకనుండి ఆడించే గట్టి సిఫారసు ఉండాలి. యోగ్యతాపత్రాలు లేనప్పుడు కూడా అది బాగా పని చెయ్యగలదు.

ఈ విధంగానే–రచయిత ఏదైనా పుస్తకం వ్రాస్తే దానికి గొప్పవారి ప్రశంసా (యోగ్యతా) పత్రాలను సంపాదించి పుస్తకంతో సహా అచ్చు వేయిస్తాడు అలా చేస్తే తన పుస్తకం అమ్ముడు పోగలదనే నమ్మకంతో. పుస్తకం చదివినా—చదవకపోయినా "ఏదో పాపం! అడిగాడు. పుస్తకం చెలామణీ అయి పది రాళ్ళు పడితే చాలు. మన సొమ్మేము పోయింది?' అనే దాక్షిణ్యంతోనో — సహజంగా ఎత్తా వున్నదనో 'పేరు పెంపులు గడించిన పెద్దలు నాలుగు మాటలు వ్రాసియిస్తారు. అయినా — ఉన్న బాధ [illegible]



అది సాక్ష్యపుస్తకంగా నిర్ణయించబడడంగాని, గ్రంథాలయాల బీరువాలలో తావు సంపాదించడం గాని జరగదు. (పుస్తకం ప్రచారంలోకి రావడానికి ఆ రెండు మార్గాలే యిప్పట్లో అనుకూలంగా వున్నట్లు కనిపిస్తున్నాయి గనుక.)


ఇది స్వార్థానికి సంబంధించినది. స్వలాభాపేక్షతోపాటు పడడం మానవ సహజం. ఇది కొంతవరకూ ఉచితంగానే కానవస్తుంది. కాని, స్వార్థాపేక్ష లేనివారు కూడా యోగ్యతాపత్రాలకు తాపత్రయపడడం వింతగా కానవస్తుంది.

ధర్మప్రచారం కోసం నిస్వార్థులయిన యోగులు ఉపన్యాసాలిస్తూ వుంటారు. తమ ఉపన్యాసాల సారాన్ని గ్రంథరూపంగా ప్రకటిస్తారు కూడా. అది ఉత్తమమైన పద్ధతే! అయితే—తమ గ్రంథాల ప్రచారం కోసం [illegible] యోగ్యతాపత్రాలు సంపాదించి పుస్తకంలో ప్రకటిస్తారు. ఆ ప్రశంసా పత్రాలిచ్చేవారు ఉన్నత పదవులను అలంకరించినవారూ, పెద్ద పెద్ద డిగ్రీలను సంపాదించినవారూ, ప్రఖ్యాతులయిన విద్వాంసులూ అయివుంటారు. తమ గ్రంథం జనసామాన్యానికి అందుబాటులో ఉండి వచ్చినట్లయితే— అది తప్పకుండా ప్రచారాన్ని పొందుతుంది. యోగ్యతాపత్రాలతో దానికి పని లేదు. లాభాపేక్ష లేని దృష్టితో ప్రకటించడం వల్ల వాటి వెలలు తక్కిన వాటికన్నా తక్కువగా వుంటాయి అందువల్ల ప్రచారానికి లోపం ఉండదు. స్వార్థ రహితులయిన విద్వాంసుల ఉత్తమ గ్రంథాలకు యోగ్యతాపత్రాలు అవసరం లేదు.

కొందరు మేధావులు నియమపూర్వకము లయిన అభ్యాసాలవల్ల దేవతలనూ, మహామునులనూ, మృతులయిన మహామేధావులనూ భూలోకానికి దింప వచ్చుననీ, వారి వల్ల పృచ్ఛకుల ప్రశ్నలకు తగిన సమాధానాలు పొందవచ్చుననీ— ఆ విధానంలో పని చెయ్యడం జరుగుతున్నది. వారి ప్రయత్నాలు సఫలం కావాలంటే నిస్వార్థ దృష్టి కావాలి. తమ ఉద్యమం ప్రచారం పొందడానికి వారుకూడా పెద్ద పెద్ద వారి వల్ల యోగ్యతాపత్రాలు సంపాదించుకుని ప్రచారం చెయ్యడం జరుగుతున్నది. యోగ్యతాపత్రాల జోలికి పోకుండా తమ ఉద్యమాన్ని క్రియాత్మకంగా ప్రచారం చేస్తే సత్ఫలితాలు కలగవచ్చు. యోగ్యతాపత్రాలవల్ల ప్రజలకున్న నమ్మకం కొరవడుతుంది. నిశ్చయజ్ఞానం ఉన్నప్పుడు ఆత్మశక్తి పని చేసినట్లు యోగ్యతాపత్రాలు పని చెయ్యలేవు. ■

గొలుసునవల

అపరాజిత



నలుగురు రచయిత్రుల సంయుక్తరచన

రెండవభాగం:

తురగా జానకీరాణి

జరిగిన కథ

రాధాకృష్ణ పోయేసరికి, పార్వతి గర్భవతి. ఆమె తప్పనిసరిగా రుక్మిణిని ఆశ్రయించవలసి వస్తుంది. బిడ్డని కని పార్వతి కూడా కన్నుమూసింది. మాధవిని తనతో తీసుకువెళి శ్యామల రాధలతోపాటు మాధవినికూడా కన్నకూతురిలాగే పెంచింది. పరమేశ్వరి మాధవి ఉద్యోగం చేస్తూ వచ్చిన జీతాన్ని శివశాస్త్రికి ఇవ్వడం ద్వారా అతని అభిమానానికి కొంత పాత్రురాలు కాగల్గింది. మధు ఆ యింట్లో కొత్తగా అద్దెకు వచ్చాడు. రాధ అతనితో పరిచయం పెంచుకుంది. మాధవి అతనికి బాగా సన్నిహితురాలైంది. రాజారావుకి శ్యామలకి పెళ్ళయింది. శకుంతల బాధ్యత మాధవిపై పెట్టి కన్నుమూస్తుంది శ్యామల. మాధవిని రాజారావు చేసుకోవాలనుకుంటున్నాడని తెలిసిన మధు కుంగిపోయాడు. మధు అప్పు తీర్చడంద్వారా మాధవిని తనదాన్ని చేసుకోవాలనుకుంటాడు రాజారావు. రాజారావు గురించి, అప్పు గురించి మాధవికి, రాధకి వాగ్యుద్ధం జరిగింది.

9

సాయంత్రం యింటికి చేరేటప్పటికి వాన కురుస్తోంది. అరుగు మీద మధు నిలబడి ఉన్నాడు. ప్రక్కన ట్రావెలింగు బ్యాగ్ పెట్టి వుంది. ఎక్కడికి వెళ్ళిపోతున్నాడు?

తను మెట్లు ఎక్కుతోంటే చూసి, అతను గదివేపు తిరిగాడు. తననిచూసి మామూలు ప్రకారం నవ్వలేదని గమనించనేలేదు మాధవి. మొన్నటినుంచి అతనితో ఎన్నో మాటలు చెప్పవలసినవి మిగిలిపోయాయి. అంతేకాక్క యీ ప్రయాణమెక్కడికో అడగాలి.

అతనివెనుకే నడిచి గదిలోకి వెళ్ళింది మంచంమీద పెట్టిన బ్యాగుమీద చేయి వేసి నిలబడింది. "ఎక్కడికి ప్రయాణం?" అన్నది. అతను మాట్లాడకుండా నిలబడి బల్లమీద ఏవో సర్దుతున్నాడు. ఒక క్షణం ఆగి అతనికి దగ్గరగావెళ్ళి, "ఏమైంది కోపం వచ్చిందా?— ఎంత వాన వచ్చిందో? అక్కడికీ పరుగెత్తుకుని వచ్చాను తడుస్తూ. మీరులేరు" అన్నది అతనివేపే చూస్తూ. ప్రక్కకి తిప్పుకున్న అతని ముఖంలో భావాలు కనబడడంలేదు. ఇంత సమీపంగా ఉన్నా కూడా వేలు కదిపి ఆమెను తాకలేదు. ఇబ్బందిగా అవతలికి జరిగి, "తడిసినట్లున్నావు. ఇంట్లోకివెళ్ళి బట్టలుమార్చుకో" అన్నాడు.

"ఫరవాలేదు. నిన్నరాత్రి కూడా ప్రొద్దుపోయినా రాలేదు మీరు. ప్రొద్దున్న తాళం వేసివుంది. ఎందుకంత కోపం నామీద? మరి—ఒకమాట చెప్పనా? బావ మనకి సాయం చేస్తానన్నాడు."

దీనికి జవాబుగా అతని వూపిరిలో కూడా కోపం ధ్వనించింది. ఆమె చెవులకి వినబడని ధ్వని అది.

'మీతో ఎన్నోమాట్లాడాలి. మీరెప్పుడు ఎక్కడికి ప్రయాణమైనారో చెప్పరేం?' అన్నది మళ్ళీ మాధవి.

"నువ్వు మాట్లాడినవన్నీ వినేందుకు నాకు తీరుబడి ఉండొద్దూ?" అన్నాడు. కొంచెం ఆగి, "రాజారావుగారు ఎవరికి సాయం చేస్తానన్నాడు? ఎవరు ఆ సాయం పుచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారు?—ఐనా, మీరిద్దరూ చాలా మాట్లాడుకున్నారేమోకదా?' అన్నాడు.

ముందు యీ నిష్టూరం అర్థంకాలేదు కానీ, ఆ తర్వాత అర్థమై తెల్లబోయింది మాధవి. ఏం మాట్లాడాము? అప్పు తీర్చడానికి డబ్బుంది, యిస్తానన్నాడు. భారం తీరుతుందికదా అని చెప్పాను" అన్నది.

అతనిప్పుడు ఆమెవేపు తిరిగాడు. "నీ భారం తీరుతుంది, తేలిగ్గా ఉంటావు కనక తనతో రావచ్చునన్నాడా? ఆ మూడువేల రూపాయల బదులుగా మూడు నెలల పాపని ఎత్తుకుని తనింటికి రమ్మన్నాడా?" అన్నాడు.

తెల్లని ఆమె కళ్ళల్లో, కనుపాపలు బెదురుగా, భయంగా, బేలగా కదిలాయి. నీరసమైన హృదయం మరింత నీరుకారిపోయింది.

"అల్లా ఎందుకంటాడండీ? పోనీ, డబ్బు పుచ్చుకోవద్దంటే మానేస్తాను."

"అయ్యో! ఎందుకు మానడం? పుచ్చుకో. మొన్న ఏదో తెలివి తక్కువగా డబ్బు యివ్వనక్కర్లేదు అని అన్నాను. కానీ— యిప్పుడు అవసరమే. ఇంటికి వెళగానే ముందు నిలవదీసి అడుగుతారు. ఎంతకాలమని నావాళ్ళని చూసుకోకుండా యిక్కడి యీ కారాగారంలో పడివుంటాను?" మాధవిని పూర్వం మమతతో చూసిన ఆకళ్ళల్లో యీనాడు అవహేళన, లాలించిన ఆ కంఠంలో యీనాడు తీవ్రత ఆవరించాయి.

ఆమె నిస్సహాయతనిచూసి అతను మళ్ళీ తన మాటలు ఆరంభించాడు. "డబ్బుతో

మన సంబంధాన్ని కొలవాలని నేను అనుకో లేదు''

''మరి నేను అలాగ కొలుస్తున్నానంటారా?'' అన్నది అస్పష్టంగా ఆమె.

''కాకపోతే మరేవిటి? ప్రతిసారీ అప్పు గొడవే కావాలి నీకు. అప్పు తీర్చడంకోసం అర్ధరాత్రివరకూరాజారావుతో ఆంతరంగికాలు మాట్లాడానికి సిద్ధపడ్డావు'' అతను కుర్చీలో కూర్చున్నాడు.

ఆమె అప్రయత్నంగానే మంచంమీద కూర్చుంది. ''ఎందుకంత మాటలంటారు? నే నెప్పుడు మాట్లాడాను బావతో?''

''గుర్తులేదా నేను చూశాను. మనిషిని కనక బాధపడ్డాను—ఐనా, యింక బాధ పడాల్సిన ఆగత్యం ఏముందిలే!'' అన్నాడు.

ఆమె తలవంచుకుంది. పార్కులోచూశాడు? చూస్తే మరి, తనని అడగలేదేం. సాయంత్రం పార్కుకి రాలేదేం అని? అక్కడే చీకట్లో తచ్చాడుతూ దొంగతనంగా తమ మాటలు పొంచి విన్నాడా? ఏం మాట్లాడింది తను? బావని పెళ్లి చేసుకుంటానని చెప్పలేదే? తల ఎత్తింది. సంకోచంలేని చూపులతో అతనివంక చూసింది.

''మరి శకుంతల సంగతి, మా యింట్లో వాళ్లందరి సంగతీ తనమీద ఆధారపడి ఉన్నాయి కదా! అందుకని విషయాలన్నీ మాట్లాడవలసి వచ్చింది'' అన్నది.

మళ్లీ అదేమాట—శకుంతల గొడవ నీకు దేనికి? కన్నవాడు ఆయన చూసుకుంటాడు. నీకు రక్త సంబంధమైనా లేని-ఆ అక్క నీకు అక్కకాదుగా? వింటున్నావా? ఆ పసికూన బాధ్యత అంతా నీదే అయినట్లు మాట్లాడతావేం? నువ్వు వెళ్లి నా కష్టాలు తీర్చండని అతన్ని ప్రాధేయపడితే ఆ అలుసు తీసుకుంటున్నాడు. ఈ మధు ఒకడు డబ్బు మనిషి ఉన్నాడు కనక వీణ్ణి వదిలించుకోవడానికి మార్గాలు చెబుతున్నాడు. అతని సహాయం అక్కర్లేకుండానే వదిలి పోతున్నానులే'' అన్నాడు మధు. వదిలి ఎక్కడికి పోతున్నాడు? ఎంత మూర్ఖంగా ఆలోచిస్తున్నాడితను?

''తను అనని మాటలన్నీ ఆయనకి ఎందుకు అంట గడతారు అన్యాయంగా? మీకు ఎందుకనో ముందునుంచీ ఆ పేరెత్తితే అంత చికాకు. నాకు రక్తసంబంధం లేకపోయినా, నన్ను ఆ కూపంలోంచి యువతలికి తెచ్చిన పెద్దమ్మ నాకు నిజంగా అమ్మే—అక్కకి



నాకుంది.''

"ఏమిచ్చావు మాట? దారేపోయే మనిషికి యిచ్చిన మాటలాంటిది అది. ఆనాడే గాలికి ఎగిరిపోయింది. దేశాలు తగలబడే విషయాల్లోనే మాటలకి విలువలేదు. దీనికింత విలువ ఎల్లా వచ్చింది! అతగాడు మాటి మాటికీ వస్తూ, యీ విషయం కెలుకుతుండడంవల్ల యింతగా నీ పీక పట్టుకుంటుంది యీ విషయం. ఆవేశంలో ఎన్నైనా అంటారు. అవి పట్టుక్కూకుంటే సంసారాలు కూలిపోతాయి. బ్రతుకులు పెడద్రోవ పడతాయి.'' అతనివ్యక్తిత్వం పైపైకి వున్న పొరలు ఒక్కటొక్కటీ వూడిపోతున్నట్లుంది. ఆమెకి. సుమకోమలమైన ఆ పెదవులు దాటి, వడగళ్లలాంటి యీ మాటలు ఎల్లా వస్తున్నాయి?

తన మనస్సులో వెచ్చగా నిద్రపోతున్న వలపు కొన్నిరోజుల క్రితమే నిద్రలేచింది. అప్పుడే బెదురుగా చెదరబోయింది. ఇప్పుడు తోచక, యీ వాదనల వలలో చిక్కుకుని తునకలై పోతోంది.

"నే నిచ్చిన ఏ మాటకూ విలువ లేదంటావా?'' అన్నది.

అతను తన ధోరణి ఆపాడు, ఆపిచూశాడు నిశితంగా—లేదేమో! అవును, లేదు నాతో నీ జీవితం ముడి వేసుకుంటానని నువ్విచ్చిన మాటకీ విలువలేదు మాధవీ!'' తడిలేని కంఠంతో అన్నా డీ మాట. ఆమె కళ్లు తడి అయ్యాయి.

"మీరు అన్నారుకదా ఆ మాట?' నా కోసం, నా సమస్యలు తీర్చడంకోసం పెద్ద బరువు మీదవేసుకున్నారు. అక్క పెళ్లి అయిపోయి ఆ అడ్డంకి తీరిపోతుందని, మీరు అంత పని చేశారు. మరి దీనికంతకీ విలువలేదని ఎల్లా అంటారు?''

"నేనూ అల్లాగే అనుకున్నాను మొదట్లో. కానీ— యివన్నీ వదిలేసి నువ్వు డబ్బే ముఖ్యమని మాట్లాడుతున్నావు. ఆ డబ్బుకోసం నా కిష్టం లేకపోయినా రాజారావుతో సంబంధం పెంచుకుంటున్నావు'' అన్నా డతను.

మాధవికి ఉన్నట్టుండి ఆవేశం వచ్చింది. గదిలోకి క్రమ్ముకుంటున్న చీకటి, బయట పెద్ద చప్పుడుచేసే వర్షం తన మనస్సులోనే అయినట్లు అనిపిస్తోంది. "ఇంక అవన్నీ మాట్లాడకండి మీరు. ఎక్కడికో వెడుతున్నారుకదా, వెళ్లరండి'' అన్నది

"రావడానికి వెళ్లడంలేదు. రాకుండా ఉండడానికే వెడుతున్నాను. ఎంతసేపు తడిసిన బట్టలతో వణుకుతావు? వెళ్లు''

అతను తిరిగి రావద్దనుకుంటూ వెడుతున్నాడన్నమాట. పదునుగావుంది కానీ ఆమెకి కి గ్రుచ్చుకోలేదు. ఏదో గుబులేకాని చీల్చే బాధకాదు మనస్సులోది. అతను వెడితే మరి సామాను—అతని డబ్బు పంపడానికి చిరునామా? అవి స్ఫురించినా అడగడానికి ధైర్యం లేకపోయింది ఆమెకి.

ఎవరో వచ్చి అరుగు మీద నిలబడినట్లు కనిపించింది. మాధవికి. గాలికి చేరబడిన తలుపుని పూర్తిగా తీసిచూసింది రాధ గది తలుపు దగ్గరగా నిలబడి లోపలికి చూస్తోంది.

"ఓ! నువ్వు వచ్చావా? ఆయన వెళ్లారో లేదోనని చూడ్డానికి వచ్చాను'' అంటూ వెనక్కి తిరిగి లోపలికి వెళ్లింది.

మాధవి లేచి నీరసమైన అడుగులతో యింట్లోకి వెళ్లింది. అతనితో ఒక వీడ్కోలు మాట చెప్పాలని ఆమెకిగానీ, విడిపోయిన యీ బంధాన్ని అతికే ఒక చిరునవ్వు బహూకరిద్దామని అతనికిగానీ తోచలేదు.

వాన జోరు తగ్గాక తాళం వేసుకుని మధు వెళ్లిపోయింది ఎవరూ చూడలేదు.

ఐదారు రోజుల తర్వాత శివశాస్త్రి పేరున వచ్చిన ఉత్తరంలో సామాను తన స్నేహితుడు పట్టుకెడతాడని వ్రాశాడని పెద్దమ్మ చెప్పింది. కొంత కుతూహలం, వెన్ను వరిచే డబ్బు గురించిన బాధ్యత, ప్రేరేపించగా ఆ ఉత్తరం సంపాదించి మాధవి,


మీరు నా కివ్వాల్సిన డబ్బు ఫలానా చిరునామాకి పంపండి అన్న విషయం కనబడింది. ఆ చిరునామా జాగ్రత్తగా వ్రాసుకుంది. అతను యీ వూళ్లో ఉద్యోగమే మానేశాడా, లేకపోతే తండ్రికే ఆ డబ్బు అందించాలనుకున్నాడో అని ఆమె కొంచెం ఆలోచించింది.

* * *

రాధ పరీక్ష ప్యాసైంది. రిజల్ట్సు కాలేజీలో వుండగానే తెలిసాయి మాధవికి. కొందరు స్టూడెంట్సు పోయి కనుక్కుంటోంటే, రాధ నెంబరూ యిచ్చింది. వాళ్లు మూడు గంటలకువచ్చి రిజల్ట్సు చెప్పగానే యింటికి వచ్చేసింది మాధవి. పెద్దమ్మ ఒక్కత్తీ, శకుంతలని ఆడిస్తూ కూర్చుంది. రాధలేదు. రాధ ప్యాసైందని మాధవిచెప్పగానే పెద్దమ్మ దేముడికి ఎన్నో దణ్ణాలుపెట్టింది. దానికి మంచి ఉద్యోగం రావాలనీ, కళ్యాణ ఘడియ రావాలనీ ఏవేవో కోరింది, ఆ దణ్ణాలు పెడుతూ.

"రాధ ఎక్కడికి వెళ్లింది?'' అన్నది.

"ఏమోమరి, అన్నం తినగానే పోయింది'' అన్నది పెద్దమ్మ. శకుంతల బోర్లా పడుకుని ముందుకు జరగడానికి ప్రయత్నిస్తోంది డబ్బాపాలు బాగా పడుతున్నాయేమో మంచి



వళ్ళో వేసింది అది. మాధవిని ఎత్తుకో
మని చేతులుచాచి గెంతులా పోతోంది.
మాధవి దాన్ని ఎత్తుకుని, బొజ్జ చుట్టూ
చేతులువేసి గట్టిగా దగ్గరకు అదుముకుంది,
దాని చిన్న చేతులని చెంపలకు రాసుకుని
వాసన చూసింది. కమ్మని వాసన సోపోయి.

'కాళ్ళు చేతులు కడుక్కురా' అంటూ ఒక అరటిపండు, చిన్న బర్ఫీముక్క కాగితంలో పెట్టి పట్టుకొచ్చింది పెద్దమ్మ.

'ఎక్కడివి అవి?' అన్నది మాధవి. ఇంట్లో యింత కూరకొనలేక అవస్థపడుతోంటే పళ్ళు, మిఠాయి ఎక్కడి నుంచి వచ్చాయి?

'రాధ తెచ్చింది.' అన్నది పెద్దమ్మ. కొనడానికి దాని దగ్గర డబ్బు ఎక్కడిది— ఎవరిచ్చారు అనుకుని అనుమాన పడుతూ, శకుంతలని చాపమీద పడుకోబెట్టింది. అది నసుగుతూ ఏడుపు మొదలుపెట్టింది. మాధవి పెరట్లోకి వెళ్ళింది.

రెండు నెలల నాడు బావ వెళ్ళిన వారానికి ఒక ఉత్తరం వచ్చింది. తన పేరుకి— మనం మాట్లాడిన విషయాలు ఏం చేసావంటూ. తను జవాబు వ్రాయలేదు. మధుతో యీ గొడవంతా జరిగిన తర్వాత కూడా ఏమి వ్రాయాలో తోచక వూరుకొంది. అతను దగ్గర ఉండగా మాట్లాడినప్పటికీ, ఉత్తరం వ్రాయాలంటే జంకు కలిగింది. మధుకి డబ్బు పంపించాలి. కంపెనీ చిరునామాకి తనే పంపడానికి వీలులేదు. మొత్తమంతా తండ్రి పేరే పంపాలి. డబ్బు పంపేయుండని వ్రాయడానికి మనస్కొప్పలేదు.

బైండింగు షాపు రెండు నెలల్లోనే మూత బడింది. షాపులో పెట్టిన కాగితాలు చెదతిన్నాయి. నోటు పుస్తకాలు పట్టుకెళ్ళిన వాళ్ళిద్దరూ దుకాణాలు కట్టేసుకుని పోయినారు. బాకీలు వసూలుకాలేదు. పనివాడు చిన్నసామాన్లు ఎత్తుకు పోయినాడు. అరువుమీద తెచ్చిన కాగితం బాకీ కోసం నూరు రూపాయలు మాధవి జీతంలోంచే యిచ్చింది. ఇవన్నీ శివశాస్త్రి వ్రాశాడు కాబోలు, అల్లుడు కొంత డబ్బు పంపించాడు. ఆ మిషన్లు అవి కొనేవాళ్ళని కుదిర్చాడు. వాళ్ళొచ్చి మిషన్లు పట్టుకు పోయినారు. ఆ అమ్మకం డబ్బు తన చేతులో పడేసుకుందామని శివశాస్త్రి చూశాడు

అపరాజిత

కానీ, రాజారావు ఉంటే అది బందోబస్తు చేసుకున్నాడు.

ఇంత యిబ్బందులలో వున్న రాధ స్నేహితులతో అంటూ, సినిమాలకు పోతూనే వుంది. అడపాతడపా పూలు, పళ్ళు ఏవో కొంటూనే వుంది. ఎక్కడిది డబ్బు దీనికి? పైగా మధుకి సర్దడానికి కూడా చెస్తానంది— ఎక్కడిదుందో?

కాస్సేపటికి అరుగు మీదకి వచ్చి నిలబడింది మాధవి. మధు గది ఖాళీచేసి వెళ్ళాక ఎవరికీ యివ్వలేదు మళ్ళీ. రాధ అక్కడే చదువుకోవడం, పగలు పడుకోవడం చేస్తోంది.

తలుపుకి తాళం లేదు. బయట నుంచి గొళ్ళెం పెట్టి వుంది. వీధిలోకి వున్న యీ తలుపు యిల్లా వదిలేసిం దేమిటని వెళ్ళి గొళ్ళెం తీసి, లోపలికి వెళ్ళింది మాధవి. చాపమీద రెండు చీరలు మాసినవి పడి వున్నాయి. బల్లమీద వున్న అద్దం దగ్గర దువ్వెన, మూతలేని పౌడరు డబ్బా పడి వున్నాయి. అంత కంగారుగా వెళ్ళవలసిన అవసరం ఏమి వచ్చిందనుకుంటూ, ఒక చీరె తీసి మడత పెట్టసాగింది మాధవి. బల్లమీద పడివున్న కాగితంమీద దృష్టి పడింది. మడుస్తున్న చీరె వదిలేసి, ఆ కాగితం తీసి చూసింది. రాధకి ఎవరో వ్రాసిన వుత్తరం అది, క్రింద సంతకం లేదు. 'సాయంత్రం రా తప్పకరా, రెండురోజులై చూడక తోచడం లేదు' అని వ్రాసివుంది. ఎవరు వ్రాశారిది అని అటూ యిటూ త్రిప్పి చూసినా ఏమీ అర్థం కాలేదు. ఎల్లా వచ్చిందో కూడా తెలియలేదు. అది తీసుకుని గుప్పిట్లో మడిచి పెట్టుకుని యివతలికి వచ్చి తలుపు తాళం వేసింది మాధవి.

ఏడు కావస్తున్నా రాధ రాలేదు. శివశాస్త్రి వచ్చి పెందరాళే యింత అన్నం తిని పడుకున్నాడు. ఆయన ఏమీ పట్టకుండా ఎల్లా వుంటాడన్నది చాలా ఆశ్చర్యమైన విషయం. రాధ స్నేహాల సంగతి పెద్దమ్మ చెప్పిందో లేదో కానీ, ఆయన ఏమీ పట్టనట్లే వున్నాడు.

మాధవి మళ్ళీ వీధి గుమ్మంలోకి వచ్చి మెట్లమీద నిలబడింది. అటు, యిటు చూస్తోంటే ఎడంవేపు వీధి చివర లైటు వెలుగులో రాధ వస్తున్నట్లు కనబడింది. ఆమె ప్రక్కన వున్న మనిషి— మగమనిషి లైటు స్తంభం దాటాక ఆగిపోయాడు. ఇద్దరూ ఐదారు నిముషాలు ఆగిపోయారు. రెండు అడుగులు వెనక్కివేసి చూస్తూ నిలబడింది మాధవి. అతను వెళ్ళిపోయాడు. వెనక్కి చూసి, రాధ గబా గబా నడిచి వచ్చి, మెట్లు ఎక్కుతూ గుమ్మం దగ్గరవున్న మాధవిని చూసింది. వెంటనే ఏమీ అనలేదు. గుమ్మం దాటి వెడుతూ, 'ఇక్కడ నిలబడ్డావేం?' అన్నది.

మాధవి మాట్లాడలేదు. తనూ లోపలికి కదిలింది. భోజనం చేస్తున్నంతసేపు చాలా మౌనంగా వుంది. పెద్దమ్మ రాధ రాగానే చెప్పింది, ప్యాసైనావుట అని. 'నాకు తెలుసు.' అన్నది రాధ. అంతకంటే మాటలలో సంబరం కనబడలేదు.

రాత్రి పడుకున్నప్పుడు మాధవి అడిగింది 'నిన్ను యింటి దగ్గర దిగబెట్టిన అతను ఎవరని?'— ఆ చీకట్లో రాధ మాట్లాడకుండా వూపిరి వదలడం మాత్రం వినబడింది మాధవికి.

'నా ఫ్రెండు. ఏం అల్లా అడుగుతున్నావు?' అన్నది చివరికి.

'ఏ రకమైన ఫ్రెండు?— నీకు సినిమాలకి వెళ్ళడానికి అన్నీ కొనడానికి డబ్బు ఎక్కడిది?' కంఠం తగ్గించే మెల్లిగా అడిగింది మాధవి.

కొంతసేపు మాట్లాడలేదు రాధ. ఆ తర్వాత 'నీ కెందుకు అవన్నీ?' అన్నది. ఇల్లా అంటుందేమోనని అనుమానంవుంది — కాని, అడగాలి, తెలుసుకోవాలి. ఇంట్లో బాధ్యత వహిస్తున్న మనిషిగా తన సంబంధం వుంది అనుకున్నది మాధవి.

'నీ బాగోగులు చూస్తున్న వాళ్ళకి తెలుసుకోవలసిన అవసరం వుందిగా!' అన్నది మాధవి. వెంటనే వచ్చింది జవాబు.

'నీకు మధు ఏరకమైన ఫ్రెండు అనీ— అక్క పెళ్ళికి నీకు ఎందుకు అంత డబ్బిచ్చాడనీ నేనూ అడగొచ్చుగా?— బావతో ఆ మంతనా లేమిటనీ అడగొచ్చుగా?' అని.

మాధవి పక్కమీద లేచి కూర్చుంది. పట్టరాని కోపం వచ్చింది ఆమెకి. ఎందుకిట్లా మాట్లాడుతున్నావు? ఈ మధ్య నీ తీరే మారిపోయింది! అని గట్టిగా అన్నది.

ఎప్పుడూ ఒకలాగే వుంటారా మనుష్యులు? నువ్వు మారినట్టే నేనూ మారుతున్నా అన్నది రాధ.

'నువ్వు, నేనూ ఒకటేనా? ఛీ! నీతో వాదించడం కంటే యిక్కణ్ణించి పోవడం నయం' అన్నది. అని లేచి, ఆ చీకట్లో వాకిట్లోకి వెళ్ళింది.

'అసలు నువిక్కడికి రాకపోతే మరీ నయంగా ఉండేది, అమ్మ తీసుకు రాకపోతేనే నయం' అని మెల్లిగా రాధ అన్న మాటలు వెనకాల వినవచ్చి, వెన్నులో పొడిచి నట్లైంది మాధవికి.

తను యిన్ని రోజులుగా సంపాదించి పెడుతోంటే కనబడటం లేదు. తనకొక శుభ్రమైన చీరె కూడా కొనుక్కోకుండా, దాని కాలేజీ ఖర్చులన్నీ పెట్టినదంతా ఏమీ రాణింపుకు లేదు. పదిహేనేళ్ళుగా తను యీ యింట్లో అసలు కూతుళ్ళకంటే ఎక్కువగా మెలగడం పొరబాటైంది.

అక్క చనిపోయిన నాడు, తన మీద కళ్ళు తెరవని పసికూనని వదిలేసిన నాటి దుఃఖం, మధు తనని విదిలించి పారేసి వెళ్ళిపోయిన నాటి అవమానం, చాలీచాలని డబ్బులతో తను సంసారం యీడ్చుకొస్తుంటే ఏమీ గుర్తింపులేని ఆ బాధ— అన్నీ కలిసి మున్నీరుగా ప్రవహించాయి ఆ చీకట్లో. మొట్ట మొదటి సారిగా తనకి తల్లి, తండ్రి లేరన్న బాధ గుబులు గుబులుమని క్రమ్ముకొంది. ఒక్క పెద్దమ్మ మినహా యింకెవరికీ యీ యింట్లో ఏమీకాదు తను. తన కోసం అంత త్యాగం చేయడానికి సిద్ధపడిన మధు కూడా దూరంగా వెళ్ళిపోయాడు తన తప్పేమీ లేకుండానే. తనకి ఎవరూ లేరు యీ లోకంలో అని తలుచుకుని మరింత ఏడిచింది ఆమె.

ఎంత సేపటికో వెళ్ళి మళ్ళీ తన పక్కమీద పడుకుంది. సావిట్లో ఉయ్యాల్లో శకుంతల నిద్రలో లేచి ఏడిచినట్లు విని సింది వెళ్ళి దాన్ని ఎత్తుకుంది. దాన్ని తీసుకొచ్చి ప్రక్కన పడుకోబెట్టుకుంది. తీయని వూపిరి తన శరీరానికి తాకుతుంటే ఆవళ్ళా తన చేతులలోకి, గుండెలలోకి మెత్తని వెచ్చదనం నింపుతోంటే నిద్ర పట్టింది ఆమెకి.

మర్నాడు ప్రొద్దున్నే లేచి, కాలేజీకివెళ్ళే ముందు బావకి పెద్ద ఉత్తరం వ్రాసింది. అన్నీ వ్రాశాక, మళ్ళీ చదువుకొన్నది. కాలేజీకి వెళ్ళాక, మళ్ళీ చదివి కవరులో పెట్టబోతూ, చివరికి— శకుంతలని తీసుకుని ప్రయాణమవుదామనుకుంటున్నాను'అని సందేహమైన వ్రేళ్ళతో చేర్చింది.

(ఇంకా వుంది)

(పై వారం: మూడవభాగం ప్రారంభం, రచయిత్రి కుమారి వాసిరెడ్డి సీతాదేవి)

వారఫలం

1-5-1970 శుక్రవారం మొదలు 7-5-1970 గురువారం వరకు

మేషం : లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది. వారం మధ్యలో వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. విద్యా వైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

స్త్రీలకు:— అధిక వ్యయం జరుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృషభం : వృత్తిలో ఆదాయం బాగా ఉంటుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. వారం మధ్యలో ప్రయాణాల్లో శ్రమ కలుగు తుంది. వ్యాపారంలో యువనీ విశేషంగా నమ్మడం తగదు. వారం ఆఖరులో తిరిగి అనుకూల పరిస్థితులు యేర్పడతాయి.

స్త్రీలకు— దైవకార్యాలు నెరవేరుతాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

మిధునం: వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. సాటివారిలో గౌరవం లభిస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. వారం ఆఖరులో ప్రయోజనం లేని శ్రమకు గురి కాగలరు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

కర్కాటకం: వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. స్థిరాస్థి వ్యవహారాలు బాగా ఉంటాయి. అధికారుల వలన జరగ వలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరతాయి. విద్యా వైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

స్త్రీలకు— విలాస వస్తువులు కొంటారు. పుణ్యకార్యాలు చేస్తారు.

సింహం : కొన్ని వ్యవహారాల్లో మీరు శ్రమ పడినా, ప్రయోజనం ఉండదు. ఆందోళన కలుగుతుంది. వారం మధ్యలో వ్యాపారంలో ఆదాయం బాగా ఉంటుంది. ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం లభించగలదు.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉండదు. విలాస వస్తువులు కొంటారు.

కన్య : ప్రయత్నించిన ప్రతిపని సులువుగా నెరవేరుతుంది. సాటివారిలో గౌరవం బాగా ఉంటుంది. వారం మధ్యలో ఉద్యోగంలో కార్యభారం పెరుగు తుంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. అధిక వ్యయం జరుగు తుంది.

తుల: వృత్తిలో శ్రమవిూదఅనుకూలత లభిస్తుంది. సాటివారితో మాట పట్టింపులు తగవు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. ప్రయాణాలోచనలు చేస్తారు. వారం ఆఖరులో కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తారు.

స్త్రీలకు— పుణ్యకార్యాలు చేస్తారు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృశ్చికం : వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. వృత్తిలో సాటివారితో పోటీ పెరుగుతుంది. ఉద్యోగంలో యితరుల నిమిత్తం శ్రమకు గురి కాగలరు. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. అలంకార వస్తువులు కొంటారు.

ధనుస్సు : అన్ని వ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా ఉంటుంది. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. విద్యావైజ్ఞానికరంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. రాజకీయ వ్యవహారాల్లో వికాసులు యేర్పడతాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. ఆభరణం కోసం వ్యయం చేస్తారు.

మకరం : వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగా ఉంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. స్థిరాస్థి వ్యవహారాలు బాగా ఉంటాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

స్త్రీలకు— సంతోషకరమైన వార్తలను వింటారు. దైవకార్యాలు నెరవేరుతాయి.


కుంభం: భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందు తుంది. రాజకీయ వ్యవహారాలు బాగా ఉంటాయి. ప్రయాణాలోచనలు చేస్తారు. కొన్ని వ్యవహారాల్లో మీ సంబంధితనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మీనం : అన్ని వ్యవహారాలు అనుకొన్నట్లుగా నెరవేరుతాయి. సాటివారిలో గౌరవం బాగా ఉంటుంది. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి.

స్త్రీలకు — ఆరోగ్యం బాగా ఉంటుంది. నూతన విషయాలను తెల్సు కొంటారు.


—మహేష్



మీరెప్పుడూ ఇంతే!

వనితాలోకం

కె. రామలక్ష్మి



మొగుడు కొడితే మాదాకరం వాడూ కొట్టాడని సామెత. అంటే ఇంట్లో భర్త కనుక భార్యని చిన్నచూపు చూడడం ప్రారంభించితే పిల్లలు మొదలు పనిమనుషుల దాకా అందరూ లోకువ చేస్తారని చెప్పుకోవచ్చు.

చాలామంది స్నేహితురాళ్ళని ఇలాంటి 'ఇరకాటపు స్థితి'లో చూశాక ఒకటనిపించింది. ఈ భర్తలెందుకు నలుగురి ముందూ భార్యల పరువుతీస్తారు? అంటే —నలుగురి ఎదుటా ఆ భార్యలు గట్టిగా సమాధానం చెప్పరన్న ధైర్యమేమో అనిపించింది!

చిన్నపిల్లలూ భర్తలూ ఒకే తరహా వాళ్ళు. చిన్నపిల్లలు చూడండి—ఇంటికి ఎవరేనా వస్తే—ఇంక అప్పుడే—ఎంతేనా అల్లరిచేస్తారు. అడగకూడదని తెలిసిన వన్నీ అడుగుతారు. ప్రతి దానికీ పంతం పట్టి మన పరువు తీస్తారు. ఎందుకు? అలా చుట్టాలూ స్నేహితులూ ఒచ్చినప్పుడు — మనం గట్టిగా గదమాయించలేం. కొట్టడం బాగుండదు కదా?! ఆ లోకువ కనిపెట్టి పిల్లలు అలా ప్రవర్తిస్తారు.

ఇక భర్తలంటారా, వీరిదీ అదే తరహా. ఇద్దరికీ తెలిసిన ఎవరేనా వస్తే 'దీని ముఖం' అంటూ కించపరుస్తారు. ఇక ఒక్క భార్య స్నేహితురాలెవరేనా వచ్చిందనుకోండి—'ఏమేవ్' అంటూ [illegible] న్నెక్కడ? తువ్వాలెక్కడ? ఇంకు పోశావా? చాకలి వచ్చాడా? నాకోసం ఎవరేనా వచ్చారా?...ఇలాంటి సమాధానం కూడా అక్కరలేని ప్రశ్నలు వేయడానికి పిలుస్తూనే ఉంటారు ఇవే విషయాలు సాధారణంగా ఆఫీసు నుండి రాగానే చెప్పండి. 'చాప్పదంటంతా వాగుతావెందుకు?' అంటూ చీదరించుకుంటారు. ఎటొచ్చీ పిల్లల విషయంలో లాగా వీరి విషయంలో ఏ చర్య తీసికోకలదు భార్య. ఒకటికి రెండుసార్లు—'ఒస్తున్నానండీ' అంటూ పనికి వెళ్ళకపోతే — యిక ధూమ్రమాకులై పోయి తమకోపాన్ని ముఖం మీదే కాదు చేతల్లో సహితం ప్రదర్శిస్తారు. వారు ఒక గదిలోంచి యింకో గదిలోకి నడిచే తీరు చూస్తేనే—కోపంతో ఎంత మండిపడి పోతున్నారో గ్రహించవచ్చు! అప్పుడిక భార్య స్థితి ఎలా ఉంటుందో ఊహించండి. చూడవచ్చిన స్నేహితురాలి స్థితి ఎలా ఉంటుందో ఊహించండి. 'నే వెళ్ళొస్తానే రాధా' అంటూ స్నేహితురాలు చల్లగా లేచి నిలబడుతుంది.


ఆ స్నేహితురాలిని పంపేసి చెంబులూ తప్పేలాలూ విసిరే మూడ్‌లో భార్య ప్రవేశించవచ్చు, గయ్యాళి అయితే భర్తమీద సాధింపు ప్రారంభించి దెబ్బలాటకి దిగవచ్చు.

ఇలాంటి విషమ పరిస్థితికి దిగకుండా [illegible] ర్భాటలో అనేక పరవాక్కారాలు ఆలోచించాను. 'నీ ముఖం, మానిండేమందన్నట్టు అప్పటి కప్పుడాలోచించాలిటా?' అంటుంది అత్తయ్య. 'నేనూ నా మొగుడూ వస్తామంటే మామయ్యా యిలా విసుక్కుంటె ఏంచేస్తావత్తయ్యా!' అన్నా. 'మామయ్య ముందో మంచినీళ్ల చెంబు, బజ్జీల పళ్లెం, బల్లమీద చదరంగం అమర్చేస్తాను. ఇంక మనం ఏం మాట్లాడుకున్నా ఇబ్బంది ఉండదు' అంది నవ్వుతూ అత్తయ్య.

నిజమే. భర్త ఇంటికి వస్తాడని తెలిసినప్పుడు బాతాకానీలో పడి అన్నీ మరిచిపోకూడదు. ఆయనగారి ఆహ్వానానికి అన్నీ అమర్చేసి మనం ఎలా కాలక్షేపం చేసినా ఫరవాలేదు. అలాగే భర్తగారు భార్యగారి స్నేహితులొచ్చినప్పుడే మండిపడ్డం అనే అలవాటు తప్పించుకోవాలి. ఓ అరగంట సరదాగా భార్యని ఉండనిస్తే వచ్చే లాభం ఓసారి గ్రహిస్తే ఏ భర్తలూ అంతగా భార్యలమీద మండిపడరు.

'ఎప్పుడెవరు వచ్చి వెళ్ళినా మా యింట్లో చిన్న మెత్తు భారతయుద్ధమే' అంటూ వాపోయే స్నేహితురాలిని ఓదార్చడం మన తరం కాదు, అది ఆమె రాత అనుకోవాలి. తనతో మాట్లాడ్డానికి చూడడానికి ఎవరేనా ఎక్కడ వస్తారో అని భయపడే భార్యలనీ మనం ఓదార్చలేం—అది వారి మానసిక దౌర్బల్యాలకి నాంది అవుతుందని భర్తలు ఊహించక పోవడమే—దాని ఫలితం.

'మీ రెప్పుడూ యింతే, ఎవరేనా వచ్చినప్పుడే నన్నలా ఆడిపోసుకోవాలా?' అంటూ నిలదీసే భార్య ఒక సంగతి మరిచిపోతుంది. అది భర్తగారి కాంప్లెక్సు. ఎవరి ముందేనా భార్యని చిన్నచూపు చూస్తే 'అబ్బ. వీడి పెళ్లాం చచ్చినట్టు పడుంది' అనుకుంటారనో ఏమో కర్మ! 'ఇదన్యాయం మామయ్యా' అని నే నెప్పుడేనా అంటే 'భార్యానాం రోదనం బలం అన్నారే—' అంటాడు మామయ్య...చుట్ట నములుతూ, 'అలా ఏడిపించడం కొందరికి సరదా!' అంటాడు — సగర్వా మండి



వలివేటి నాగచంద్రావతి

మినుకు మినుకు మంటున్న దీపమది.

దానివంక ఆశగా చూస్తోంది శారద. ఆమె జీవితంలో కారుమబ్బులు కమ్ముకున్న వేళ అది. దీపం వెలాతెలా పోతోంది.

కొడిగట్టిన దీపం ఎన్నాళ్ళయి వెలుగుతుంది? ఒక్కసారి గుప్పున వెలిగి టప్పున కొండెక్కింది. ఆమెను గాఢాంధకారంలో ముంచేస్తూ.

పరంధామయ్యగారి జీవాలు అనంతాకాశంలో లీనమయినాయి. శోకాలు మిన్నంటుతున్న ఆ వాతావరణంలో తడిలేని కళ్లతో శూన్యంలోకి చూస్తూ ఉండిపోయింది శారద. కంటిలో నీరే కాక ఒంటిలో రక్తం కూడా హరించుకుపోయిందేనాడో ఆమెకు.

పదిరోజులపాటు ఇంట్లోవున్న సంభారమంతా ఖాళీచేసిన బంధు బలగమంతా, పనికిరాని సానుభూతిని ఒలకబోసి చేతులు దులుపుకు చక్కా బోయారు.

నిన్నటివరకూ 'నాది' అనుకున్న ఇల్లంతా చట్టప్రకారం తమ స్వంతం చేసుకుంటూ, నడివీధిలో నిలబెట్టారన్న నింద లేకుండా, ఒక గదిపెట్టు ఇంటిలో చోటు చూపించి, చెరొకవందా చేతులో పెట్టి తప్పుకున్నారు కొడుకు లిద్దరూ.

నిజమే మరి! కడుపున పుట్టిన బిడ్డలకే మమకారాలు చచ్చిపోతున్న ఈ రోజుల్లో సవితి కొడుకులమీద అంతకన్న ఆశపెట్టుకోవడం అవివేకమే.

ముగ్గురాడపిల్లలతో వలిగిన మనస్సుతో మిగిలింది శారద.

పాతికేళ్ళన్నా నిండని తననా రెండు వందలూ ఎన్నాళ్ళని ఆదుకుంటాయి? ఆ తరవాత తనకి దిక్కెవ్వరు? తన పిల్లల గతేమిటి? లెక్కలేనన్ని ప్రశ్నలు. సమాధానం మావుమేర దూరంలో కనిపించని ప్రశ్నలు నిలవేస్తున్నాయి శారదని.

బాల్యంలో పోషించవలసిన తల్లీతండ్రీ, దాన్ని దాటించేసరికే తల మున్కలయి, పాతబడిన పడవలో తన జీవితాన్నుంచి బాధ్యత ఒదుల్చుకున్నారు.

యవ్వనంలో ఆదుకోవాలిసిన భర్త మధ్యలోనే చెయిజార్చి తన త్రోవ తను చూచుకుని మాయమై చక్కాబోయాడు.

మరి వృధాప్యాన్ని దాటించవాల్సిన కొడుకులసలు తనకు లేనే లేరు.

తాను నిస్సహాయ. కొట్టవచ్చినట్టు కనిపిస్తున్న ఈ కటిక వాస్తవానికి తట్టుకోలేక కళ్ళనీరు నింపుకున్నది శారద. పెళ్ళయిన ఆరేళ్ళలో ముగ్గురు ఆడపిల్లల్ని కని పాతికేళ్ళకే 'శారదమ్మ' అయిన శారద.

చెల్లెల్ని ఓదార్చడానికి వచ్చిన భాగ్యమ్మ శారదను పట్టుకుని బావురుమంటూ,

'నన్ను నట్టేట్లో ముంచి పొయ్యాడే' అంటూ పోయిన మరిదిని నిందించబోయింది.

'ఆయన్నెందుకంటావూ? నాకి దశ పడుతుందని ముందు మీకూ నాకూ తెలియదంటావా?' అంటూ నిర్లిప్తంగా వారించింది.

ఆ కంఠంలో, 'ఈ అన్యాయంలో నీపాలు కూడా వుందన్న ధ్వని వినిపించి క్షణం స్తంభించిపోయింది భాగ్యమ్మ. అంతలో తెప్పరిల్లి కలవరపాటుని కప్పిపుచ్చుకుంటూ, 'పోనీ ఆ ఇల్లంతా అయినా నీపేర పెట్టించుకున్నావా...?' మా తప్పూ వున్నదనుకో, మరి నీ తెలివితేట లేమయ్యాయి? అన్న చురుకు ఆ మాటల్లో నింపింది భాగ్యమ్మ.

అక్కగారి ఎత్తిపొడుపుకి సమాధానంగా 'మృత్యువు చెప్పి రాదు అందరికీ' అన్నది శారద విరక్తిగా.

ఏభైనాలుగేళ్ల పరంధామయ్యగారు కలక్టరాఫీసు హెడ్ గుమాస్తాగా రిటైర్ కాకముందే, హఠాత్తుగా పక్షవాతం వచ్చి కాలూ, చెయ్యే కాకుండా, నోరు గూడా పడిపోయి, మూడురోజులు మంచంమీద వుండి, ఎవరికీ ఏమీ చెప్పలేని స్థితిలో కన్నుమూశారు.

పరంధామయ్యగారి మొదటి భార్య ఏనాడో గతించింది. తండ్రి చాటున రెక్కలు తెచ్చుకున్న కొడుకు లిద్దరూ కోడళ్లు రాగానే గూడు వదిలిపెట్టి వేరుపడటంతో ఒంటరివాడైనాడు పరంధామయ్య.

పరంధామయ్యకి ఇంట్లో నాలుగు మెతుకులుడకేసిపెట్టే ఆడదిక్కు లేక పోయింది. ఆయన ఒంట్లో జవసత్వాలూ ఉడగలేదు. ఒంటరిగా బ్రతుకీడ్వాలంటే కష్టమే పాపం! ఒక స్నేహితుడి సలహామీద శారదని చూడటం తటస్థించింది.

తనకా ఇంకా పదేళ్ళ వుద్యోగపు గడువున్నది. జుట్టు నెరవడం ప్రారంభమైనా శరీరపటుత్వమేమీ తగ్గలేదు. కాయపారు మనిషేమో ఏభయ్యోపడి దగ్గరపడినా, అంతవయసున్నవాడిలా కనిపించడు.

శారద కూడా ఏపుగా ఎదిగి కాలుబారు పిల్ల అవటాన, పద్దెనిమిదేళ్లదయినా పాతికేళ్ల యువతిలా కనిపిస్తుంది. అందు చేత, తనవల్ల ఆ అమ్మాయికేమంత అన్యాయం జరగబోదు అన్న ధీమాతోనే శారద మెళ్లో తాళిగట్టాడు పరంధామయ్య.

దేవుడు మేలు చేసి తనకు మరి రెండు కాయలు కాచినా, పెద్దవాళ్ల పూచీ తనకిక లేదు గాబట్టి, మిగిలినదంతా వీళ్ల పరమే అవుతుంది కదా అనుకున్నాడు కూడా.

కాని భగవత్సంకల్పం వేరుగా వుంది.

* * *

తండ్రి మళ్ళీ పెళ్లి చేసుకోవడంతో ఆస్తిమీద ఆశలు పెంచుకోలేదు కొడుకు లిద్దరూ. సవితి తల్లికీ, ఆమె సంతానానికే రాస్తాడు విల్లు అనుకున్నారు.

కాని పరంధామయ్య తన సంకల్పాన్ని కాగితమ్మీద పెట్టకముందే, ఆయన చెయ్యీ నోరూ పడిపోయినై. దానితో కొడుకులిద్దరికీ స్వార్థం తలెత్తింది. చేజిక్కిన దాన్ని జారవిడుచుకుని సవితి తల్లికీ, సవితి చెల్లెళ్లకీ ఆస్తి ఒదిలేంత వుదారం లేదు వాళ్లకి.

ఇల్లు తండ్రికి పిత్రార్జిత మంటూనూ, పొలం తమ తల్లి పసుపుకుంకానికి ఇచ్చిందంటూనూ స్వాధీనం చేసుకున్నారు కొడుకులు.

మారు మాటాడలేదు శారద. తనమాట చెల్లదు. కాని ఆమెకు తెలుసు; పరంధామయ్య చెబుతూ వుండేవాడు. తండ్రి ఇచ్చిన స్థలంలోని మట్టికొంప పడగొట్టించి తన రెక్కలమీద ఇంత దిట్టమైన డాబా ఇల్లు కట్టించానని సగర్వంగా చెప్పుకునే వారాయన.

'ఇదొక్కటిమిగిలితే చాలోయ్ మన అమ్మాయిల పెళ్లిళ్లన్నీ గట్టెక్కించడానికి! పొలంమీద అయివేజౌస్తుంది. రిటై

రయ్యానా పెన్షనొస్తుంది; దానా దీనా మన జీవితాలు చీకూ చింత లేకుండా వెళ్ళ మారిపోతాయి' అని లెక్కలు కడుతూ సంతృప్తి వెళ్ళబోశేవాడాయన.

ముందు ముప్పు తెలుసుకోగలగటం వింతటివారికీ శక్యం కాదు.

భర్త చనిపోయేముందు, ఆయన మాట రాక, కళ్ళతోనే తనకోసం పడిన ఆవేదననూ, కొడుకులకు ఏదో చెప్పి పోవాలన్న ఆరాటాన్ని తాను గ్రహించింది. కాని ఆ కళ్ళలోని భాషను అనువదించి చెప్పినా తనను నమ్మేదెవరు? జరగబోయేది జరగనిమ్మని, పరిస్థితులకి తలవంచి చూస్తూ వూరుకున్నది శారద.

భాగ్యమ్మ వెడుతూ వెడుతూ, 'ఈ పసి వాళ్ళతో ఎలా వేగ గలవు?' ఆ గది కాస్తా అద్దెకిచ్చి నాన్నదగ్గరికే వెళ్ళు. వాళ్ళకు తప్పుతుందా!' అన్నది.

'చూస్తాను.' అన్నది శారద ముభావంగా.

కాని ఆమెకు పుట్టింటికి వెడదామన్న ఆలోచనే లేదు. వెళ్ళి అక్కడ బావుకునేదేమీ లేదు. రోగిష్టి తల్లి, ఇంకా పెళ్ళి కావాల్సిన చెల్లెలూ, తండ్రి గుండెలమీద కుంపట్లయి వున్నారు ఇప్పటికే. వాళ్ళిద్దరికే సరిగా కూడు పెట్టలేని సంపాదన ఆయనది. ఇక తానుగూడా వెళ్ళి ఎలా ఆ ముసిలాయనమీద మరింత భారం మోపగలదు?

అబల

తన బ్రతుకు తెరువు తాను వెతుక్కోవలసిందే తప్పదు.

ఒక సవితి కొడుకు ఫానూ, మరో సవితికొడుకు రేడియో తీస్కేసుకోగా మిగిలింది పాత్రసామానూ, మంచాలూ కుంచాలూను. తన నిత్యావసరాలకి ఏవో చిన్న చిన్న పాత్రలూ, పళ్ళాలూమాత్రం వుంచుకుని మిగతావన్నీ ఎలా వీలయితే అలా అమ్మేసింది. అమ్మబోతే అడివి— కొనబోతే కొరివి. ఏ వస్తువుకీ కొన్నధరలో పదోవంతురాలేదు. ఎన్ని శాలీ్తలమిన్నా వచ్చినది నాలుగ్గైదు వందరూపాయలు మాత్రమే. తన బ్రతుక్కి భవిష్యత్తుకి ఆధారం చూపించాల్సినవి ఆ నాలుగ్గైదు వందలే. ఎలాగయితేనేం ఒక కుట్టు మిషను కొనుక్కున్నది.

*   *   *

తెలతెలవారుతోంది. అంధకార మింకా వెలుగురేఖల ఆధిపత్యాన్ని అంగీకరించినట్టులేదు. వుండీ వుండీ కాకులు మాత్రం 'కావు—కావు'మంటూ వేడుకుంటున్నాయి ఎవరినో.

నిద్రమత్తు వదలని కళ్ళు చన్నీళ్ళతో కడుక్కుని కుట్టుమిషను ముందు కూర్చున్నది శారద. లాంతరుదీపం మసక వెలుతుర్లో సూదిలో దారం ఎక్కక మారాం చేస్తోంది.


మొదట్లో 'అలవాటు లేని అప్రపోసనంలా' ఎప్పుడో సరదాగా నేర్చుకుని మర్చిపోయిన విద్యను బలవంతాన గుర్తుకు తెచ్చుకుంటూ కుట్టబోతే, వెనక్కేగాని ముందుకు తిరగనని మొరాయించేది చక్రం. క్షణక్షణం దారం తెగుతూ తన వోపికను పరీక్షకు పెట్టేది మిషన్. కాళ్ళు లాగి కాస్సేపటికే అలిసిపోయేది తాను. ఇప్పుడు చాలా నయం.

అందరూ కుట్టేదానికన్నా ఓ అణా తగ్గిస్తానని ఆశబెట్టి తెచ్చిన ఇరుగు పొరుగు వాళ్ళబట్టలన్నీ చేతగాక చెడగొట్టి, వాళ్ళు పెట్టే చివాట్లన్నీ దిక్కు మొహం వేసుకుని తినాల్సివచ్చేది కొన్నాళ్ళు. మరీ గడుసువాళ్ళ పోరు పడలేక, కొత్తగుడ్డలు కొని ఇచ్చేసి బెడద వదలించుకుని, తన చేతగానితనానికి నిస్పృహ చెందిన రోజులూ వున్నాయి.

చదువూ సంధ్యాలేని తన మనుగడకు తాను వెతుక్కోగలిగిన ఆధారం అదొక్కటే. కాబట్టే అవమానాలు ఎదురైనప్పుడు తల ఒంచుకుంటూ, అవరోధాలొచ్చినప్పుడు తప్పించుకుంటూ, ఎలాగయితేనేం ఇప్పుడిప్పుడే ఓదారిన పడ్డది. 'బాబిను'కి దారం పోస్తూ గడిచిన రోజులు తలుచుకుని నిట్టూర్చింది శారద.

'ఈ నాలుగుజాకెట్లూ కుట్టి చేతులో పెడితేగాని ఇవ్వాలిసిన రెండురూపాయలూ ఇవ్వనన్నది ఎదురింటావిడ. ఆ రెండు రూపాయలైనా తెచ్చి పెరుగమ్మి కాతాలో జమ కడితేనే తప్ప, ఈరోజు పిల్లల కంచాలలోకి మజ్జిగ నీళ్ళమరవు. ఈ పూటకి బియ్యం సరిపోవచ్చు, కాని రాత్రికి తక్కువవుతాయి. తన స్థితిగతులెరుగున్న ఏ ఇరుగు పొరుగావిడ తనకు అప్పుపెట్టదు. పోనీ కుట్టాల్సిన జాకెట్లూ, గట్రా ఏవయినా ముగించియిచ్చి సొమ్ము తెచ్చుకుందామన్నా, అవీ లేవు. ఈ నాలుగు జాకెట్లూ తప్ప. మరెలా? తానొక్కతే అయితే మూడంకె వేసి ముడుచుకు పడుకోగలదు. మరి పిల్లల్నెలా ఆపడం? ఏకాస్తయినా కడుపు దాచుకోవడం తెలియని వయస్సే వాళ్ళది!

పూర్తిగా తెల్లవారింది. కుట్టడం పూర్తిచేసి లేచింది శారద. 'మిషన్'మీద ముసుగుకప్పి, కుట్టిన నాలుగు జాకెట్లూ



ముడిచి, 'అది' జాకెట్టులో చుట్టి పెట్టింది.

పెద్దపిల్లలిద్దరూ లేచి దగ్గర కొచ్చారు. వంటింటి పొయ్యాలలో మసులు తుంటే ఒక్కపూపు చెసి పిల్లలిద్దర్నీ తీసుకుని పెరట్లోకి వచ్చింది. వాళ్లిద్దరి మొహాలూ కడిగించి తనూ కాల కృత్యాలు ముగించుకునేసరికి సూర్యోదయ మయింది.

బాదం చెట్టుమీద కాకి రెక్కలు టపటప లాడిస్తోంది. పచ్చమట్టి, పేడతో అలికిన నేలమీద కొమ్మల్లోంచి తప్పించుకుని దూసుకొచ్చిన సూర్యకిరణాలు మెరుగు ముద్దర్లు వేస్తున్నాయి. రాత్రి రాలిన బాదంకాయలకోసం పిల్లలిద్దరూ కీచులాడుకుంటున్నారు. ఇద్దరికీ కాయలు సమంగా పంచిపెట్టి, పది రోజుల క్రితం వేసిన తోటకూర మడివంక చూసింది శారద. ఎండ చాలక, మారాకు వెయ్యక గిడసబారిపోయింది మడి. నిట్టూర్చింది శారద. తన బ్రతుకులానే అవి మోడు వారిపోయాయి.

ఎప్పుడు లేచిందో మూడో పిల్ల గీత తప్పటడుగులు వేస్తూ తల్లిదగ్గరకి చేరింది. అక్కయ్యలిద్దరి దగ్గరా బాదం కాయలు చూసి మాటలు రాకపోయినా కాయలు చూపిస్తూ గునవటం ప్రారంభించింది. దాని అభినయానికి నవ్వుకుంటూ చంకనెత్తుకుని పెద్దపిల్లలిద్దరి దగ్గరా చెరి రెండు కాయలూ తీసుకుని దాని చేతుల్లో పెట్టింది.

'అమ్మగారూ—పెరుగు' వెంకాయమ్మ వాకిట్లోంచి కేకవేసింది.

చటుక్కున చంకనున్న గీతని కిందకు దింపి 'మరిచేనేవ్-కాముడూ! చూడమ్మా, మిషను బల్లమీద జాకెట్లు జాగ్రత్తగా తీసికెళ్లి, మాణిక్యం పిన్నిగారికిచ్చేసి; మా అమ్మ రెండు రూపాయలు ఇమ్మన్నదని తీసుకు రా. తొందరగా రావాలిసుమీ! ఇక్కడ వెంకాయమ్మ గొడవ చేస్తుంది.' అంటూ పెద్దపిల్ల కామేశ్వరికి చెప్పి పంపి గిన్నె తీసుకుని తనూ వాకిట్లోకి వచ్చింది.

ఎదురుగా రిక్షా దిగుతూ భాగ్యం పెనిమిటి భానుమూర్తి కనుపించాడు. బావగారు కంటపడగానే గుండెలు జారి పోయాయి శారదకి. వెంకాయమ్మ తవని

చూస్తూనే దండకం ప్రారంభిస్తుందే, ఆయన ఎదురుగానే! భగవాన్ ఇప్పుడేది దారి?

అనుకున్నట్టుగానే మొదలు పెట్టింది పెరుగమ్మి. 'ఏందమ్మా గిన్నె మాత్తర ముట్టుకొచ్చావ్ సొమ్మేది?' అంటూ తన కంచుగొంతు గట్టిగా మ్రోగించబోయింది. భయపడుతూనే ధైర్యంచేసి 'ఎందుకలా అరుస్తావ్ వెంకాయమ్మా! క్షణమాగు. నీ డబ్బు నీకిచ్చేస్తాను' అని గద్దించి అటు తిరిగి, వెలావెలా పోతున్న మొహానికి చిరునవ్వు పులుముకుంటూ బావగారిని పలకరించింది,

'రండి బావా' అంటూ.

తన ప్రతాపానికి ఎదురన్నది ఎరగని వెంకాయమ్మ ఈ హఠాత్ పరిణామానికి విస్తుపోతూ మళ్లీ విజృంభించ బోయింది గాని, కొత్త మనిషిని చూసి తమాయించుకుని గొణుక్కుంటూ వుండిపోయింది

భానుమూర్తి లోపలికి వెళ్లాడు తనని చూసి తలుపు చాటున నక్కి వింతగా తొంగి తొంగి చూస్తున్న గీతని దగ్గరకు తీసుకుని చెక్కిలిమీద ముద్దులు పెడుతూ గదిని పరికిస్తూ వుండిపోయాడు. పేదరికానికి దాఖలాగా వుందా గది

కామేశ్వరి చేతిలోని రెండు రూపాయలూ వూడబెరుక్కున్న వెంకాయమ్మని రహస్యంగా బతిమలాడుతోంది శారద. 'ఒక్క రూపాయి జమ వేసుకో వెంకాయమ్మా బంధువు లొచ్చారు చూస్తున్నావుగా! నా పరువు నిలబెట్టు. చేతి పైసా లేదు. త్వరలోనే నీ బాకీ మొత్తం ఇచ్చేస్తానుగా!' అంటోంది.

'సాల్లేవమ్మోయ్. బాకీ ఐదు రూపాయలుంటే రెండు రూపాయలిచ్చినావేందని నేనడుగుదామనుకుంటే, పై పెచ్చు ..' పెరుగ్గో, మజ్జిగో తెలియని కుండలోని జావలాంటి పెరుగుని ఒక్కసారి గరిటతో గ్గిరున తిప్పి కొలిచి గిన్నెలో పోస్తూ ఈసడించింది పెరుగమ్మి.

ఇంకేదో చెప్పబోతున్న శారద మాటలు వినిపించుకోకుండానే గంప ముల్లాగా నెత్తి మీద కుదురు పెట్టుకొని, 'ఇది రూపాయి తియ్యేళ చీటి గట్టాల! నా సొమ్మెవరికి ఏసుకోను?' అంటూ వినవిస నడుచుకుంటూ వెళ్ళిపోయింది వెంకాయమ్మ.

అబల

వుసూరు మన్నది శారద ప్రాణం. బావకి కాఫీ ఎలా? ఫలహారం లేకపోతే పోనీ. దేవుడా ఎలాటి సమస్య...!

చెంబుతో నీళ్లూ, తువ్వాలూ అందిస్తున్న శారదని, 'ఎలా వున్నావమ్మా?' అంటూ ఆప్యాయంగా పలకరించాడు భానుమూర్తి, గీతని దింపి చెంబందుకుంటూ.

'ఇలా వున్నాను బావా' తలవంచుకున్నది శారద.

మరదలి దైన్యస్థితికి కదిలిపోయాడు భానుమూర్తి. కళకళ లాడుతూ పచ్చగా పూచిన తంగేడులా వుండే శారద శుష్కించి పోయింది. 'ఎంత మారిపోయింది?' అనుకుని జాలిపడ్డాడు

ఆ ఎందుకొమ్మా, ఈ ఎందుకొమ్మా జేర్చి దొడ్లో పొయ్యిలో మంటబెట్టి, బావగారి స్నానానికి నీళ్లు ఏర్పాటు చేస్తూ మథన పడుతోంది శారద. ఆయనకిప్పుడు కాఫీకి, భోజనానికి ఎట్లాగా? అని.

నీళ్లతోడి కాకరపాదు వారగా పెట్టి పీట వేసింది. సబ్బు లేదు కొంచెం సున్నిపిండి వో పళ్లెంలో వేసి పెట్టిందక్కడ.

భానుమూర్తి స్నానం చేస్తుంటే, కామేశ్వరికి మంచెంబిచ్చి, 'కాంతమ్మగారికిది ఇచ్చి రెండురూపాయలడిగి పట్టమ్మ'ని చాటుగా చెప్పి పంపింది. మధ్యాహ్నం తాను వస్తానని గూడా చెప్పమన్నది.

ఐదు నిమిషాలలో కామేశ్వరి పరిగెత్తుకుంటూ వచ్చింది మరచెంబుతో సహా. అప్పటికి భానుమూర్తి స్నానం ముగించుకుని రాబోతున్నాడు. కల్లా కపటం తెలీని కామేశ్వరికి తల్లిచేస్తున్న సైగలు అర్థం కాలేదు. 'కాంతమ్మత్తయ్యగారి దగ్గర రూపాయలు లేవటమ్మా, మరో చోట ఇప్పిస్తానన్నది. బేడచెప్పినట. నిన్ను అడిగి రమ్మన్నది,' గట్టిగా చెప్పేసింది రొప్పుతూ

'బావగారు విన లేదు కదా' అని ఆందోళన పడుతూ తలెత్తిన శారదకి, గమ్మంకే చూస్తూ గుమ్మం లో నించున్న భానుమూర్తి అగుపించాడు. తప్పు చేస్తూ

దొరికిపోయిన దానిలా తలతిప్పుకుని ఏదో పని వెతుక్కోసాగింది శారద.

మరదలి అభిమానాన్ని అర్థం చేసుకున్న భానుమూర్తి మరి అక్కడ నిలబడకుండా వెళ్లి బట్టలు వేసుకుంటూ ఆమెను అవస్థనించి తప్పించాడు.

ఏం తిప్పలు పడ్డదో దేవుడికెరుక. అరగంటలో రెండు ఇడ్లీలు, ఇత్తడి గ్లాసుతో కాఫీ, తెచ్చి పిల్లలతో కబుర్లు చెబుతూ చాప మీద కూర్చున్న భానుమూర్తి దగ్గిరగా పెట్టింది. 'తీసుకోండి బావా' అంటూ.

మారు మాటాడకుండా కాఫీ, టిఫినూ ముగించాడు భానుమూర్తి. పళ్లెం తీసుకుపోవచ్చిన శారదతో, 'చూడమ్మా నా గురించి వేరే ప్రయత్నమేమి చెయ్యొద్దు. నాకిప్పుడు బస్సువున్నది. అర్జంటుగా వెళ్లాలి' అన్నాడు నింపాదిగా

'అదేమిటి బావా. భోంచేసి వెళ్లండి' అన్నది. ఆ మాటల్లో పట్టుదల లేదు.

'అలాక్కాదు లేమ్మా పెదపాడు పొలం పనిమీద వెడుతూ చూచిపోదామని దిగాను ఇక్కడే దిగబడిపోతే అక్కడ పని ఆగిపోతుంది మరోసారి వస్తా లేమ్మా' అంటూ లేచి నించున్నాడు.

బలవంతం చెయ్యలేదు శారద. తన దౌర్భాగ్యస్థితి అతను గ్రహించుకున్నాడల్లే వుంది. ఎలా వుండగలడు? అనుకుంది లోపల. ఇంటికొచ్చిన బంధువుకి పట్టెడు మెతుకులు పెట్టలేక పోయానే, అన్న వేదన ఆమెను క్రుంగదీస్తోంది.

భానుమూర్తి వెళ్లిపోయాడు. మరి కొంత సేపటికి కామేశ్వరి కేక వేసింది 'అమ్మా పెదనాన్న సంచి మరిచేపొయ్యాడేవ్' అంటూ.

భానుమూర్తి చేతిసంచి చూస్తూ 'అయ్యో ఇప్పుడెలాగ' అనుకున్నది శారద.

మరో అరగంట లోపలే తిరిగి వచ్చిన భానుమూర్తిని చూసి, సంచికోసమే వచ్చాననుకున్నది శారద. కాని అతని వెనకే రిక్షా మీదనించి దిగుతున్న సామగ్రిని చూసి ఆశ్చర్యపోయింది. మరి అతను బస్ స్టాండుకు వెళ్లలేదన్నమాట.

భానుమూర్తి పంచె జాయిషీ చేసుకున్నాడు.

'నే నెందుకు వెళ్లలేదో తెలిసి... నీవు

అభ్యంతర పెడతావనే ఇలా చేశాను శారదా! తండ్రి తరవాత తండ్రంతటి వాడివి నా దగ్గరనే మొహమాటపడి నీ పరిస్థితిని దాచుచేస్తున్నావంటే నాకెంతో బాధగా వుంది. ఇదే మీ అక్కయ్యయితే నువ్విలా చేయగలుగుదువా? నువ్వెంతో అభిమానవతి వని నాకు తెలుసును. కాని నేనూ పరాయివాణ్ణి కాదమ్మా' అంటున్నప్పుడు అతని గొంతూ, మనసూకూడా ఆర్ద్రమయ్యాయి.

శారద కళ్ళు చెమర్చినాయి. మాటలు గొంతు పెగిలి రాలేదు. అమలినమైన అతని సానుభూతికి లజ్జతో క్రుంగిపోయింది.

ఆ స్థితిలో ఎంతసేపలా వుండిపోయిందో గాని, తెచ్చిన సామానంతా రిక్షావాడి సాయంతో ఇంట్లోకి జేర్చిన భానుమూర్తి హెచ్చరించటంతో తెప్పరిల్లుకున్నది.

గీత చేతిలో రెండు పదిరూపాయల నోట్లు మడిచి పెడుతూ, 'మరి నేను వెళ్ళివస్తానమ్మా. ఇకమీద ఎప్పుడు అవసరమైనా నా వంటి సహాయం తీసుకోవానికి జంకవద్దు సుమా!' అంటూ సంచి చేతులోకి తీసుకున్నాడు భానుమూర్తి.

మెల్లిగా తల వూపింది శారద.

కను మరుగవుతున్న బావగారిని కృతజ్ఞతగా చూస్తూ 'ఆయన' ఔదార్యాన్ని తలుచుకుంటూ నిలబడిపోయింది శారద.

పరిచివున్న బిస్కట్ల పొట్లాల మీద దండయాత్రచేసి కుస్తీలు పడుతున్న పిల్లల్ని సద్దుతూ భానుమూర్తి తెచ్చిన సామానుకేసి దృష్టి సారించింది. బియ్యం, పప్పు వుప్పుతో సహా ఇంటికి కావాలిసిన సరుకులన్నీ నెలకు సరిపడా వున్నాయి.

మరుసటి నెలకూడా భానుమూర్తి ఏభై రూపాయలు శారదకు మనియార్డరు చేశాడు. కుట్టు మిషన్‌మీద ఏదో నాలుగు రాళ్ళు వస్తున్నాయి. దానా దీనా వేన్నీళ్లకు చన్నీళ్లుగా ఏదో 'గుడ్డిలో మెల్ల'గా సంసారం ఏ ఒడిదుడుకులూ లేకుండా సాఫీగ సాగిపోతూంది.

* * *

ఉన్నట్టుండి మబ్బులేని పిడుగులా వూడిపడ్డ అక్కగార్ని చూచి ఆశ్చర్య పడింది శారద.

'ఇదేనా అక్కా రావటం?' చిరునవ్వుతో పలకరించింది.

'ఆ, ఇదే' అన్నది భాగ్యమ్మ దూకుడుగా.

'ముందు ఉత్తరం ముక్కయినా రాయకుండా ఇలా వూడిపడ్డావేం?' అంది నవ్వుతూ.

'ఏం ముందు తెలుసుంటే మాటలు ఏరుకుని సిద్ధంగా వుండేదానివా?' చెల్లెలి కళ్లలోకి చురుగ్గా చూస్తూ వ్యంగ్యంగా ఒక విసురు విసిరింది భాగ్యం.

'మాటలేమిటి? ఏరుకోవట మేమిటి?' తెల్లబోయింది శారద.

'సంగనాచి తుంగబుర్రవి నీకేం తెలుసు పాపం? కడుపులో ఎప్పటి కావేషమో పెట్టుకుని నన్నిలా సాధిద్దామనుకుంటున్నావా?' అంటూనే కోపంలోంచి ఏడుపులోకి జారిపోయి, 'ఏమో ఏ కాస్త వయసయిన వాడైనా ఆరోగ్యంగానే వున్నాడుగదా అనీ, ఆ జీతండబ్బులు తప్ప మరేమీ రాబడిలేని ఆ మొహాన్ని పెళ్ళాడేకంటే, వెనకాస్తి వున్నవాడు కనాతయినతో ఎక్కువ సుఖపడగలవనే వుద్దేశ్యంతోనూ నిన్ను బలవంతపెట్టానే కాని, నీ బతుకిలా అధ్వాన్నమవుతుందని నేను ముందుకు కలగన్నానా?' అంటూ కళ్ళు వత్తుకుంది భాగ్యమ్మ.

'జరిగిపోయినవన్నీ ఇప్పుడెందుకక్కా' వుదాసీనంగా అన్నది శారద వీట చూస్తూ.

మళ్లీ రెచ్చిపోయింది భాగ్యమ్మ.

'ఇప్పుడెందుకని అడుగుతున్నావా? మరి ఆ కుచ్చితంతో కదూ ఇప్పుడు నా సంసారంలో నిప్పులు చెరుగుతున్నావ్? నీ బతుకు బుగ్గి అయినందుకు నామీద కక్ష తీర్చుకుంటున్నావా?' కళ్లల్లో! కత్తులు దూసింది భాగ్యమ్మ.

'ఏమిటక్కా నువ్వనేది?'

'ఏమిటా? నీకందకుండా పోయిన రాజభోగాలు నా మొగుణ్ణి ముగ్గులోకి దింపి తీర్చుకుంటున్నావు. తోడబుట్టిన దానివి పెరిమిటనన్నా సిగ్గూ సెరమూ లేకుండా నా కాపురం కూలదోయ్యాలని ఎత్తులు వేస్తున్నావా?'


'అక్కా' అని నిర్ఘాంతపోయింది శారద. ఎంతటి అపనింద? కొంతసేపటిదాకా మాట రాక అట్లాగే అక్కవంక రెప్పవాల్చకుండా చూస్తూ వుండిపోయింది.

ఆడదానికి ఆడదే శత్రువా!

ఆ యాసంలో నీరసమొచ్చినట్లయి నేలమీదే కూలబడిపోయింది భాగ్యం.

నాలిక తడి చేసుకుంటూ, 'దేన్నిబట్టి నామీద ఇంత అపవాదం వేస్తున్నావక్కా' అన్నది రుద్ధకంఠంతో శారద.

'ఏం? నెలకు మూడుసార్లు నీచుట్టూ ప్రదక్షిణం చెయ్యటంలా ఆయన? నెలనెలా మనియార్డరుతో దక్షిణ ముట్టచెప్ప



'ప్రశ్నావళి' శీర్షికకి ప్రశ్నలను పంపేవారు కవరుమీద స్పష్టంగా 'ప్రశ్నావళి,' ఆంధ్ర సచిత్ర వార పత్రిక, మద్రాసు — 1.' అని వ్రాయకోరుతున్నాము.— సం॥

అబల

టంలో అంతమాత్రం గ్రహించుకోలేని వెర్రి బాగుల్దాన్ననుకుంటున్నావా?' మింగేసేలా చెల్లెలివంక చూసింది భాగ్యమ్మ.

'నువ్వు చాలా పొరబాటుపడుతున్నావక్కా! పెదపాడులో మీ పొలాలు చూడ్డానికి వెడుతూ బావ ఒకటిరెండుసార్లు ఇక్కడ దిగిన మాట వాస్తవమే. కాని నీవు వూహించే నీచమైన సంబంధం మా మధ్య లేదు. కూటికీ గుడ్డకీ కరువై కటకటలాడుతున్న మమ్మల్ని చూసి జాలిపడి, నేను వద్దంటున్నా వినక, ఆయనేదో పంపిస్తున్న మాటా నిజమే. ఇష్టం లేకపోయినా పిల్లల మొహాలు చూసి మీ సహాయం అందుకోక తప్పడం లేదు నాకు. కాని ఇదంతా నీ ఇష్టంమీదే జరుగుతూందనుకోవటమొకటే నే చేసిన పొరబాటు. ఐదువందలకోసం మొహం చూచుకుని నువ్వింతే నన్నీ గోతిలోకి దింపగలిగావుగాని, అది మనసులో పుంచుకుని, నిన్ను ఇంత నీచంగా వంచన చేసేటంత ద్రోహబుద్ధి నాలో లేదక్కా. ఇన్నాళ్ళు కాపురంచేసీ బావ ఔదార్యాన్ని ఇంత మకిలిగా ఊహిస్తున్నావంటే ఆడజన్మే ఇంత గావును అనిపిస్తోంది' అని విదిల్చి కొట్టింది శారద. ఎంత సంబాళించుకున్నా ఆవేశం పట్టలేకపోయింది.

తగలాలిసిన చోటనే తగిలాయా మాటలు భాగ్యమ్మకు. మొహం మాడిపోయింది. దెబ్బతిన్నట్టు గిలగిల్లాడిపోయింది.

'ఐదువందలకోసం మొహం చూసుకుని నిన్నీ గోతిలోకి దింపానా?' ఉక్రోషంతో అలానే గోడకి జార్లబడిపోయింది భాగ్యమ్మ.

ఆ సందర్భమిదీ—

మోహన్ శారద మేనత్తకొడుకు... వీరికంటే పేదరికంలో ఓ మెట్టు దిగువనే వున్నవాడను. ఎలాగయితేనేం వారాలు చేసుకుని బి. ఎ. ప్యాసయ్యాడు.

అప్పటిదాకా అతని బాగోగుల్లో ఏమాత్రమూ జోక్యం కలిగించుకోలేకపోయినా, అతను బి. యే. ప్యాసయ్యాడనగానే, మేనరికపు సాకు చూసుకుని, శారదను చేసుకొమ్మని అడగబోయాడు శారద తండ్రి రంగయ్యగారు. అప్పటో శారద పెద్దదై ఐదారేళ్ళయి; ఆయనకో తీరని సమస్య అయి కూచుంది.

కాని అప్పుడు మోహన్ ఓ విషమ సమస్యలో ఇరుక్కుని వున్నాడు. తాను వారాలు చేసుకుంటున్న ఆఫీసరుగారి రికమండేషన్‌తో చేసిన ప్రయత్నంలో వుద్యోగం దొరికే సూచన కనబడింది తనకి. కాని ఒక బహాదురుడికి తప్పనిసరిగా వో వెయ్యిరూపాయలు ముడుపు చెల్లిస్తేనేగాని అది సాధ్యం కాదని తేలిపోయింది.

వారాలబ్బాయి దగ్గర వెయ్యిరూపాయలెక్కడివి?

సరిగ్గా అదే సమయంలో దిగబడ్డారు రంగయ్యగారు. మేనమామ స్థితిగతులు తెలిసినవాడే అయినా, ఆయన్ని నిరాశపరచక తప్పలేదు మోహన్‌కి.

'మామయ్యా శారదను చేసుకోవానికి నాకేం అభ్యంతరం లేదుగాని, 'తా దూర సందులేదు — మెడకోడోలని' నాకే తిండి లేనిది దానికేమి పెట్టను. ఆ వెయ్యి రూపాయలతో నాకో వుద్యోగం కొని పెట్టినవాడు, శారదనే కాదు ఎవర్ని చేసుకోమన్నా నేను సిద్ధమే' అని ఖరాఖండిగా చెప్పాడు.

అవును మరి. మేనరికంకంటే ముందు కడుపు తిప్పలే ముఖ్యం కదా!

ఉసూరుమంటూ ఇంటికి తిరిగి వచ్చినా ఆశ చావలేదు రంగయ్యగారికి.

పెద్దకూతురు భాగ్యానిది కలిగిన సంసారం. రంగయ్య ఏ కాస్త బాగా వున్న పరిస్థితులో ఆయన చేసిన మంచి నిర్వాకమదే.

బంగారబ్బొమ్మలాంటి భాగ్యాన్ని చూచి మనసు పడ్డాడు భానుమూర్తి. తను అంతస్తుకి తగని సంబంధమని తలిదండ్రులు గోలపెడుతున్నా వినక పట్టుబట్టాడు.

చేసేదిలేక, తమ తాహతుకు తగ్గట్టు హుందాగా శుభకార్యం నెరవేర్చాలన్న షరతుమీద ఒప్పుకున్నారు చివరికి.

అంత గొప్పవారితో వియ్యమందటమే ఒక అదృష్టమని మురిసిపోయారు రంగయ్యగారు. కాని కట్నకానుకల భారం లేకపోయినా వారితో సరికి సరిగా తూగే సరికి అప్పులపాలయ్యాడు కూడా.

—అత్తమామలు బ్రతికున్నంతకాలం

వాళ్ళ ఈసడింపులతో కొన్నాళ్ళు తిప్పలు పడ్డా వారి అనంతరం పెత్తనం చేజిక్కించుకుని మహారాణిలా అధారిటీ చెలాయిస్తోందీనాడు భాగ్యం.

అప్పటిదాకా, తానింత సంపదలో వుండీ, తలితండ్రులికి సాయం చెయ్యలేక పోతున్నానే అని చింతిస్తూండేదల్లా, తన చేతికి అడ్డం లేక పోయేసరికి, వాళ్ళది నిష్టదరిద్రమంటూనూ, ఎంత పెట్టినా తరిగేది కాదనీ, నిరసనగా చూడ్డం మొదలుపెట్టింది. కాని భానుమూర్తి అలా కాదు. ఈనాడు వున్నా లేకపోయినా పస్తులుండకుండా రంగయ్యవాళ్ళా కలో గంజో తాగుతున్నారంటే అతని సానుభూతీ, దయారసమే కారణం.

మోహన్ దగ్గర్నించీ తల ఒంచుకుని రంగయ్యగారు సరాసరి పెద్ద కూతురు దగ్గరకు వెళ్ళారు.

అల్లుడి చేతులు పట్టుకున్నారు.

'బాబూ ఈ వెయ్యి రూపాయలతో నాకు సగభాగం తగ్గించిన వాడవుతావు. నా బిడ్డ దీపం పెట్టి నీ పేరు తలుచుకుంటుంది.' అంటూ కళ్ళనీళ్ళ పర్యంతమై ప్రతిమలాడుకున్నాడు.

మామగారి దీనస్థితికి సహజంగానే దయాళువైన భానుమూర్తి వెన్నలా కరిగిపోయాడు.

ఆ సమయంలో కాదనటానికి భాగ్యానికీ మనస్కరించలేదు.

నాలుగు రోజుల్లో డబ్బు తీసుకుని పుట్టింటికి వచ్చింది భాగ్యమ్మ.

అదే సమయంలో శారదని చూడ్డానికి వచ్చి, మేనరికముందని తెలిసి వెనక్కి తగ్గిన పరంధామయ్యగారు ఆమెకి తటస్థపడ్డారు. చటుక్కున భాగ్యం మెదట్లో ఒక పాపిష్టి ఆలోచన మెదిలింది.

శారదకన్న రెండేళ్ళు చిన్నది కమల. దాన్ని ఇస్తేనో పరంధామయ్యగారికి? నయాపైస కట్నమక్కరలేదు తన ఉపాయం తల్లి చెవిలో వూదింది.

'అబ్బే అది అసలే నాదారిది. అతని పక్కన మరీ మనవరాల్లా వుంటుందే' అంటూ వప్పరించేసింది తల్లి ఇష్టంలేక.

'పోని శారదనే చేసుకొమ్మంటే సరి! చెట్టల్లే ఎదిగింది, — ఈడూ జోడూ మరీ ఎబ్బెట్టుగా ఏం వుండదు. రాయల్లే వున్నాడు మనిషి. కాళ్ళ దగ్గరకొచ్చిన సంబంధం కాదనటమెందుకు? శారదకు ఈ సంబంధం ఖాయం చేసుకుంటే ఇక మోహన్‌కి మన కమలను ఇచ్చెయ్యవచ్చు. అదిమాత్రం పెద్దమనిషై మూడేళ్ళు కాలా? ఒకేసారి రెండు పెళ్ళిళ్ళూ కలిపి చేస్తేసరా ఖర్చులుకూడా కలిసొస్తాయి. చూడు మరి!' అని నచ్చచెప్పింది తల్లికి. బరువు భారాలు తీరే ఆలోచన ఏదయితే నేంగాక. సరేనన్నదామె.

అప్పటిదాకా కూతురు వెయ్యి రూపాయలు ఇవ్వాలిసొస్తూందని ఇలా పక్కదార్లు వెతుకుతూందని అనుమానించిన తల్లి, ఇప్పుడు ఇద్దరి కూతుళ్ళ పెళ్ళి భారమూ తొలుగుతుందనే సరికి కొంత మెత్తబడింది. తమ మేలుకోసమే భాగ్యం అంత తాపత్రయ పడుతున్నదని నమ్మిందామె.

'నివన్నదీ నిజమే! నిపుణ్యమూ అని ఆ ఇద్దరి మెడల్లోనూ, పసుపుతాళ్ళు పడ్డాయంటే అంటే మేము గట్టున పడ్డట్టే. ఇహ సీత కిప్పుడప్పుడే తొందర లేదు. గదా! మీ నాన్న నిలా పిలువు చెబుదాము' అని తన అంగీకారం తెలియజేసింది.

ఒక్కకూతురు పెళ్ళితోనే అణగారిపాయిన ఆ మానవుడు, మరో ఇద్దరి భారం అలాగ్గా ఒక్క బిగిని ఒదిలి పోతున్నాదంటే ఒప్పుకోడ? ఏం చేస్తాడు?


తన ప్రమేయమేమీ లేకుండానే జరిగి పోతున్న ఈ కర్మకాండ యావత్తూ చూస్తూ తను అల్లుకున్న తియ్యని స్వప్నాలను తనలోనే అణచేసుకున్నది శారద.

అలా శారద, కమలల పెళ్ళిళ్ళు రెండూ భాగ్యం అజమాయిషీలో జరిగి పోయాయి. చూచిన వాళ్ళంతా భాగ్యం చూపిన ఆత్మీయతనీ, ఆప్యాయతనీ అగ్గించి చెప్పుకున్నారు.

కాని భాగ్యం చాకచక్యంగా పరంధామయ్యగారితో ముందే కమల పెళ్ళికి మాతో పాటు మీరూ సాయం చెయ్యాలంటూ ఐదువందల రూపాయలూ పుచ్చుకోవటమూ పెళ్ళిఖర్చులు కూడా మూడువంతులు ఆయనచేతనే పెట్టించడమూ రంగయ్యగారికి దరిమిలా తెలిసినా, కన్యాశుల్కం వసూలు చేసినట్టు అనిపించి మనసు చివుక్కుమన్నా, 'డబ్బు పాపిష్టిది' అని సరిపెట్టుకున్నారు.

*　　*　　*

నాటి సంఘటనే నేడు తిరగతోడింది శారద. ఆ సంగతి తననేగాక శారదని తొలుస్తూనే వున్నదన్నమాట ఇన్నాళ్ళూ. గతం తవ్వగానే బాకుతో పొడిచినట్టు ప్రమాన్పడి పోయింది భాగ్యం. అందులో తన అయిదువందల కక్కుర్తి వున్నదాయెను.



అబల

అక్కడ మోహాన్ని చేసుకున్న కమల శవని తలుచుకుని దీపం పెట్టుకుంటూంటే ఇక్కడ శారద తనని శపిస్తోంది. ఎంత తేడా!

* * *

భాగ్యం వచ్చి వెళ్లాక మనస్సు వ్యాకుల పడిపోయి చానాళ్లకిగాని తేరుకోలేక పోయింది శారద. దానికితోడు సంసార పరిస్థితులామెను మరి కాస్త క్రుంగ దీస్తున్నాయి.

భానుమూర్తి నెల నెలా కొంత పంపుతున్నందువల్ల, ఈ మధ్యలో తిండి కాస్త పసిగా తింటానికి అలవాటు పడ్డారేమో మళ్లీ అది అది వెనకబట్టేసరికి, యధాస్థితికి సర్దుకుని సరిపెట్టుకోవడంలో అందరూ విలవిల్లాడి పోతారు.

ఈ సారి భాగ్యమే చెల్లెలికి డబ్బు పంపిందికాని అంతరాద్ధాతం జరిగిన తరవాత ఆ డబ్బు తీసుకుందుకు ప్రాణం చచ్చిపోయింది శారదకి. వచ్చిన మనియార్డరు వచ్చినట్టే వెనక్కి వెళ్లింది.

అన్నం కలిపిన కంచాన్ని అవతలికి తోసేస్తూ, 'వుప్మా నాకు వద్దు—దోసే కావాలి' పేచీ పెడుతూ కాళ్లు రెండూ తపతపా నేలకేసి కొట్టుకుంటూ రాగం తీస్తోంది రెండోపిల్ల జానకి.

అరగంటనించీ ఆ పిల్లకి సర్ది చెప్పలేక నానా హైరానా పడుతున్నది శారద.

అమ్మ ఇదివరకటిలాగే ఇంచక్కా వుప్మావో, దోశో ఏదో ఒకటి చేసిపెడితే తినొచ్చనే జిహ్వ చాపల్యం తప్ప ఆ బుల్లి బుర్రలో ఆర్థిక సమస్యలేమి దూరతాయి?

ఎంతసేపు బుజ్జగించినా లొంగక మంకుపట్టు పట్టిన కూతురు మొండితనానికి విసిగిపోయింది శారద. జానకి తోసిన తోపుకి అన్నపు పళ్లెం ఆమడ దూరాన పడి కలిపిన అన్నమంతా నేల పాలయ్యేసరికి ఆమె సహనం అడుగంటింది.

'అమ్మా బాబూ అన్నంతసేపూ నువ్వు వింటావా?' అంటూ జానకి చెంపలు రెండూ వాయించింది.

దానితో ఇంటికప్పు ఎగర గొట్టేసింది జానకి.

వెదజల్లిన మెతుకులన్నీ ఎత్తి, శుభ్రం చేసుకుని ఇవతలికొచ్చే వేళకు జానకి ఇంకా వెక్కుతూనే వున్నది.

మరి ఇక ఆ పూటకు దానికి కూడు లేదు. శారదలో తల్లిప్రాణం తల్లడిల్లిపోయింది. పైగా ఆ కందిపోయిన బుగ్గలు చూస్తుంటే పశ్చాత్తాపం దహించివేసింది శారదని. తన సాధక బాధకాలు పసిపిల్ల దానికేమి తెలుస్తాయి?

రెండోపూట బియ్యానికని పదిలంగా దాచిపెట్టిన డబ్బులోంచి పావలా తీసి జానకి చేతిలో పెట్టి కామేశ్వరిని తోడిచ్చి హోటల్‌కి పంపించింది.

కొట్టిన దెబ్బలన్నీ ఎక్కడకు పోయాయో, చిలకలా అక్కవెంట నడిచి వెళ్లింది జానకి.

పావుగంటలో ఒడినిండా పాకెట్లతో తిరిగివచ్చారు పిల్లలిద్దరూ.

'ఇన్నెక్కడివి?' అనుమానంగా నుదురు చిట్లించింది శారద.

'బాబయ్యగారు ఇప్పించారు. రోజూ గూడా ఇప్పిస్తానన్నారు.' సంబరంగా గంతులేస్తూ చేతులు తిప్పింది జానకి.

'ఏ బాబాయ్?' తెల్లబోతూ గదిమింది శారద.

తల్లి కేకకి అదురుకుని గంతులు ఆపింది జానకి. కొద్దిగా వూహ తెలిసిన పిల్ల కామేశ్వరి. తల్లి కళ్లు పెద్దవి చేసి గదమాయిస్తుంటే చూస్తూ తామేదో పెద్ద తప్పే చేసి వుంటామనుకున్నది. జడుస్తూ జడుస్తూ ఏదో చెప్ప బోయింది.


'నేనే లెండి. పిల్లలనేమి అనబోకండి' పక్కింటాయన గడపలో నించొని వంకర నవ్వులు ఒలకపోస్తున్నాడు.

ఒక్కసారి ఆయనవంక చిరాగ్గా చూచి తల తిప్పేసుకుని పిల్లల నిద్దరినీ బరబరా పెరట్లోకి లాక్కుపోయింది.

అక్కడ వాళ్లకి వేస్తున్న శిక్ష ఏమిటో వాళ్ల ఏడుపులూ పెడబొబ్బల్ని బట్టి ఇట్టే తెలిసిపోయిందాయనకి. చేసేది లేక చల్లగా జారుకున్నాడు అక్కణ్ణించి.

రాత్రికి పొయ్యిలో పిల్లి లేవలేదు. ప్రొద్దున్న పిల్లలు తెచ్చిన పొట్లాలు వాకిట్లో తచ్చాడుతున్న కుక్క కాస్త కైంకర్యం చేసింది. వంటినిండా కమిలిపోయిన కర్రదెబ్బలతో సొమ్మసిల్లి కలత నిద్ర పోతున్నారు పిల్లలు. మూడు పూటల నించీ సరిగ్గా తినీ తినకా నీరసంతో ఒళ్లు తూలుతూంది శారదకి.

కడుపునిండా పట్టినన్ని నీళ్లు తాగి వాకిలి తలుపు వెయ్యబోయింది. ఎదరింటి మేడ గదిలోని కాలేజీ విద్యార్థి కిటికీ లోంచి వెకిలిగా నవ్వుతూ చేతులూపుతున్నాడు. అసహ్యం వేసి భడాలున తలుపు వేసి తల బద్దలయిపోతుంటే చాపమీద వాలిపోయింది. అప్పుడు



మీరు త్రాగే కాఫీ చిక్కగా, కమ్మగా, స్ట్రాంగ్‌గా మరియు క్షణంలో కావాలంటే...



బ్రూ

మీకు కావల్సింది అదే

చిక్కని, స్ట్రాంగ్
కాఫీ చికరీ బ్లెండ్
క్షణంలో తయారౌతుంది!
సేద దీర్చి, ఉల్లాసాన్నిచ్చుటలో
దాన్ని మించినది లేదు.

బ్రూక్ బాండ్

బ్రూ ఇన్‌స్టెంట్

కాఫీ చికరీ బ్లెండ్

మెదిలింది నోసం—తన ఒంటిని యవ్వనమింకా దిగజారలేదన్నమాట!

ఈ ఆకలి మంటకు తోడు, ఆ అలుసు తీసుకుని తనని ఏ పాపకూపంలోకో లాగడానికని చుట్టూ పొంచున్నాయి గడుసు దెయ్యాలు. వీటిని ప్రతిఘటించడ మొక సమస్య తనకి?

నిద్దరలో, 'కొట్టొద్దమ్మా' అని కలవరిస్తోంది కామేశ్వరి. జాలిగా అటుకేసి చూసింది. లేతబుగ్గలమీద కన్నీటి చారికలు చెరిగిపోలేదు. నిద్రలో కూడా ఆ అమాయకమైన ముఖబింబాలమీద, భయాందోళనలు తారాడుతున్నాయి. కడుపు తరుక్కుపోయింది శారదకి. ఉసువ్యర్థంగా పెంచుకుంటున్న కసినీ, చాతగాని తనాన్నీ, ఎదురు తిరగలేని పసిపిల్లల వంటిమీద తీర్చుకుంటోంది. కోపం దౌర్బల్యానికీ, అసమర్థతకీ చిహ్నం.

శారదలో ఆలోచనలు పరుగులు తీస్తున్నాయి. ఆకలి కడుపులో అరవై నాలుగు విప్లవాలున్నాయిట! ఎప్పుడో వింది తను.

భార్య పుట్టింటికి వెళ్ళిన దగ్గర్నించీ పక్కింటాయన చూపులు తనను వెన్నాడుతూనే వున్నాయి. ఈ మధ్య మరీ బరితెగించి, పిల్లలకంటూ పళ్ళూ, మిఠాయి పొట్లాలూ తెచ్చియిస్తూ, వాళ్ళని కాకమ్మ కబుర్లతో బెల్లిస్తూ, తనతో మాట కలపాలని ఉవ్విళ్ళూరి

అబల

పోతున్నాడు భ్రష్టుడు.

ఇక ఆ కాలేజీ అబ్బాయి సరే సరి... తనకంటే చిన్నవాడేమో కూడా... అదేం బుద్ధోమరి! ఏకంగా ఉత్తరాలే పంపిస్తున్నాడు. తన నెత్తిమీద గొడుగులేదని తెలిసి ఇందరిలో ఇన్ని చెడు ఆలోచనలు చెలరేగుతున్నాయి.

తనకళ్ళలో లాలసగాని, తన రక్తంలో రసికత్వంగాని సంసార లంపటంలో ఏనాడో కాలి మసిగారిపోయినై. కాని తను శీలవతే నంటే నమ్మగలిగే వారెంతమంది?

తన ఇంటికే మగవాడొచ్చినా, ఎందుకొచ్చినా చుట్టుపక్కల వాళ్ళందరికళ్ళూ తన ఇంటిమీదే వుంటున్నాయి. గమనిస్తోనే వుంది తను.

వేరే ఎవరి సంగతో ఎందుకూ? సొంత అక్కయ్యే తనని అనుమానించి అవమానించిందే!

పొరుగింటి మాణిక్యమ్మగారంటుంది; ఎవరిమీదనో పెట్టి, 'ఏమోనమ్మా వయసులో వున్నవాళ్ళని ఏం నమ్మగలం? ఏ క్షణానికి బుద్ధి ఎలా మారుతుందో ఎవరు చెప్పగలరు?'

అవతలింటి సీతారత్నమ్మ సరే సరి. పెళ్ళికాని పెద్దమ్మాయిని తన ఇంటికి పంపేందుకే జంకుతోంది ఎక్కడ మైల పడుతుందోనని.

మొన్న మొన్న కుట్టుకూలి కొన్ని కుదరదలా వుండిపోయి ఇస్తుందేమోనని సుభద్రమ్మ ఇంటికి వెళ్ళింది తను. డబ్బులు చేతిలో పెట్టి తను వెళ్ళిపోయే దాకా తరిమి తరిమి వదిలిపెట్టింది తనని. ఆవిడ పెనిమిటికి కాస్త చపల చిత్తం. ఆయన కన్ను తనమీద ఎక్కడ పడుతుందోనని ఏక గంగవెర్రులామెకి.

నిజానికి తననింత వరకూ వేలెత్తి చూపలేదెవరూ. కాని తన్ని చూసి కిసుక్కున నవ్వడమూ, పిచికమీద బెట్టీ, పిల్లిమీద బెట్టీ సూటీ పోటీగా మాటలు విసరడమూ సాగిస్తున్నారు కొందరు. తప్పించుకు తిరుగుతోంది. నిలబడి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుని ఎంతమంది అనుమానాలని నివృత్తి చెయ్యగలదు తను.

ఈ దారిద్ర్యం, ఈ మనస్తాపం ఎవరి కొరకని తను కిమ్మనకుండా భరించాలి. తానింత పవిత్రంగా వుండి సాధించిన దేమిటి? అనుమానాలూ — అపవాదులూ తప్ప! తన కళ్ళముందే తన పిల్లల్నెందుకు చేతులారా మాడ్చివెయ్యాలి?

నిజమే — వారి వూహాలే నిజం కానీ!

తన బిడ్డలింక ఎవరినీ దేబిరించనక్కరలేదు. తానింక ఎవరినీ లక్ష్య పెట్టదు.

ఆవేశంలో ఆలోచనలు పెడత్రోవ తొక్కాయి.


పిల్లలవంక ఒక్కసారి గాఢంగా చూసి మెల్లిగా దుప్పటికప్పి లేచి బయటకు వచ్చి గొళ్ళెం పెట్టింది శారద.

* * *

నారాయణమూర్తి సరంధామయ్యగారి పెద్దకొడుకు. అంటే శారదకు సవతి కొడుకు. ఇన్నాళ్ళూ వుద్యోగరీత్యా వూళ్ళుపట్టుకు తిరుగుతున్నాడు.

ఎదిగొచ్చిన కూతురుకు పెళ్ళి సంబంధాలు చూసుకుందుకు వుద్యోగంలో తీరక సావకాశంగా నాకబుచేసి, మంచి సంబంధం చూసుకోవచ్చునే వుద్దేశ్యంతో నాలుగైదు నెలలు సెలవుపెట్టి తండ్రి ఇంటో తన వంతు కొచ్చిన వాటా ఖాళీ చేయించి వచ్చి చేరాడు.

వచ్చిన కొత్తలోనే నలుగురి దగ్గరా సవతితల్లి ప్రవర్తనమీద చూచాయగా



పుకార్లు కూడా విన్నాడు. అయినా, 'నాకెందుకు కొన్నాళ్ళుండి పోయేవాడిని' అనుకుని విని విననట్లూరుకుండి పోయాడు.

కాని పక్కింటావిడ పుట్టింటి దగ్గర్నుంచీ శారదను దుమ్మెత్తిపోస్తూ గుట్టుగావున్న వ్యవహారాన్ని వల్లగా వీధికెక్కించింది.

పక్కనేవుంటూ కలగజేసుకోవాలో, కూడదో ఇదమిద్ధంగా తేల్చుకోలేక సతమతమవుతుండగా, ముప్పు తన మీదకే ముంచుకొచ్చింది.

* * *

నారాయణమూర్తి తన ఇంటికి వచ్చిన కారణాన్ని ఏమాత్రమో వూహించగలిగింది శారద.

ముక్తసరిగా పలకరించి 'కూర్చో' అన్నది.

తనకంటే చిన్నదయినా, మాతృస్థానంలో వున్న వ్యక్తితో సూటిగా అలాంటి విషయాన్ని ఎలా ప్రస్తావించాలో తెలియలేదు నారాయణమూర్తికి.

కొద్దిసేపు తటపటాయించి, 'మీరిలా నలుగురు నోళ్ళలోనూ పడ్డం బాగులేదు. కొన్నాళ్ళు మీరు మరెక్కడైనా వుంటే మంచిదేమో' అన్నాడు డొంక తిరుగుడుగా.

'ఎందుకని?' ఆశ్చర్యంగా అన్నది శారద.

'ఇక్కడ గొడవలు కొంత సద్దుమణుగుతాయి' అన్నాడు సౌమనస్యంగా. శారద వదనంలో వెలిసిపోయిన హాసరేఖ ఒకటి మెరిసింది.

'నేను ఎక్కడవుంటే అక్కడ గొడవలు తల ఎత్తుతూనే వుంటాయి. వాటికి భయపడి పారిపోదలుచుకోలేదు నేను' అన్నది దృఢంగా, ఆయనవంక చూడకుండానే.

ఆమె ధోరణి తెంపరితనంగా అనిపించింది నారాయణమూర్తికి. కొద్దిగా కోపం వచ్చిందతనికి.

'ఎక్కడవున్నాతే మాత్రం మీ ప్రవర్తన తిన్నగావుంటే ఇలాంటి గొడవలు తల యెత్తే ఆస్కారం ఎందుకుంటుంది?' అనేశాడు దురుసుగా.

ఆ విసుర్లు ఆమె అహాన్ని దెబ్బగొట్టి ద్వేషాన్ని రేకెత్తించింది. శారదకి తెగువ వచ్చేసింది.

'నిజమే. నా నడత మంచిదికాదు, కాని దానికి బాధ్యులు మీరే.'

'మేమా?' విస్తుపోయాడు నారాయణమూర్తి. మరుక్షణంలో అతని మొహం ఆగ్రహంతో కందగడ్డలా తయారయింది.

'ఇంటి మర్యాద మంటగలిపి బరి తెగించి వాళ్ళమ్ముక్కోమన్నామా మేము?' తీవ్రంగా అడిగాడు. చేయి విరిగిన కుర్చీలో నించి చివాలున లేచాడు.

జంకలేదు శారద. 'ఔను. మీరు నాకంటూ మిగిల్చింది అది ఒక్కటే. నా బ్రతుకు జూదంలో నాక్కెందుకు అది మినహా నాకేముందని?' కొరకొరా చూస్తూ అన్నది శారద.

అంత కట్టె విరిచినట్లు బయటపడుతుందనుకోలేదు నారాయణమూర్తి. నీళ్ళు చిలకరించినట్లు చల్లబడిపోయాడు.

'అంత లేని పరిస్థితులు వచ్చినప్పుడు మాకెందుకు తెలియజేయలేదు?' అన్నాడు ఇబ్బందిగా మొహం పెట్టి.

'తగుదునంటూ చెప్పవచ్చావుగానీ, నాకూ నా పిల్లలకీ, నువ్వూ నీ తమ్ముడూ వొదిలి వెళ్ళిన ఆధారమేటి? నీ తండ్రిని కట్టుకున్న ఆడదాని బ్రతుకు విలువ ఏమయితేనేమని, సర్వమూ పెట్టుకుని, నా మానాన నన్ను వొదిలి మీదారి మీరు చూచుకున్నారే ఆనాడు. అలాంటి నన్ను దేహీ అని చెయిజాపితే ముష్టి వేశేవాడినా పాపం?'

వెంటనే సమాధానమేమివ్వాలో తెలియక తికమక పడ్డాడు నారాయణమూర్తి. కొద్దిసేపు వారి మధ్య నిశ్శబ్దంగా కొన్ని క్షణాలు గడిచాయి. చివరకు నారాయణమూర్తే పెదాలు తడుపుకుంటూ అన్నాడు.

'సరే. అయినదేదో అయిందనుకోండి ఇకముందు మీకు మనోవృత్తి ఏర్పాటు చేస్తాము. మీరు ఈ వాటా అద్దెకిచ్చేసి మీ పుట్టింటికి వెళ్ళివుండటం మీకూ మాకూ గూడా మంచిది!' అంతటితో ఆ సంభాషణ తుంచెయ్యటం మంచిదనిపించిందతనికి.

కాని శారదకు అతని ఎత్తుగడ అర్థం కాలేదు. 'ప్రస్తుతం తనసిక్కణ్ణుంచి తొలిగించి ఏ పబ్బమో గడుపుకుందామని

రచయితలకు మనవి

కథలు, వ్యాసాలు

ప్రచురణకి స్వీకరించబడని తమ వ్రాత ప్రతులని తిప్పిపంపగోరే రచయితలు వ్రాత ప్రతులతోబాటే తగుమాత్రం తపాలాబిళ్ళలు అతికించిన స్వంత చిరునామాగల కవరు కూడా పంపాలి. స్టాంపులు మాత్రమే పంపరాదు. స్టాంపులు మాత్రమే పంపించినట్లయితే వ్రాతప్రతులు తిప్పిపంపబడవు. వ్రాతప్రతులతో గాక విడిగా స్వంత చిరునామా, తగుమాత్రం పోస్టేజికల కవర్లు పంపినా వ్రాతప్రతులు తిప్పిపంపబడవు.

ప్రచురణకి స్వీకరించబడని వ్రాతప్రతుల విషయంలో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు.

నవలలు

ప్రచురణకి స్వీకరించబడని నవలల వ్రాత ప్రతులు మేమే తిప్పి పంపిస్తాము. వ్రాత ప్రతులతో స్వంత చిరునామాకల, తగిన మాత్రం పోస్టేజి అతికించిన కవర్లు పంప నవసరం లేదు. 100 అరఠావు పేజీలు పయిని ఉన్న వ్రాతప్రతులే నవలలకింద పరిగణింపబడుతాయి.

కార్టూన్లు

ప్రచురణకి స్వీకరించబడని కార్టూన్లు తిప్పి పంపగోరేవారు కార్టూన్లతో స్వంత చిరునామాకల, తగుమాత్రం పోస్టేజి అతికించిన కవర్లు జతపరచి పంపాలి. స్టాంపులు మాత్రం పంపరాదు.

షరా: వ్రాతప్రతులని, కార్టూన్లని వీలయినంత భద్రంగా తిప్పిపంపే ప్రయత్నాలు చేస్తాము. కాని, వాటి విషయంలో ఎటువంటి బాధ్యతలనీ స్వీకరించలేము. ఈ షరతుని గమనించి రచయితలు తమ రచనలు, కార్టూన్లు పంపగలరు.

సంపాదకుడు

ఆంధ్రసచిత్రవారపత్రిక

చూస్తున్నాడీ మేధావి! మనోవృత్తి ఇస్తాట్ట—మనోవృత్తి! ఎంతిస్తాడో బారుగా! ఎన్నాళ్లిస్తాడో పాపం! వాగ్దానం చాలా జాగ్రత్తగానే ఇస్తున్నాడు పుత్రరత్నం. తన యింటికి వచ్చెయ్యమనటం లేదు. ఈ ఆడపిల్లల పెళ్ళిళ్లు నెత్తిన పడవూ? ఒకటా రెండా మూడు కుంపట్లు గుండెలమీదకి! మనోవృత్తి ఇస్తానేదాకా ఇతని దాతృత్వం పెరిగిందేమిటబ్బా అని ఆలోచించింది శారద.

'కృతజ్ఞురాలిని. కాని నాకిక యెవరి దయాధర్మ భిక్ష అవసరం లేదు' అన్నది పేళసుగా.

'మరి ఇక మీ మనసు మార్చుకోరన్న మాట!' తీవ్రంగా మారిందతని కంఠస్వరం.

'నాకా అవసరం కనిపించడం లేదు' ప్రశాంతంగా సమాధానమిచ్చింది శారద.

'అన్నిటికీ తెగించిన మీకు కనిపించక పోవచ్చు. కాని పరువూ— మర్యాదా కోసం ప్రాకులాడే వాళ్లం. మీ వల్ల మేమెంత అవస్థల పాలవుతున్నామో తెలుసునా మీకు? ఈ కారణంగా మా అమ్మాయి కొచ్చిన సంబంధాలన్నీ తిరిగి పోతున్నాయి ఖర్మ' నెత్తి బాదుకొన్నాడు నారాయణమూర్తి.

అదీ ఈయన కొచ్చిన విపత్తు! శారదకి చటుక్కున స్ఫురించింది.

అబల

'అదా తమరి అకాల వాత్సల్యానికి కారణం!' వ్యంగ్యంగా అన్నది శారద—

'నన్ను దిక్కుమాలినదాన్నిచేసి గాలికి వదిలేసిననాడు లవలేశమైనా పుట్టుకురాని దయారసం, ఈనాడు కూతురి భవిష్యత్తుకి నా అప్రతిష్ఠ అడ్డుగోడగా నిలబడేసరికి పొంగులు వారుతున్న దన్నమాట! కానీ నాదీ ఒక విధంగా మీలాటి పరిస్థితే నాయనా. మీ పిల్లలకోసం మీరెలా తాపత్రయపడుతున్నారో అలాగే నా బిడ్డలు ఆకలిదప్పులతో అల్లాడిపోకుండా వుండాలని నేనూ ఒక దారి తొక్కాను. అది మంచో చెడ్డో నాకు నిమిత్తం లేదు. తెగించినదని అనుకుంటే అనుకోండి— పరువూ—ప్రతిష్ఠ అనేవి మీకు కావాల్సొచ్చిన ఘట్టమిది. నా కవి విడిచిపెడితేనే తప్ప గత్యంతరం లేని పరిస్థితి. అంతే కాదు. నేనూ నా సంతానమూ రోజుల తరబడి పస్తులున్నప్పుడు మీరెక్కడున్నారే పరువూ—ప్రతిష్ఠ, మానం మర్యాదా అని? అవేవీ అక్కరకి రాలేదు నాకు. జారవిడుచుకున్న మాన మర్యాదలు నాకెలాగూ ఇస్తే తిరిగి రావు. మళ్లీ నన్ను ఆ ఊబిలోకి లాగి వంచన చెయ్యాలని ప్రయత్నించకండి. నన్నిలా బ్రతకనియ్యండి.' మరిక చెప్పాలిసింది లేనట్టు గిరుక్కున తిరిగి లోనికి వెళ్ళి పోయింది శారద—గొంతులోని దుఃఖాన్ని పంటితో నొక్కిపట్టి.

ఇక లాభం లేదనుకొని వచ్చిన దారి పట్టాడు నారాయణమూర్తి.

నాలుగు రోజులు గడిచాయి. ఒకనాటి సుప్రభాతాన తల్లిని వెంట బెట్టుకొని భాగ్యమ్మ దిగబడింది.

ఇదంతా నారాయణమూర్తి ప్రభావమే నని శారద గ్రహించుకున్నది.

వచ్చినప్పటినించీ భాగ్యమ్మ అంతటా కలియతిరుగుతూ ఇంటినీ, ఇల్లాలినీ పట్టి పట్టి పరిశీలిస్తూనే వున్నది. ఆమెకు నారాయణమూర్తి ఉత్తరంలోని సారాంశమేమీ అసత్యంగా కనిపించలేదు.


ఇంట్లో అదివరలో లేని సొగసేంతో చోటు చేసుకొన్నది. శారద మెడలో సన్నటి గొలుసొకటి తళుక్కుమంటున్నది. ఆ మెడ బోసిగా వున్నప్పుడూ, అందంగా వొంపులు తిరిగిందేను.

తన రాకకి అదరక, బెదరక, చెదరక పూర్వంలానే ఏమీ ఎరగనట్లు ప్రవర్తించే చెల్లెలిపట్ల అసహ్యమూ, తిరస్కారమూ పెచ్చురేగాయి భాగ్యమ్మలో.

కానీ తొందరపడి ఘర్షణకు దిగవద్దని తల్లి ముందే హెచ్చరించడంవల్ల తమాయించుకున్నది.

రాత్రి భోజనాల అనంతరం పిల్లలు నిద్రకు పడ్డారు. తల్లీ కూతుళ్ళిద్దరూ పక్కలమీద ఒరిగి ఇష్టగోష్ఠికి దిగారు. భాగ్యం వాళ్ల సంభాషణలో పాలు పంచుకోలేక చెల్లెలిమీద దెబ్బ తీసే తరుణం కోసం ఎదురుచూస్తూ పక్కమీద ఇబ్బందిగా మెసులుతోంది. తల్లి చేస్తున్న జాప్యానికి చిరాకు పడుతోంది.

ఉన్నట్టుండి తల్లి 'అయితే మీ నారాయణమూర్తికి నీమీద ఇంత అక్కసు ఎందుకు రేగింది శారదా? నీవు పూర్తిగా పతనమైనావనీ, వూరూ నాడూ నీవైపు వేలెత్తి చూపిస్తూందనీ, మరి ఏవేవో అవాకులూ—చవాకులూ ప్రేలుతూ పుత్తరం రాశాడు సుమా!' అన్నది రంగులు మారే కూతురు మొహంలోకి పరీక్షగా చూస్తూ. అవన్నీ నిజం కాకూడదనే కొండంత ఆశ మనసు నిండా నింపుకునే వచ్చిందిక్కడ కావిడ. కాని క్షణక్షణమూ



ఆ ఆశ నిరాశగా మారబోతున్నదనీ, కఠోరమైన సత్యం తనముందు నిలబడి వెక్కిరించ బోతున్నదనీ ఆమెకు తెలియదు.

ఈ క్లిష్ట పరిస్థితిని తానెదుర్కోవలసి వస్తుందని ముందే తెలుసు శారదకి. అయితే వీళ్లందరినీ మభ్యపెట్టి, తప్పించుకొనే పిరికితనమూ ఆమెకు లేదు. బుద్ధిమంతనంగా మొహం పెట్టి నటనలు సాగించాలనీ లేదు. నిజమెప్పుడూ నిప్పు లాంటిది. దాచినవారిని దహిస్తుంది. కాని, తనమీద అంత నమ్మకంతో ఆప్యాయతగా అడుగుతున్న తల్లికి తన పరిస్థితిని అంత సౌమ్యంగానూ తెలియజెప్పట మెలాగా అని ఆలోచిస్తూ మౌనంగావుండి పోయింది శారద.

ఆ మౌనం అర్ధాంగీకారంగా తీసుకొన్న భాగ్యమ్మ మరి వుండబట్టలేక,

'అయితే మేము విన్న సంగతులన్నీ నిజమే నన్నమాట' అన్నది చెల్లెలి వంకర నడకని ధ్రువపరుస్తూ.

తల్లిపట్ల చూపవలసిన మెత్తదనం అక్కయ్యతో అవసరం లేదనిపించింది శారదకి. దానితో కొత్త ధైర్యం పుంజుకొన్నది.

'ఏమిటి నీవు విన్నది? నీ చెల్లెలు చెడిపోయిందనీ, ఒళ్ళు అమ్ముకొనే పతిత అయిందనీ, అంతేనా? కానీ ఆ దోషం నాది కాదు. నా దరిద్రానిది.'

'అయితే నువ్వు బుద్ధిమంతురాలివే గనీ పొట్ట గడవక చీకటి తప్పుకి దిగావంటావ్?' అన్నది భాగ్యం వెటకారంగా.

శారద ఆ హేళన పట్టించుకోలేదు.

'ఔను. నా చుట్టూ గిరి గీసుకొని నా శీలాన్ని అపురూపంగా చూచుకున్నన్ని నాళ్ళూ, నన్ను నమ్మినవారు లేరు. ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకుంటూ గౌరవంగా బ్రతకాలనుకున్నన్నినాళ్ళూ నాకు చేయూత నిచ్చినవారు లేరు. ఎందుకలా జరిగింది? తోడబుట్టినదానివి నీవే నన్ను నిష్కారణంగా దుయ్యబట్టావు. నలుగురు వినేలా ఆరడి చేశావు. పాటివారిలో చులకన అయ్యాను. ప్రతి పింజారీ సందేహించాడు నన్ను. అప్పట్నించీ ఒక విష వలయంలో చిక్కుకున్నాను నేను. అందరూ నన్ని కటిక దరిద్రంలోకి తోసి వూరుకున్నారు. నా మొహాన కులట అని ముద్ర వేశావు నువ్వు. అందరి కళ్ళూ నామీద పడ్డాయి. నా పతనానికి కారణం కొంతవరకూ నీవే. ఈ వేళ నీతులు బోధించవచ్చిన నీవు నా వివాహానికి ముందే కొంత స్వార్థం విడిచి వుంటే, నేనిలా నా అన్న వాళ్ళందరికీ కంటకప్రాయంగా తయారయ్యేదాన్ని కాదు—' గుక్క తిప్పుకోడానికి ఆగింది శారద. తెల్లగా పాలిపోయిన మొహానికి చీకటిని చాటుగా చేసుకున్నది భాగ్యం.

ఇప్పటివాకా నోరావలించి కూతుళ్ల వాదన వింటున్న తల్లి, భాగ్యం అవస్థ కనిపెట్టి; 'మా స్థితిగతు లెరగనిదానివా అమ్మాయ్! ఎంత కుమిలిపోతో ఈ రెండో పెళ్ళికి ఒప్పుకున్నదీ నీకు తెలియదా?' అన్నది విచారంగా.


భర్త పోయినప్పటి నించీ ఎంతెంత అవస్థలు పడిందీ ప్రొద్దుటినించీ శారద నోటంట వింటూనే వున్నదావిడ. అంచేత గట్టిగా మందలించ లేకుండానూ వున్నది. అలాగని తప్పు కాదని సమర్థించుకో లేకుండానూ వున్నదావిడ.


'నేను మీ తప్పులెన్నటం లేదమ్మా! మీ శక్తి నాకు తెలుసును. అందుకే, మీ నియమ నిబంధనలకు ఒదిగి మీరందరూ పసుపు తాడని చెబితే సరేనని ఆ వ్యక్తిచేత నా మెడకు తగిలించుకున్నాను. ఇప్పటికీ నన్నర్థం చేసుకోమంటున్నాను అంతే. ఒక పరిస్థితిలో ఒక దురాచారానికి లొంగిపోయారు మీరు. అలాంటి పరిస్థితుల్లోనే ఒక దుర్నీతికి లోబడి పోయాను నేను. అంతే తేడా.'


ఆమె సమర్థన తల్లికి నచ్చుబాటు కాలేదు.

'ఎంత కాలికాల మొచ్చినా, నీతి తప్పటాన్ని లోకం హర్షించదమ్మా' అని, నిట్టూర్చిందామె. 'హు. లోకం! నేనూ నా బిడ్డలూ కడుపులు మాడ్చుకుంటుంటే గుడ్లప్పగించి చూస్తూ నిలుచున్న లోకంతో నాకేం పని?' నిర్లక్ష్యంగా అన్నది శారద, 'పద్దెనిమిదేళ్ల మొగ్గను ఒక ముదుసలిగున్నకు ముడిపెడుతూంటే వద్దనలేదే ఈ లోకం? ఆడదాన్ని, వెనకానరా లేనిదాన్ని, అన్యాయంగా అయినవాళ్ళే వీధిలోకి విసిరేస్తుంటే చూస్తూ, కాదని వారించలేక పోయిందే ఈ లోకం? ఈ లోకానికి ఎందుకు భయపడాలి నేను?' ఆవేశంగా అన్నది శారద.

ఆ సమయంలో ఏమి చెప్పినా కూతుర్ని ఒప్పించటం కష్టమనిపించింది తల్లికి. అంతేకాదు కన్నబిడ్డ ఎంత మనస్తాపం పొంది, ఎంత వేదన అనుభవించి ఈ రొంపిలోకి దిగబడ్డదో అర్థమయి పోయింది ఆ







అబల

మాతృ హృదయానికి. మరి రెప్పగొట్టకుండా కూతురి తల నిమురుతూ వుండిపోయింది.

ఆ రాత్రి పూర్తిగా నిద్రపోయిన వాళ్ళు సమస్యలూ, సంతాపాలూ ఇంకా అంటని పిల్లలొక్కరే.

మర్నాడు ఇంట్లో ఏదో ప్రశాంతత కమ్ముకుంది. కాని ఎవరి మనసులోని ఆందోళనలు వారి కుండనే వున్నాయి.

ఆగి, ఆగి తల్లి శారదను బ్రతిమలాడుతోంది. 'తనతో వచ్చెయ్యమనీ, అదివరకటిలాగే గడుపుకుందామనీ, నారు పోసినవాడు నీరుపొయ్యడా అనీ'—మనసు నొవ్వకుండా, మాట కరుకు లేకుండా నచ్చ చెబుతోంది.

శారద ఎంతకూ ఇష్టపడ్డం లేదు.

'రమ్మంటూ ఒత్తిడి చేసి నన్ను ఇరకాటంలో పెట్టొద్దమ్మా' అంటోంది విసుగ్గా.

'నా ప్రారబ్ధానికి లొబడి తల వంచాను. నన్నింక వుద్ధరించడానికి ప్రయత్నించకండి' అని కళ్ళు ఒత్తుకుంటోంది.

'నాకా అవకాశమూ లేదు—అవసరమూ లేదు' అని కలాయిస్తోంది.

చెల్లెలి పెడసరితనం భాగ్యానికి ఒళ్ళు మంటగా వుంది. 'వంశగౌరవమూ బుగ్గిపాలవుతోంది; బంధుకోటిలోనా తలవంపులు; చెల్లెళ్ళ పెళ్ళిళ్ళున్నాయింకా. ఎట్లా గట్టెక్కను? ఎలా తెగించిన ఈ చిత్రాంగిని దారికి తీసుకు రావడం? అది చెడింది సరే. దాని పాపం త్రాచుపామై ఎందరిని కాటెయ్యబోతున్నదో గ్రహించదేమిటి ఖర్మ!' లోలోపలే మల్లగుల్లాలు పడిపోతోంది భాగ్యం.

పైకన్నట్టయితే — 'నాగతి మీరు చూశారా?' అని అంటుందేమోనని భయం. అదీ నిజమే మరి. స్వార్థం స్వార్థాన్ని సృష్టిస్తుంది.

'కూటికోసమే ఈ తప్పుడు త్రోవ తొక్కిందయితే నారాయణమూర్తి మనోవృత్తి ఇప్పిస్తా నన్నప్పుడైనా తన ప్రవర్తన మార్చుకోవన్నునుగా! మాస్తే దీనికా వంకరబాటే బాగున్నదన్న మాట! మరి తిండికి లేకే చీకటి తప్పు చేస్తున్నానని ముకాయించట మెందుకు? తనలోనే ఆ పాపం విజృంభిస్తున్నట్టు ఎందుకు ఒప్పుకోదు?—ఆ మాటడిగితేనో? — అమ్మో! తెగించినదాయెను—'నా వయసుకది సహజమేగా' అనవచ్చు. 'మొదట్లోనే, నా బ్రతుకులో తియ్యని దారులన్నీ మూసుకుపోయిన సంగతి మర్చేరగవా?' అని ఎదురు తిరగవచ్చు. ఇంకెవరికైనా చెప్పొచ్చుగాని దాని మాటకు సమాధానం చెప్పగలమా' భాగ్యం లోలోపలే పిసుక్కుంటోంది.

ఆ రోజూ గడిచింది—

మరునాడు లేస్తూనే తొందరగా కాలకృత్యాలు తీర్చుకున్నది శారద. స్నానాదికాలు ముగించుకున్నతరవాత టెంకాయా పూజాద్రవ్యాలూ తీసుకుని శివాలయానికి వెళ్తానని తల్లితో చెప్పి బయలుదేరింది.

'చేసేవి శివపూజలూ — దూరేవి దొమ్మరి గుడిసెలూ.' అనుకుంటూ వాసలు చిట్లించింది భాగ్యం.

తన పాదాలవద్ద ప్రణమిల్లే పతితులనూ, పవిత్రులనూ పక్షపాతం లేకుండా అందరినీ తలా వొకదారినీ చేరదీసి తనలో కలుపుకునే ఆ దేవదేవుడికి చెయ్యెత్తి నమస్కారం చేసింది శారద.

ప్రసాదం తీసుకుని ప్రాకారం లోపల పచ్చగన్నేరు చెట్టుకింద సిమెంటు దిమ్మమీద విశ్రాంతిగా కూర్చున్నది కాస్సేపు.

ప్రాతఃకాలం ప్రశాంతంగా వుంది. ఆ నిశ్శబ్ద వాతావరణంలో గుడి ఆవరణంతా మరీ పవిత్రంగా మెరిసిపోతోంది. విచ్చే మొగ్గలతో, విచ్చిన పువ్వులతో, వెదజల్లే పరిమళాలతో, మంచుబొట్లు రాలుస్తున్న పచ్చని చిగురాకులతో మనోహరమైన ప్రకృతి సింగారించుకొని పరమేశ్వరుడికి నీరాజనం పడుతోంది. ఇంకా గుడిలో సందడి అంతగా లేదు. అప్పుడప్పుడు భక్తులు మోగించే ఘంటారవాలు నివురుగప్పిన గుండెలోతుల నించీ భక్తిభావాన్ని రగిలించి పారవశ్యంలో ముంచెత్తుతున్నాయి.

శారదకు లోపల బరువేదో దింపుకున్నట్టయి మనస్సులో కల్మషమేదో విరిగినట్టయి, తేరుకుని నిర్మలంగా హాయిగా వుంది. మనుషులు తమలో లేని ప్రశాంత

తనీ, పవిత్రతని కేటాయించి ఈ కోవెల చుట్టూ పేర్చి పెట్టారా అనిపించింది. ఆ గాలి స్వేచ్ఛగా లోపలికి పీల్చుకుని ఒక్కక్షణమయినా కళ్ళు మూసుకుంది శారద.

వెళ్ళేముందు గబగబ దోసెడు గన్నేరు కాయలు ఒడిలో పోసుకున్నది. మరో సారి దేవుడికి మనసారా నమస్కరించి బయలుదేరింది.

భోజనంచేసి మధ్యాహ్నం మనగా పడు కున్న శారద ప్రొద్దు వాలిపోతున్నా లేవక పోయేసరికి అనుమానంగా ముసుగు తొలి గించింది భాగ్యం. పక్కమీద ఉన్ని గన్నేరుకాయల తొక్కలు పడివున్నాయి. అస్తవ్యస్తంగా పడి వున్నది శారద. శరీ రం కట్టెలా బిగదీసుకుంటున్నది. ఒళ్ళు జల్లుమంటే తల్లి దగ్గరకు పరుగెత్తింది భాగ్యం. గొల్లుమంటూ దగ్గరకు చేరింది తల్లి.

ధైర్యాన్ని కూడగట్టుకుని భాగ్యమే చెల్లెలి ముఖాన ఇన్ని నీళ్ళు చల్లింది, వుల్లిపాయ నలిచి ముక్కు దగ్గర పెట్టింది. తనకు తెలిసిన విరుగుళ్ళు ఏవేవో చేసింది.

కొంత సేపటికి బరువుగా రెప్పలు విప్పింది శారద.

వూపిరి పీల్చుకున్నారు తల్లీ, కూతు ళ్ళిద్దరూ.

'నువ్వు ఇక్కడే వుండమ్మా. నే నెవరి నన్నా అడిగి డాక్టర్ని పిలుచుకు వస్తాను' అంటూ బయలుదేరబోయిలది భాగ్యం.

కష్టంమీద చెయ్యెత్తి ఒద్దని వారిం చింది శారద. కళ్ళతో అక్కను చేర బిలిచింది, మెల్లగా నోరు విప్పింది.

'ఒద్దు. లాభం లేదు. అంతా అయి పోయింది. ఎవరినీ పిలవ్వద్దు......అల్ల రయిందా మీ మానమర్యాదలు ముగుగు కాలవలో వుంటాయి. పోలీసులొచ్చారా— అదో చక్రబంధం...' ఆయాస పడుతూ ఆగింది శారద. నాలిక పిడచ గట్టుకు పోతోంది. లోపల ఏముకలు విరిగిపోతు న్నట్టు బాధ. పోటొచ్చి గుడ్డ కుక్కు కుని గుండెలదిరేలా ఏడుస్తున్నది తల్లి. గట్టిగా పైకి ఏడ్చే వీలు కూడా లేదామె.

'ఎంత అఘాయిత్యం చేశావే తల్లీ' అంటూ లబలబ లాడుతున్న తల్లి వంక జాలిగా చూసి, శారద అక్కయ్య వేపు తిప్పింది మాపులు.

'లోకానికి భయపడనన్నదానిని యిలా ఎందుకు చేశాననుకుంటున్నావా అక్కా? నేనే వోడిపోయానమ్మా! లోకం కూసే కారుకూతలకి జడవలేదు. నిర్లక్ష్యంగా నిలవగలిగాను కాని దేవుడికే దయ లేదు. నా నేరం మూట గట్టి నా నెత్తికెత్తి, ఒక ముద్ర వేసి నన్ను అందరి ముందుకి నెట్టాలని ఆయన సంకల్పం. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆ ముద్ర నించి తప్పించుకోలేకపోయాన్నేను.'

అయోమయంగా వున్నాయామె మాటలు. సంధించిందేమో అనిపిస్తోంది అందరికీ. కాని శారద తెలివిగానే వున్నది. జారిపోయే శక్తినంతా కూడగట్టుకుంటూ మాట్లాడటానికి ప్రయత్నిస్తోంది.

ఆ స్థితిలో తల్లినెప్పుడూ చూచి ఎరగని పిల్లలు బిక్కచచ్చి అమ్మమ్మను చుట్టేసుకున్నారు. వారి వంక ఆప్యా యంగా చేతులు జాపబోయి బలవంతాన ఆపుకున్నది శారద.

తల్లిపోసిన తులసి తీర్థంతో మళ్ళీ గొంతు విడింది, 'ఈ ముగ్గురు నిర్భాగ్యు లకు తోడు మరో దౌర్భాగ్యజీవిని ఈ లోకంలోకి తీసుకువచ్చే సాహసం లేక నేనే వెళ్ళిపోతున్నాను.' అంటూ ఒక చేతిని అక్క ఒడిలో వేసి,

ఒక అనాథ, ఒక పతిత భూభారం తగ్గిస్తున్నందుకు నీవూ, నేనూ సంతో షిద్దాం. కాని నా లాంటి వికృత జీవులు ముగ్గుర్ని వదిలిపోతున్నాను. వాళ్ళని నాలాగే జారుడు బండలమీద వదలవు కదూ? ఆ హామీ ఇవ్వగలవా అక్కా' అన్నది శారద జాలిగా చూస్తూ.


భాగ్యం తల వంగిపోయింది. కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. చెల్లెలి చెయ్యి చేతుల్లోకి తీసుకుని మృదువుగా నొక్కుతూ 'అలాగే' అన్నట్టు తల వూపింది.

కళ్ళెదుట ఒక ప్రాణి గిలగిల కొట్టు కుంటుంటే చేతులు ముడుచుకు కూర్చో వలసి రావడం ఎంత ఘోరం!

గడ్డు క్షణాలు గడిచిపోయాయి.

బ్రతికి వన్నా ఏనాడూ ఏటి కెదురీది అలిసిపోయిన శారద, మడిగుండంలో గిర్రున తిరిగి మృత్యువు కవుగిట్లోకి హాయిగా ఒరిగిపోయింది.





నండూరి విఠల్

జరిగిన కథ

స్వామికి స్కూల్లో టీచరు ఉద్యోగంతోపాటు రఘుపతిగారింట్లో ఆశ్రయంకూడా దొరకటంతో అదృష్టవంతుడని అనుకున్నాడు. అయితే రఘుపతి గారమ్మాయికి ప్రైవేటు చెప్పాల్సి వచ్చినప్పటికి అతడికి పచ్చి వెలక్కాయ గొంతున పడ్డట్లయింది. దానికితోడు పరాంకుశం నూటొక్క పోటీ మాటలు, హెడ్‌మాస్టర్ హితబోధ స్వామిని కలవరపెట్టాయి. ఊరికి రాజకీయాల్లో రఘుపతిగారికి ప్రత్యర్థిగా తయారవుతాడు కోనేటిరావు. స్వామి రఘుపతి గారింటికి బయలుదేరాడు.

4

'జీవితంలో మూడవ వంతుకాలం నిద్రలో బ్రతుకుతాడు ప్రతిమనిషీ'— శాస్త్రజ్ఞులు అలా అంచనా కట్టారు. మిగిలినకాలంలో నూటికి తొంభైపాళ్ళు ప్రపంచం కోసం, పదిపాళ్ళు—కేవలం తనకోసం బ్రతుకుతాడన్నా సరిపోతుందేమో అంచనా.

తాను తల్లికి జబ్బుగా వుందంటూ అప్రయత్నంగానే అబద్ధం చెప్పటం జరిగింది. శలవుకూడా యిచ్చేసారు హెడ్‌మాష్టారు. ఒక తప్పు పది తప్పులకు దారితీస్తుందన్న సూక్తిలో నిజం కనిపించింది స్వామికి. ఎవరన్నా ఏమన్నా అనుకుంటారేమోనన్న భయంతో నన్నా ఊరికి వెళ్ళిరాక తప్పేటట్లు లేదు. వెళ్ళకపోతే తనను ప్రాణాలతో బ్రతక నివ్వరు హెడ్‌మాష్టారు. అసలు తను అంతటి అబద్ధం ఆడినసంగతి తెలిస్తే—ఆయనగుండె ఆగిపోయే ప్రమాదముందని పించింది.

నిజానికి మొదటిజీతం అంతా కళ్ళ జూడకుండా వచ్చాడు తల్లి దగ్గరకు—కలలోగా వెళ గూడదనే నిశ్చయంతో బయలుదేరి వచ్చాడు. ఇన్నాళ్లకు తాను ఉద్యోగంలో చేరాడు. ఈరోజుకోసమే ఏళ్ళ తరబడి తన తల్లి ఎదురు చూసింది. జీతాన్నంతా రూపాయి బిళ్ళలుగా మార్చి తల్లి దోసిట్లో గుమ్మరించి సంతృప్తిగా సంబరపడుతున్న ఆమె ముఖం చూడా లనుకున్నాడు ఇంగ్లీషు రాకపోయినా, తనకు ఉద్యోగం తెచ్చిన ఆర్డరు కాగితాన్ని తడిమి చూసుకొని 'గంతవాడివి కాగలవని నాకు తెలుసురా స్వామ్మీ' అంటూ పొంగి పోయింది సీతమ్మగారు. 'ఆయనే వుంటే యెంత పొంగిపోయేవారో!' అంటూ కళ్ళు తుడుచుకుంది.

ఎంత ఆలోచించినా మొదటిజీతం చేతి కందకుండా వెళ్ళటానికి యిష్టంలేక పోయింది. కాని గత్యంతరం కనిపించడం లేదు.

'ఇవాళ మొదలుపెట్టండి ప్రయివేటు మాష్టారూ' అంది నోటు పుస్తకాలూ పెన్సిలూ పుచ్చుకొని పావని.

'మనస్సు బాగుండలేదండీ—తర్వాత—' అన్నాడు స్వామి.

'అసలు మనస్సంటూ ఉంటే కదే చావండీ దానిలో. ఎప్పుడు మనస్సును గురించి ఆలోచిస్తేనే ఒక్కొక్కసారి మహా బోరనిపిస్తుంది' ఏమంటారు?'

'ఔనండీ'

'పోనీ మీదగ్గర ఏదన్నా పుస్తకముంటే యిస్తారూ కాలక్షేపానికి?'

'లేవండీ'

'ఆ టేబిల్ మీద ఆ సంచరంగుల అట్టది?'

'ప్రాచీన భారతదేశ చరిత్రండీ! శర్మ గారిది'

'భళి! భళి!! బ్రహ్మాండమండీ. మొత్తానికి బడిపంతు లనిపించారు. కనిష్కుడి రాజ్యానికి సరిహద్దు లేమిటో కళ్ళతో చూసి వచ్చినట్లు ఖచ్చితంగా రాసేస్తారే పెద్ద మనుషులు, ఉన్న ఊరి ఎల్లలతోనే సంబంధం లేకపోయినా. మీకు మాత్రం బోరుకొట్టటంలా ఈ పాడు వూళ్ళో. ఆ దిక్కుమాలిన టూరింగు సినిమా ఉందన్నమాటే గాని, పదిరోజులకుగానీ ఒక బొమ్మ మారదు. నిజం చెబుతున్నా మాష్టారూ...'

చెబుతూనే వుంది కామాలూ ఫుల్‌స్టాపులూ లేకుండా పావని.

'పావనమ్మా! ఓ బిందెడు మంచి


A.S.Murty

నీళ్ళు తెచ్చిపెట్టవే తల్లీ. నడుం నొప్పితో ఛస్తున్నా—' కేక పెట్టింది శారదమ్మగారు.

'మీ అమ్మగారు పిలుస్తున్నా రండీ'

'నానెత్తి—ఆ నీలాటి రేవుకు వెళ్లట మంటేనే మంట నాకు. అమ్మలక్కలకు అదొక షికారు. ఊళ్లో గొడవలన్నీ అక్కడే వుంటాయి. పదిమంది అమ్మ లక్కలు నడుందాకా నీళ్లల్లో దిగబడి— అక్కడలేని అచ్చమ్మకుటుంబ రహస్యాలను తృప్తిగా చర్చించుకుంటారు. అమ్మ వెళ్లి నప్పుడల్లా 'మీ పావనమ్మకు సంబంధం కుదిరిందా?' అంటూ కాకుల్లా పొడు స్తూంటారట.?'

'ఉస్సేయ్! కొరకంచూ!' మళ్లీ కేక పెట్టింది శారదమ్మగారు.

'ఏమిటీ?' అలా కూర్చునే మారు కేక పెట్టింది పావని.

'వంటింట్లో చెప్పులిప్పి పేమిటే పాపిష్టిదానా. ఆ చెప్పులలా మండువాలో తగలేసి, యిలా ఒక్కసారి తగలడవే.'

విరగబడి నవ్వింది పావని.

ఒక మహాశిల్పి చెక్కి తీర్చి దిద్దిన చిత్రాన్ని చూస్తున్నట్లు నివ్వెరపోయి చూస్తున్నాడు స్వామి.

'మరీ కంగారు పడకండి మాష్టారూ. మా అమ్మకు మన నీడగూడా గిట్టదు. ఇంటిపనులు నేర్చుకో మంటుంది. వంట వండటంచేతకాదంటుంది. మరీ రుచిగా వండుకుని ముప్పూటలా తింటే యింకా

షంషంతి

లావై పోముటండీ? ఇలాగా దినదినా ప్రవర్ధమానంగాలావెక్కి దర్వాజాలు పట్టకుండా ఊరిపోతానేమోనని అసలేభయంతో ఛస్తుంటే ఈ బెంగతోనే చివరకు 'హరీ' అంటానేమో.'

'నీ దుంపతెగ' అంటూ గరిట పుచ్చుకు వచ్చిన తల్లిని చూసి, ఎగిరిపడి లేడి పిల్లలా లోపలకు పరిగెత్తింది పావని.

సత్యభామ పోలికలున్న పావని.

'ఎంత నిర్లక్ష్యం? తల్లి అనే మర్యాద కూడా లేకుండా' అనుకుంటూ అలాటే పది క్షణాలు రెప్పలార్పకుండా చూశాడు స్వామి. కాఫీ పెట్టుకుంటానికి కుంపటి అంటించు కుంటూ, కాగితాలు రాజుకుంటానికి, విసన కర్ర కరువై బల్లమీదున్న శర్మగారి పరిశోధన గ్రంధం— ప్రాచీన భారతదేశ చరిత్రను — మసిచేతులతోనే అందిపుచ్చు కొని— తడిబొగ్గుల్ని జయించి అగ్ని హోత్రుణ్ణి ఆహ్వానించడం మొదలు పెట్టాడు. పాపం శర్మగారు! దేశదేశాలూ తిరిగి, శిలాశాసనాలన్నీ వెలికి తీసి, జీవితాన్ని ధారపోసి, పరిశోధనలు చేసి, ఆ ఉద్గ్రంథాన్ని రచించాడట ఆ మహాను భావుడు. ఆ కీర్తిశేషుడు తిరిగివచ్చి ఆ దృశ్యం చూడటం జరిగితే — ఆయన ఆత్మ ఎంతటి వేదన అనుభవిస్తుందో ఆలోచించగల స్థితిలో లేదు స్వామి మనస్సు.

'స్వామి మనస్సు అనుభవిస్తున్న వేదన వేరు. తడిబొగ్గులతో ఆ విధంగా యుద్ధం చేస్తున్న 'ప్రాచీన భారతదేశ చరిత్ర'ను ఒక్క గుంజుతో లాక్కుంది సగం తడిసిన బట్టలతో తల్లిపోరు పడలేక ఓ బిందెడు నీళ్లు యింట్లో గుమ్మరించి వచ్చిన పావని. 'మీ భుజబలమంతా చూపెట్ట టానికి ఆ చరిత్ర పుస్తకమే దొరికింది టండీ?' అంటూ గోడదగ్గరకువెళ్లి 'ఏసుప్రభూ! ఈ పుస్తకం ఆ పెద్ద మనిషి ఎంతకష్టపడి వ్రాశాడో ఆయన ఆత్మకు శాంతి కలిగించు' అంటూ కిల కిల నవ్వింది.

'మండటం లేదండీ బొగ్గులు' కళ్లల్లో నిండిన పొగ కన్నీటిని తోడు తూంది బయటకు.

'ఇంతకూ మీకు వంట చెయ్యడం ఎప్పు డలవాటయిందండీ సార్'

'అలవాటేనండీ చిన్నప్పటి నుంచీ. ట్రయినింగు చదువుతున్న రెండేళ్లూ నేనే వండుకు తిన్నాను. నేకాచిన సాంబారంటే లొట్టలు వేసుకుంటూ తినేవాడు మా ఆనందం'

'అతనెవరండోయ్'

'నా ప్రాణస్నేహితుడండీ — ఆ గడియారం —' పొరపాటున మాట జారింది. అంతలోనే సర్దుకొని' 'చాలా మంచివాడండీ' అన్నాడు.

'మా కాంట్రాక్టరు నాకు అర్థాంగాటా కూడా యిస్తానన్నాడు' అని వ్రాశాడు ఆనందం ఉత్తరం.

'గడియార మేమిటండీ? అన్నట్లు మీ చేతిగడియారం కనిపించడం లేదీ మధ్య'

సమాధానం కోసం తడుముకున్నాడు స్వామి.


'పోయిందేమిటండీ కొంపతీసి?'

'అబ్బే లేదండీ. ఆనందం వచ్చి తీసు కెళ్లాడు. అసలు అది నాదికాదండీ. ఊరికినే పెట్టుకొచ్చా'

'ఎందుకు పెట్టుకొచ్చారండీ? ఎరువు సొమ్ము బరువు చేటన్నారు. అది పోతే కొంపతీసి, జీతంలోంచి కట్టుకోవాల్సి వచ్చేదంటారా కాదా?'

'కానండీ. కట్టుకోవాల్సి వచ్చేది'

తలవంచుకు సమాధానం చెప్పిన స్వామి



ఈ కారొద్దురా - మా నాన్నగారు
తిరగడానికి పనికిరాదని చెప్పారు

ముఖంలోకి జాలిగా చూసింది పావని. అంతవరకూ ఆమె పెదవులమీద మెరుస్తున్న చిరునవ్వు అదృశ్యమైపోయింది.

'మావయ్యగారూ!'

తలెత్తి చూశాడు స్వామి.

'ఒకమాట చెప్పనా...' అడిగింది పావని.

వీధి వాకిట్లో ఆగింది వెంకన్న ఒంటెద్దుబండి. అందులోంచి దిగి నీరుకావి పంచెలో ఒక అరవయ్యేళ్ళ మనిషి పొడుం బుర్రతో సుతారంగా బండి చక్రానికి రెండు మరకలంటించి, ముక్కు పొడుం దట్టించి, పంచె గోచిగా పెట్టుకొని 'చెల్లెమ్మా' అంటూ యింట్లోకి వస్తున్నాడు.

చెమటకోసం వళ్ళంతా కప్పుకుంటూ ఆతురతగా ఎదురువెళ్ళిన శారదమ్మగారు 'ఏమయిం దన్నయ్యా? కాయా పండా' అంటూ అడిగి సమాధానంకోసం ఉత్కంఠతతో ఎదురు చూసింది.

'దీనికీ జన్మలో పెళ్ళికాదు చెల్లెమ్మా పాడు జన్మనక్షత్రం!'

కిటికీలోంచి ఈ దృశ్యం చూస్తున్న పావని 'సాంబయ్య తాతండి. ఆయన ఈ భూలోకంలో ఎందుకు అవతరించాడో తెలుసా? నాకు సాధుణ్ణి వెతికి పెట్టటానికి! అమ్మదగ్గర పాతికా పరకా గుంజుకు పోవడం పదిరోజుల కోసారి — పోషించలేక ఎన్నడో వదిలిపెట్టిన భార్యా రత్నంమీద దెంగ ముంచుకొచ్చి ఆ డబ్బుతో అత్తవారింటికి చేరటం — తన ప్రయోజకత్వంతో సంపాదించుకొచ్చిన ఈ పాతికతో ఘనంగా నాలుగు రోజులు ఆవిడగారితో ఊరేగడం — అదైపోగానే — వాళ్ళు తరిమెయ్యగానే — మళ్ళీ మరో పెళ్ళికాక ఎదిగి కూర్చున్న కూతురున్న తల్లినో తండ్రినో పట్టుకోవడం — ఇదీ వరస. మూడేళ్ళనుంచి జరుగుతోంది భాగోతం. యింట్లో కాలు పెడితే కాళ్ళు విరగ్గొడతానని బుద్ధిచెప్పాడు నాన్న. అప్పటినుంచి యిలా ఆరాతీస్తాడో — ఆయన కోర్టుపనులకు ఊరు వెళ్ళిన సమయంలోనే రావడం మొదలుపెట్టాడు'

'మజ్జిగ తాగన్నయ్యా! పాపం ఎండల్లో కాళ్ళకు బలపాలు కట్టుకు తిరుగుతున్నావు.'

'తిరుగుతానమ్మా. నళ్ళు దాచుకునే మనిషినా? నీ బిడ్డయితే ఒకటీ నా బిడ్డయితే ఒకటీనా? కాని ఎంత తిరిగినా దాని పెళ్ళికాలేక పోతున్నాదనే బాధ వుందనుకో — అన్నట్టు మరిచాన్నమ్మాయ్ చెల్లెమ్మా.'

తేలు కుట్టినట్టు ఎగిరిపడ్డాడు ఆ పెళ్ళిళ్ళ పేరయ్య.

'ఏమిటన్నయ్యా? మరొక సంబంధ మేదన్నా గుర్తుకు వచ్చిందా ఏమిటి?'

'నా మతిమండ — సుబ్బారావుగారని — మా వ్రదకుడు మొన్ననే చెప్పాడమ్మా. విజయనగరంలో సుసర్లవారబ్బాయి ఒకడున్నాడని. తల్లి తండ్రులకు ఒక్కగానొక్క కొడుకట. తాతముత్తాతల నాటిది — ఏమిటి? నలభై ఎకరాల అగ్రహారం వుందట. తల్లికున్న ఏడువారాల నగలూ కోడలికివ్వాలనే నిర్ణయంట.'

'మరి అంత గొప్ప సంబంధ మెందుకున్నావన్నయ్యా? మా కుటుంబ పరిస్థితులు నీకు తెలియనివి ఏమున్నాయి గనుక. వాళ్ళకి కట్నంమీద ఆశ వుంటే మనం తూగగలమా అని?'

'అదే నమ్మా అదృష్టమంటే. తండ్రిది అదొకరకం తత్వంట. కందుకూరి వీరేశలింగంగారి —'

'మరొక సంబంధం సంగతా నువ్వు చెబుతూంటున్నయ్యా?'

'కాదమ్మా! మహానుభావుడటే. కట్నాలు తప్పంటూ ఢంకా బజాయించి చెప్పాడమ్మా! (కన్యాశుల్కం [illegible] పైన సంగతి గుర్తు రాక ఆ మహానుభావుడి శిష్యుడనమ్మా మన ఎరుక్కుంటూనే'

ఆయనగారు కొయ్యబొమ్మ కుర్చీలో ఆపసోపాలు పడుతూ చెబుతున్నారు. క్రింద కూర్చుని తాటాకు విసనకర్రతో విసురుతూ ఆ మాట విని ఆపేక్షగా మరి కొద్ది ముందుకు జరిగిన శారదమ్మ 'అలాగైతే వెళ్ళి ఆ సంబంధం కుదుర్చుకురా అన్నయ్యా! వచ్చి పీటలమీద పడతాను. చెప్పలో యెన్ని కట్టినా పోరుతున్నా ఆయనకు ఆపాటు కోర్టు గొడవలే గాని యింటి గొడవలు పట్టవయ్యె. తక్షణం విజయనగరం వెళ్ళి ఆ సంబంధం కుదుర్చుకురా అన్నయ్యా' అంది ప్రాధేయపూర్వకంగా.

'వెళ్ళాలనే వుంది నాకూను. కాని డబ్బుతో పనాయె. కాస్త కూస్త దూరం కాదే మళ్ళీ.'

'ఎంతవుతుం దన్నయ్యా రైలు ఖర్చులు?'

'అందులో ఒక చిక్కుంది చెల్లెమ్మా. మా వ్రదకుడి దగ్గర ఏకలవ్య ప్రాయంగా శిష్యరికంచేసి, ఆ సుసర్లాయన జ్యోతిషం నేర్చుకున్నాడట. అప్పటినుంచి మా వ్రదకుడంటే ఆయనగారికి తగని గురి. ఈయన్ని తీసుకెళ్ళి, ఆయనకు చెప్పిస్తే తప్పకుండా పని జరుగుతుందని నాకు నమ్మకముందమ్మా.'



'ఏవి పూర్ణయ్యా మీ పెద్దకుడి గారివి?'

'నెల్లూరు దగ్గర పెద్దరెడ్డిపాలె మనీ—జిల్లాబోర్డు ఇస్కూల్లో తెలుగు పండితుడుగా వుంటున్నాడు. ఆయన్ని వెంటబెట్టుకొని వెళ్లాలంటే ఒక వచ్చే నోటన్నా ఉండందే కథ నడవదే'

శారదమ్మగారి ముఖంలోకి చూశాడు ఆశతో మెరుస్తున్న కళ్లతో. 'వచ్చే నోటే—ఎక్కడనుంచి తేనన్నయ్యా. ఆయన దగ్గరా ఈ మధ్య పైసా ఆడటంలా. ఇంట్లో రోగాలమోత—బయట పల్లెకిల మోత—అనీ—కోర్టు పనులంటే ఆయనకు ఎక్కడన్నా అప్పు పుడుతుందిగానీ—అయిన ఖర్చులకు డబ్బడిగితే అగ్నిహోత్రమై పోతారు'

'నిక్షేపంలాంటి సంబంధమమ్మా. అవసరపడకపోతే ఆనక చేయిజారిపో గలదు—నీయిష్టం. యిన్నాళ్లూ యింతగా శ్రమపడి తీరా చేతికందిన బంగారాన్ని వదిలేసుకుంటున్నామనే బాధగా వుంది!'

'ఉండన్నయ్యా! ఇప్పుడే వస్తా—' అంటూ లేచి 'పావనమ్మా' అంటూ కేక పెట్టింది శారదమ్మగారు. ఆ పెళ్లిళ్ల పేరయ్యగారి మాటలు మూడు సంవత్సరాలనుంచీ వింటున్నా శారదమ్మగారు ఆయనమీదనే యింకా కొండంత ఆశ పెట్టుకున్నారు. తల్లి అమాయకత్వానికి పావనిపళ్లు మండింది. తన పెళ్లిని గురించి తల్లి అంతగా గిలగిలలాడి పోవ డంలో పావనికి అర్థం కనిపించదు. పేరయ్యగారిమాటలన్నీ విన్నాక, అతడు కొంగ్రొత్తగా వేస్తున్న పథకం అర్థ మయింది. తల్లి పిలుపుకు విసురుగానే లేచి వంటింట్లోకి నడిచింది.

లోపల తల్లి బిడ్డలమధ్య వాగ్యుద్ధం జరిగింది. చెమ్మగిల్లిన కళ్లతో, వాచిన చెంపలతో పది నిమిషాల తర్వాత బుసలు కొడుతున్నట్లు ఊపిరి విడుస్తూ బయట కొచ్చింది పావని. వస్తూనే స్వామి గదిలో కొచ్చి 'ఒక సహాయం చేస్తారా మాస్టారూ?' అంది.

పావని డబ్బు అప్పడుగుతుందేమోనని భయం వేసింది. అంతకంటె ఆమె అడగ దగిన సహాయం అతనికి కనిపించలేదు.

'నాదగ్గర ఎక్కువ డబ్బు లేదండీ. యింకా ఏడు రూపాయలు మిగిలింది. నెలాఖరుదాకా గడవాలి యింకా'

'డబ్బు కాదు మాస్టారూ!'

'???'

'కాస్త విషముంటే పెట్టండి'

'ఎందుకండీ?'

'చావటానికి. ఎందుకండీ ఈ పాపిష్టి బ్రతుకు. ఇంట్లోనూ, ఊళ్లోనూ అందరికీ బరువైపోయాను. ఈ పాడు పెళ్లి కాకపోతే లోకం మునిగిపోతుం దంటారా? అడవిలో రాతి బండలై పుట్టటం మంచిదండీ ఈ దిక్కుమాలిన దేశంలో ఆడపిల్లై పుట్టటంకంటే' అంటూ రుసరుసమంటూ బయటకు వెళ్లి పోయింది పావని. తల్లితో పోట్లాడినప్పు డల్లాపోయి స్నేహితురాలు భారతి దగ్గర ఆ ఆవిరి వదిలించుకు వస్తేగాని పావనికి ఊరట కలగదు.


కళ్లముందు జరుగుతున్న ఈ రభ సంతా చూస్తూ 'ఎవరి బాధలు వాళ్లవి' అనుకున్నాడు స్వామి. బడి వదిలి పరాం కుశంగారు వెంట రాగా యింటికి నడుస్తున్న హెడ్‌మాస్టారు కిటికీగుండా స్వామినిచూసి అదిరిపడి ఎగిరినట్లు లోపలికి చక్కా వచ్చి, నరహత్య చేసిన పాపాత్ముణ్ణి అవ లించినట్లు 'ఏమోయ్ యింకా వెళ్లలా ఆవిడగారికంత ప్రాణంమీదకొచ్చి చావు బ్రతుకులమధ్య కొట్టుకుంటు వుంటే? మొత్తానికి ఘటేమునిషివే. ముందు బయలు దేరవయ్యా. నిమ్మకు నీరెత్తినట్లు యిలా కూర్చున్నావా అనక బతికినంత కాలం చేసిన పొరపాటుకు బాధపడుతూ అఘోరించడానికి?' అంటూ మందలించ డంతో సంచి పుచ్చుకు బయలుదేరక తప్ప లేదు స్వామికి.

'అమ్మగారికంత సుస్తీ చేస్తే మాట మాత్రమన్నా చెప్పారేం కాదు బాబూ' అంటూ పరామర్శించిన శారదమ్మగారికి కూడ చెప్పటానికి సమాధానం దొరక్క రోడ్డుదగ్గరకు నడిచాడు 'లాస్టు బస్సు' కోసం. అటునుంచికాక — యిటునుంచి వచ్చిన బస్సు ఆగింది. ఒక తాటాకు బుట్టతో బట్టలమూటతో దిగిన ఒక స్త్రీ మూర్తిని చూసి 'అమ్మా' అంటూ ఆడ బడుతున్న అడుగులతో దగ్గరకు పోయి ఆమె చేతిలోని సంచీ మూటా అంది పుచ్చుకున్నాడు.

ఆ వచ్చిన స్త్రీ మూర్తి సాక్షాత్తూ స్వామి తల్లి సీతమ్మగారు!.

* * *

ఒకే అనుభవాలలో సుఖం — దుఃఖం రెండూ నిండిపోవడమంటే ఏమిటో ఇప్పుడు స్వామి మనస్థితిని ఊహించిన వారు అర్థం చేసుకోగలరు. ఆకస్మికంగా



తల్లిని చూడటం తనకు నిస్సంశయంగా సంతోష కారణమే. కాని అప్పటి తన పరిస్థితి యెటువంటిది ? డబ్బుకోసం తను ఆడరాని అబద్ధం ఆడినట్లు నిశ్చయించుకుని తనను అందరూ నీచంగా చూస్తారు. ఈ సంగతి తెలిసిన తర్వాత తను హెడ్‌మాష్టారికి ఎలా చూపించగలడు ముఖం. బళ్ళోనూ ఊళ్ళోనూ పనిగట్టుకొని ప్రతిమనిషికీ తనను ఒక అబద్ధాలకోరుగా చిత్రించి యాగీ చేయకుండా వదిలిపెడ్తాడా శకుని పోలికలున్న ఈ పరాంకుశం? శారదమ్మగారు, పావని— అందరూ కూడా తనను నిజాయితీ లేని మోసగాడి క్రింద జమకట్టి గది ఖాళీ చేయమనకుండా వుంటారా? ఇంత అల్లరి జరిగిన తర్వాత మరొకరు మాట నమ్మి తనకు తలదాచుకుంటానికి చోటిస్తారా ?

రోడ్డుదగ్గరనుంచి యింటికి నడిచి వస్తున్నంతసేపూ యిటువంటివి లక్ష ప్రశ్నలు స్వామిని వేధించటం మొదలెట్టాయి. అనుకోకుండా యింత ఆకస్మికంగా తల్లి ఎందుకు బయలుదేరి రావలసివచ్చిందో అతనికి అంతు చిక్కలేదు.

'ఎలా చిక్కిపోయావురా తండ్రీ ! తిండీ వసతీ సరిగా అమిరినట్లు లేదు. పాలూ పెరుగూ దొరుకుతున్నాయిట్రా ? చిన్నాక యింటివాణ్ని చేస్తేగాని నాకీ బెంగ తప్పదు.'

రఘుపతిగారి యింటికి వచ్చేవరకూ సీతమ్మగారు ఇదే ధోరణిలో మాట్లాడటం జరిగింది. అంతవరకూ పరిపరి విధాలుగా ఆలోచించి, గత్యంతరంలేక మొండి ధైర్యం తెచ్చుకున్నాడు స్వామి. ఏం జరిగినా తాను చేయగలిగిందేమీ లేదని అర్థమయింది. 'మా అమ్మగారు' అంటూ స్వామి పరిచయం చేయగనే 'మీకు ఎంట్లో—' అంటూ ఆశ్చర్యంగా ప్రశ్నించింది శారదమ్మగారు. 'ఆ పెద్దరోగం లెండి. వయస్సు మీదపడటంలా. మునుపటి వోపికపోయింది' అంటూ మామూలు ధోరణిలో సమాధానం చెప్పింది సీతమ్మగారు.

ఆ విషయంలో అంతకుమించి సంభాషణ దొర్లకపోవడంతో కుతకుత వుడుకుతున్న స్వామి మనస్సుకు రవ్వంత ఉపశాంతి కలిగింది.

'కాళ్ళు కడుక్కోండి వదినగారు పాపం అంత దూరం ప్రయాణం చేసి వచ్చారు' అంటూ కలివిడిగా పలకరించింది శారదమ్మగారు.

అటువంటి యింట్లో అంత చక్కటి వసతి కుదిరినందుకు సంబర పడిపోయిన సీతమ్మగారు రఘుపతిగారింట్లో భోజనాలయ్యాక 'నా బెంగ తీరిపోయిందిరా స్వాములూ. ఎంత సంప్రదాయమైన కుటుంబం. పరాయింట్లో తిండితిన్నట్లు లేదనుకో' అంటూ తిరిగివెళ్ళి వంట గదిలో శారదమ్మగారితో కబుర్లలో మునిగిపోయింది.

చీకటి పడింతర్వాత గాని భారతిదగ్గర నుంచి తిరిగిరాలేదు పావని. ఇంట్లో మరొకమనిషి కనిపించడంతో, అంతకు ముందు జరిగిన పోట్లాటను తిరిగి ప్రారంభించకుండా మౌనంగా భోజనం ముగించి, ముసుగు వేసుకు పడుకుంది పావని.

'అమ్మాయికి సంబంధాలేమన్నా చూస్తున్నారా వదినగారూ ?'

'చూస్తున్నా మనుకోండి. ఏమైనా ఆ కల్యాణ ఘడియ రావాలిగదా ?'

'చాలా నిమ్మదైన పిల్లండీ మీ అమ్మాయి' అంది సీతమ్మగారు పావని మౌనానికి మూలకారణం అంతకుముందు తల్లితో జరిగిన మహా సంగ్రామమని తెలియక. పావనిని గురించి అంత చల్లటి మాట వినడం శారదమ్మగారికి జీవితంలో మొదటిసారి అనుభవం. అందుకనే 'ఏం నిమ్మదిలెండి' అని ఊరుకుంది.

ఆ రాత్రికిగాని తల్లి అంత ఆకస్మికంగా బయలుదేరి రావడానికిగల అసలు కారణం స్వామికి తెలియలేదు.

శారదమ్మగారు మరొక పక్కమంచమిచ్చింది. తల్లీ కొడుకు ఒకే గదిలో పడుకున్నారు. అంతా సద్దు మణిగిన తర్వాత 'నిన్న సాయంత్రం మామయ్య వచ్చాడురా' అంది సీతమ్మగారు.


'ఏ మామయ్య ?' అన్నాడు స్వామి,

'మంగపతి మామయ్య.'

ఆశ్చర్యమనిపించింది స్వామికి.

నిజానికి తమ రెండు కుటుంబాల మధ్యనూ అన్ని సంబంధాలూ తెగిపోయి—రెండవసారి—పది సంవత్సరాలు దాటింది. ఇన్నాళ్ళూ మేనమామ ప్రసక్తి లేకుండానే గడిచిపోయింది తన జీవితం. ఇన్నాళ్ళు గడిచాక—ఇన్నేళ్ళు గడిచాక—ఆన పనిని గట్టుకొని తమ యింటికి రావలసిన అవసరం కనిపించలేదు స్వామికి ఎంత ఆలోచించినా.

కూతురు పుట్టగానే—తన తండ్రి (బతికున్న) రోజుల్లో—సంబరపడిపోతూ పనిగట్టుకొని తమ వూరొచ్చి—'ఒరేయ్! అల్లుడా! నీకు పెళ్ళాం పుట్టిందిరా!' అంటూ పట్టినంత పటిక బెల్లంగడ్డ తన నోట్లో పెట్టి—తనను



ఆకాశానికి ఎత్తిన మంగపతి మామయ్యను తాను మరచిపోలేడు.

ఆ తర్వాత—తన తండ్రి పోయి నెల తిరగకముందే 'బంగారు బ్రతుకుండగా చేసి నడుంతో కాలుపెట్టను సీతమ్మా!' అంటూ తన తల్లిని బెదిరించి శపథం చేసి, బిగ్గరగా కేకలు వేసుకుంటూ తనతో అన్ని బంధాలు శాశ్వతంగా తెంచుకు వెళ్ళిపోయిన మంగపతి మామయ్యను తానెలా మరచిపోగలడు స్వామి ఎంత చిన్నతనమైతే మాత్రం ఆనాటికి తనకు?

శ్రీదేవి పుట్టినప్పుడే 'నీ పెళ్ళాం దా స్వాములూ? నీకోసమే నా కడుపున పుట్టిం దిదా స్వాములూ' అంటూ క్షణక్షణం మాట్లాడిన మామయ్య—చివరకు శ్రీదేవిని మరొకరికిచ్చి వివాహం చేస్తా—తమకు శుభలేఖ గూడా పంపలేదన్న మాట మాత్రం—ఎలా మరచిపోగలడు స్వామి?

అనాడు కూడా సీతమ్మగారు బాధ పడలేదు. కసిగా పడినట్లు కనిపించలేదు. 'డబ్బుకోసం రెండో పెళ్ళివాడికి చేసి శ్రీదేవిగొంతు కోశావురా అన్నయ్యా!' అంటూ నిట్టూర్చింది. ఆ తర్వాత నెల తిరగకుండానే శ్రీదేవి భర్త మరణించి నప్పుడు—'బంగారు తల్లి—దాని బ్రతుకు

మమత

బండలు వేశాడురా అన్నయ్య' అనుకుంటూ విలవిల లాడిపోయింది.


ఇంత జరిగిన తర్వాత తమ ఇంటికి పనిగట్టుకొని మంగపతి మామయ్య ఎందుకొచ్చాడో స్వామికి అర్థం కాలేదు.

'ఎందుకొచ్చాడమ్మా మంగపతి మామయ్య?'

'శ్రీదేవి జీవితం అలా అయిపోయింది నీకు తెలుసుగదా? అచ్చటా ముచ్చటా తీరకుండానే దాని అయిదోతనాన్ని హరించాడా మాయదారి భగవంతుడు. దానికి మళ్ళీ పెళ్ళి చేయాలని ఆలోచనట్టా.'

స్వామికి కొంత అర్థమయింది. అంతకు మించి చెప్పలేదు సీతమ్మగారు. తల్లీ కొడుకులమధ్య తర్వాత పది నిముషాలు సంభాషణ నొత్తింది రాదు

'నీ ఉద్దేశం తెలుసుకుందామనివచ్చాడ్రా. దాని బ్రతుకు అలా బ్రద్దలై పోయింది. మీ యిద్దరూ చిలకా గోరింకల్లా కాపురం చేసుకోవలసింది అంతా సవ్యంగా జరిగితే. భగవంతుడు ఉండ్రోకంగా తలపెట్టాడు. ఈ రోజుల్లో వయస్సు ముదిరిన వాళ్ళే రెండో పెళ్ళిళ్ళు చేసు



కుంటున్నారు ఆడవాళ్ళు కూడా. నిజమే అనుకో పాడయింది నాయనా — అటూ యిటూ రక్తం — పెళ్ళంటే చెయ్యాల్సింది—నువ్వు సలక్షణంగా చేసుకుంటే సంతోషించవలసిన దాన్ని. కాపురం చేసుకో వలసిన వాడివి నువ్వు తండ్రీ. నియమ ప్రకారం జరిపించాలనే నా అభిప్రాయం గూడా.'

మళ్ళీ ఎవరి ఆలోచనల్లో వాళ్ళు మునిగిపోయారు. శ్రీదేవి యావం గుర్తుకు వచ్చింది స్వామికి. తాను చూసి పది సంవత్సరాలయింది. శైశవ మాధు ర్యంలో స్పష్టంగా తనముందు తిరిగిన మూర్తి. ఎంత మారిందో? అప్పుడే వివాహం కావడం, భర్త పోవడం, కష్టాలు, కన్నీళ్ళు, జీవితమంటే అర్థం తెలుసుకోలేని చిరుత ప్రాయంలో చితికిపోయిన పచ్చికుండ. వికసించి వాసించకుండానే వాడి నేలరాలి పత్తి పోతున్న మల్లెమొగ్గ దృశ్యం తనను వెక్కిరించింది.

పగిలి చితికిన పచ్చికుండ—

రాలిపోతున్న మల్లెమొగ్గ — కళ్ళారా చూసి — కంట తడిపెట్టాడు. నిద్రలో, తడిసిన దిండును చేతులతో రాసుకుంటూ నిద్రపోయాడు.

మరునాడు ఎంతెంత బలవంతపెట్టినా వినిపించుకోకుండా తిరుగు ప్రయాణానికి సిద్ధమయింది సీతమ్మగారు.

'ఇక్కడ ఉండిపోవమ్మా' అన్నాడు స్వామి.

'తప్పకుండా. ఆ ముహూర్తమొక్కాస్తా పడనీ. మీ యిద్దర్నీ చూసుకుంటూ మీ దగ్గరే ఉంటానురా. ఎక్కడికి పోతా?' అంటూ ప్రయాణమైంది సీతమ్మగారు.

బస్సుకోసం నిరీక్షిస్తున్న సమయంలో అన్నాడు స్వామి.

'మామయ్య కూతుర్ని చేసుకోవటం నా కిష్టం లేదమ్మా' అని.

'నాకూ అలాగే అనిపించిందిరా. ఆలో చించగా ఈ సంబంధం మళ్ళీ కలిస్తే— మీ నాన్నగారి ఆత్మ శాంతించదు.'

(ఇంకా ఉంది)



'మరో ప్రపంచం'లో నాగేశ్వరరావు, సావిత్రి.

చిత్రసమీక్షలు.

మరో ప్రపంచం

మానవుడు చంద్రుడి మీద కాలు పెట్టాడు. సాహసానికి, వైజ్ఞానిక వైభవానికి ఉదాహరణగా వున్న ఈ ప్రయాణం ప్రయోజన మేమిటి? అనే ప్రశ్నకి వెంటనే సమాధానం ఎలా దొరుకుతుంది?

'చక్రవర్తి చిత్ర' మద్దిగుండాల నుంచి మరో ప్రపంచంలో అడుగు పెట్టింది. ఉన్నతాశయాల సాధనకోసం, ఉత్తమాదర్శాల స్థాపనకోసం చలనచిత్ర నిర్మాణాన్ని ప్రయోజనాత్మకంగా మలుచుకొంటున్న ఈ సంస్థ కృషి సత్వర ఫలితాన్ని అందివ్వక పోవచ్చు. కాని మైలురాళ్ళవంటి సుస్థిర నిర్మాణాలు జనానికి ఎప్పుడూ దారి చూపిస్తూనే వుంటాయి, మేల్కొల్పుతూనే వుంటాయి.

యువతరం ఉత్సాహాన్ని ఎలా సద్వినియోగ పరుచుకోవాలో? పెద్దలకు బుద్ధి చెబుతూ—పిన్నలను 'మరో ప్రపంచ' నిర్మాణానికి ఎలా తిప్పివిద్దాలో?—ఇంత ఉత్కృష్టమైన ఆదర్శానికి చట్టం సమర్పించే మర్యాద ఏమిటో? ఈ చిత్రం సోదాహరణంగా వివరిస్తుంది.

ఏ ఉద్యమానికైనా కొంత కష్టనిష్ఠూరాల్ని ఎదుర్కోవడం తప్పదు. స్వాతంత్ర్య సంగ్రామం కోసం మన పెద్దలు పడిన శ్రమకి — ఈ 'సోకాల్డ్' చట్టం వారిని ఎలా సత్కరించిందో మన చరిత్రే సాక్ష్యం చెబుతుంది. 'మరో ప్రపంచం' నిర్మాణోద్యమం ఒక్క ఎంతో శ్రేయస్సుకే కాదు, దేశాభ్యుదయానికి సోపానాలు వేస్తూ కర్తవ్యాన్ని బోధిస్తుంది. ప్రపంచం నేడు ఎదుర్కొంటున్న అనేక ముఖ్య సమస్యలకి, సమాధానం ఇవ్వగలుగుతుంది. ఇంతటి సంచలనాత్మకమైన చిత్రం నిర్మించిన అక్కినేని నాగేశ్వరరావు, ఆదుర్తి సుబ్బారావుగార్లని అభినందించి తీరాలి.

దొంగతనంగా పిల్లల్ని ఎత్తుకుపోయి వారిని 'మరో ప్రపంచం'లో పెంచి, మరో యుగాన్ని సృష్టించాలని కొందరు యువతీ యువకులు ముందంజ వెయ్యడం కథాంశం.

ఆశయం గొప్పదే. అందుకు పిల్లల్ని దొంగతనంగా ఎత్తుకుపోవలసిన అవసరం వుందా? అందులోను, 'స్పై' చిత్రాల మాడర్న్ టెక్నిక్‌తో పిల్లల్ని ఎత్తుకుపోయి ప్రజల్లో భీభత్సం రేపడం, వారిని పట్టుకోడానికి జేమ్స్‌బాండ్ పద్ధతిలో పరిశోధకులు దిగడం — ఇదంతా ఒక మహత్తర కార్యం కోసం అని చెప్పడం ఎంతవరకు సమంజసం?

అయితే, ప్రేక్షకులు ఎదురు చూస్తున్నట్టుగానే ఈ ప్రశ్నకి సమాధానం 'మాటల్లో' చెప్పిస్తారు. కాని, (చట్టం మాట దేవుడెరుగు) తల్లిదండ్రులకి వచ్చే వేదన గల్గినంత బలం చిత్రీకరణలో కనిపించదు. చిత్రంలో తల్లిదండ్రులు మరో ప్రపంచం కృషిని ప్రశంసిస్తారు. (అది వేరు) ఇది నిజ జీవితంలో ఎంత వరకు ఆచరణీయం? పిల్లల్ని ఎత్తుకు పోకుండా అనాథ శరణాలయాల్ని ఉపయోగించు కున్నట్టుగానో, బాల నేరస్థులను దిద్దినట్టుగానో చూపించివుంటే ఆశయ సాధనలో కొట్టొచ్చినట్టు కనిపించే తప్పటడుగు లేకుండా పోయేది.

కాని, ఈ 'ఎత్తుకుపోవడం' అంటూ లేకపోతే చిత్రంలో 'టెంపో' కొరవడేది. పేలవంగా తయారయ్యేది. నాగేశ్వరరావు బహురూప ధారణకి అవకాశం ఉండేది కాదు. జనాన్ని ఇంతబాగా ఆకర్షించ గల్గేదీ కాదు. మామూలుగా చలనచిత్రాలకు ఇవన్నీ అవసరమే మరి!

సి. ఐ. డి. గా ప్రవేశించి మరో ప్రపంచాన్ని సమర్థించడంద్వారా నాగేశ్వరరావు పరిశోధనలకి విలువ పోయింది. కాని, అతని నటనా వైదుష్యంలో ఆ పాత్ర బాగా రాణించడమే కాకుండా చిత్రానికి ఒక గొప్ప ఆకర్షణ అయింది. ప్రబోధాత్మకమైన ఈ చిత్రంలో సలీమా, ప్రసన్నరాణి, విజయలక్ష్మి, రాణీసర్కార్, విజయచందర్, ఎ. రామకృష్ణారావు, సరన్, మాడా వెంకటేశ్వరరావు, పి. ఎస్. రెడ్డిలాంటి యువతీ యువకులతో పాటు సావిత్రి, జమున, సూర్యకాంతం, గుమ్మడి, పద్మనాభం, బాలనటుడు రాజా మొదలైనవారు పాల్గొన్నారు.

శ్రీశ్రీ చైతన్యవంతమైన పాటలకి మహదేవన్ సంగీతం ఉత్తేజాన్నిచ్చింది. పదునైన మాటల్ని మోదుకూరి జాన్సన్, కథని 'భాషా' రాశారు. స్క్రీన్‌ప్లే కె. విశ్వనాథ్. కె. యస్. రామకృష్ణారావు ఫోటోగ్రఫీ చిత్రానికి శోభతెచ్చింది. మరో ప్రపంచానికి (ఆ) దర్శకులు ఆదుర్తి సుబ్బారావు. శ్రీ ఫిలింస్ విడుదల.

(రంగుల పేజీ చూడండి).

నవయుగ శ్రీనివాసరావు గారితో పరిచయం!



'సినిమా నిర్మాణానికి ఏనాటికి ఆనాడు పరిస్థితుల కనుగుణంగా మార్పులు అవసరం'.

ఇంటర్‌వ్యూ : శ్రీనివాస్.

ఇటీవల రాజ్యసభకు జరిగిన ద్వైవార్షిక ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో నెగ్గిన శ్రీ కాట్రగడ్డ శ్రీనివాసరావుగారు నవయుగా పిలిమ్స్‌యొక్క మేనేజింగ్ డైరెక్టరుగా మీకు, మాకు కూడా పరిచితులే. వీరి కుటుంబ సభ్యులందరూ జాతీయోద్యమంలో పాల్గొన్న దేశభక్తులే. దేశంకోసం కారాగార వాసం చేసిన వాళ్లే. వీళ్లతోబాటు, వీరి పినతల్లి శ్రీమతి కె. రామసీతమ్మ శ్రీకృష్ణ జన్మస్థల విశేషాన్ని చవి చూచినవారే సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా సాగిన జాతీయ స్వాతంత్ర్య సమరంతో శ్రీనివాసరావుగారు పాల్గొనడంతో వీరి రాజకీయ చరిత్ర ప్రారంభమైంది. 1929 లో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో మహాత్మాగాంధిగారితో, శ్రీనివాసరావుగారు కృష్ణాజిల్లాలో పర్యటించారు. అప్పటినుండి యిప్పటివరకు శ్రీ శ్రీనివాసరావు దేశంకోసం చేసిన త్యాగాలు ఒకటా రెండా! ఆ శ్రీనివాసరావు గారే నేడు రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ సందర్భంలో వారితో నేను జరిపిన భేటీని మీకు తెలియ చేస్తున్నాను.

ప్రశ్న:—మీరు ఎప్పుడు ఎక్కడ జన్మించారు?

జ:—1916లో విజయవాడ, మొగల్ రాజపురంలో.

ప్ర:—మీరు ఎంతవరకు చదువుకున్నారు?

జ:—బి. కామ్.

ప్ర:—మీరు విద్యాభ్యాసం పూర్తి కాగానే ఏ రంగంలో ప్రవేశించారు?

జ:—వ్యాపారరంగంలో

ప్ర:— మీకు రాజకీయాల్లో ప్రవేశం

ఎప్పుడు, ఎలా కల్గింది?

జ:— 1927 ప్రాంతంలో సైమన్ కమిషన్ బహిష్కరించడానికి నిర్ణయించుకున్న తరుణంలో స్వర్గీయ ఆంధ్ర కేసరి టంగుటూరు ప్రకాశంపంతులు గారు బ్రిటిష్ పోలీసుల తూటాలకు తన గుండెలను ఎదురుచూపి, సవాల్ చేసిన రోజులవి ఆ కథలతో ఆంధ్రదేశం మొత్తమంతా ఉత్తేజనం పొందింది. ఆ నాటినుంచి రాజకీయాల్లో పాల్గొనడం జరిగింది.

ప్ర:— ఇంతకుముందు ఎప్పుడైనా ఎన్నికల్లో నిలబడ్డారా?

జ:— లేదు.

ప్ర:— 'నవయుగ' సంస్థను ఎప్పుడు స్థాపించారు?

జ:— మనకు స్వాతంత్ర్యం సిద్ధించిన శుభదినం 1947 ఆగస్టు 15 తేదీన

ప్ర:— సారథి స్టూడియోస్‌ను ఇంకా అభివృద్ధిచేసే ఉద్దేశం ఉందా?

జ:— తప్పకుండా

ప్ర:— మీరు పార్లమెంటు మెంబరు అయ్యారుగదా? మన సినిమా రంగానికి ఏవి చేయదల్చుకున్నారు?

జ:— నేను పార్లమెంటు మెంబరుఅయింది సినిమారంగం కోసంకాదు. ఈ నాటి అత్యంత క్లిష్ట పరిస్థితులలో దేశానికి సేవ చేయడానికి, అభివృద్ధి నిరోధక శక్తులను నివరించడంకోసంమాత్రమే. సినిమా రంగానికి కూడా నేను సహాయం చేయగల అవకాశం వుంటే చేస్తాను.

ప్ర:— నేటి మన ఇండియాకు ఎలాంటి ప్రభుత్వం వుంటే బాగుంటుంది?

జ:— ప్రజావసరాలు తీర్చగల, ఈ నాటి క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొనగల ప్రభుత్వం అవసరము

ప్ర:— మీకు నచ్చిన దేశ నాయకుడెవరు? మీరు ఏ పార్టీలోనైనా మెంబరా?

జ:— మహాత్మాగాంధి. ఏ పార్టీలోను మెంబరు కాను.

ప్ర:— సినిమా పరిశ్రమ ఎక్కువ పన్ను నిచ్చే పరిశ్రమగదా? మరి యీ పరిశ్రమకు యివ్వవలసిన ప్రాధాన్యత యివ్వకపోవడానికి గల కారణాన్ని ఆరా తీయగలరా?

జ:— లెక్కల ప్రకారం సినిమా పరిశ్రమ నుండి వినోదపు పన్నుద్వారా భారత ప్రభుత్వానికి సాలీనా 40 కోట్లు ఆదాయం వస్తోంది. మిగతా వాటితో పోల్చినపుడు, తక్కువకాదు. భారతదేశంలో ప్రైమరీ సెకండరీ పరిశ్రమలు తరువాతనే సర్వీసు పరిశ్రమలు. జాతీయ, అంతర్జాతీయ ఆదాయాన్ని పెంపొందించేవి మొదటి రెండు పరిశ్రమలు. ఈరెండు అభివృద్ధి చెందినతరువాత సర్వీసు పరిశ్రమలు అనగా సినిమాలు, హోటల్స్, రవాణా, బ్యాంకింగ్ మొదలగునవి. క్రమేణా 'ఈ విధానాలలో కొంత మార్పు వస్తోంది. పన్ను ద్వారా రాబడిన మొత్తము స్థానిక సంస్థకు పోతుంది కనుక ప్రభుత్వం కూడా ఇప్పుడిప్పుడే సినిమా ప్రాముఖ్యత గుర్తించింది. భారతదేశంలో చలన చిత్రం ఒక కళాత్మక స్వరూపము

ప్ర:— సినిమా పరిశ్రమనుండి రాజకీయ రంగానికి దృష్టి మరల్చడానికి కారణం చెప్పగలరా?

జ:— పైన చెప్పినట్లు 1927 లోనే చదువుకు స్వస్తి చెప్పి, రాజకీయాలలో ప్రవేశించాను. 1929 లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నాను. గాంధిజీ కృష్ణాజిల్లాలో పర్యటించినపుడు వారివెంట తిరిగాను 1930 లో లోధీ కమిషన్ వచ్చినపుడు నల్ల జెండాల ప్రదర్శన సందర్భంలో అరస్టయి విజయవాడ సబ్ జైలులో రెండు వారాలపాటు నిర్బంధించబడ్డాను. ఆ తరువాత అనేక రాజకీయోద్యమాలలో పాల్గొనడం, స్వాతంత్ర్యం లభించిన పిదప వ్యాపార రంగంలో ప్రవేశించడం జరిగింది. కనుక చిన్నప్పటినుండి రాజకీయాలలో ఉంటున్న నాకు, రాజకీయ రంగానికి దృష్టి మరల్చడమనే ప్రశ్నయే లేదు. ఈనాటి క్లిష్ట పరిస్థితులలో దేశానికి ఉడుతా భక్తిగా సేవ చేయడానికి తిరిగి రాజకీయరంగంలో ప్రవేశించాను

ప్ర:— ప్రతి గ్రామంలో ఒక పర్మనెంటు థియేటరు వుంటే బాగుంటుంది? అలాంటి సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నిస్తారా?

జ:— ప్రభుత్వం యీ విషయంలో కొంత పరిశీలన జేస్తోంది. ప్రజలు ప్రభుత్వం ముందుకు వచ్చినపుడు యీ సమస్య తీరుతుంది.

ప్ర:— మీరు ఎలక్షన్లలో మీకై మీరు నిలబడ్డారా? లేక మరెవ్వరి ప్రోద్బలంతో నిలబడ్డారా?

జ:— ఉభయ కమ్యూనిస్టుపార్టీలు, మరి కొందరి ప్రోత్సాహంతో ఎన్నికలలో పాల్గొన్నాను.

ప్ర:— నేటి సినిమాల నిర్మాణంలో ఏదయినా మార్పు అవసరమా?

జ:— సినిమా నిర్మాణానికి యేనాటికి ఆనాడు పరిస్థితుల కనుగుణంగా మార్పులు అవసరము.

ప్ర:— భారత పౌరుల ప్రతినిధిగా వెళ్లిన మీరు భారతీయులకు, ముఖ్యంగా ఆంధ్రులకు ఉపయోగకారిగా ఉండగలరనే నమ్మకం మీకుందా?

జ:— క్లిష్ట పరిస్థితులలో దేశానికి కృషి సేవ చేయడం ద్వారా ఉపయోగకారి కాగలనని దృఢ నమ్మకం ఉంది.

ప్ర:— నక్సలైట్ల వల్ల మన దేశానికి చాలా ముప్పు ఉంది. వారిని అణచాలంటే ఏం చేయాలి?

జ:— నక్సలైట్లను సృష్టించే వాతావరణం తొలగించాలి. భూ సంస్కరణలు, బంజర పంపకం త్వరగా జరగాలి.

ప్ర:— తెలంగాణా సమస్య తీరాలంటే ఏం చేయాలో మీరేమైనా సలహా ఇవ్వగలరా?

జ:— ఆర్థికాభివృద్ధి పుష్పప్పుడు ఆ సమస్య దానంతట అదే తీరుతుంది.

ప్ర:— థియేటర్లలో బ్లాకు టిక్కెట్లు అమ్మే పద్ధతిని అరికట్టడం ఎలా?

జ:— ఎక్కువ థియేటర్లలో ఒకేసారి విడుదల చేయాలి. ప్రేక్షకులలో చైతన్యం కలగాలి, ప్రేక్షకులు సహకరించాలి. ●

కృష్ణకి ద్రోహం తలపెట్టిన విజయనిర్మల సోదరుడు!

హీరో కృష్ణ పరోపకార పరాయణుడు; స్నేహశీలుడు; ఎప్పుడూ సరదాగా వుండడం ఆయనకు అలవాటు. అలాంటి కృష్ణ మనస్సును యెవరో గాయపరిచారు. ఆయన ప్రళయకాల రుద్రుడయ్యాడు. తన డ్రాయరును విసురుగా తెరిచాడు. అందులోంచి కత్తిని తీసి జేబులో పెట్టుకున్నాడు. కోపంగా వెళ్ళబోతుంటే, కిలకిల నవ్వుతూ విజయనిర్మల యెదురైంది.

విజయనిర్మల: ఏదో అవసరమయిన పనిమీద వెళ్తున్నట్టున్నారే?

కృష్ణ: అవును మీ యింటికే.

విజయనిర్మల: అయితే నా శకునం చాలామంచిది. మీరు వెళ్ళేపని తప్పకుండా అవుతుంది.

కృష్ణ: వెళ్ళడం పెళ్ళితాంబూలం పుచ్చుకోడాని కనుకున్నావా? కాదు—కాదు. ప్రాణాలు తియ్యడానికి; పగసాధించడానికి.

విజయనిర్మల: ఏమిటా మాటలు. ఎవరిమీదీ పగ?

కృష్ణ: ఇంకెవ్వరిమీద; మీ అన్నయ్య మీదే.

విజయనిర్మల: మా అన్నయ్య మీకేం అపకారం చేసాడు?

సినిమా

కృష్ణ: ఇంకేం చెయ్యాలి; స్నేహం చేసి మోసం చేసాడు; నా భార్యను పొట్టన పెట్టుకుని, నా బాబును నాకు దూరం చేసాడు. నా జీవితాన్ని సర్వనాశనం చేశాడు.

విజయనిర్మల: అబద్ధం; వచ్చి అబద్ధం; నేను మీకు నచ్చకపోతే చెప్పు


'భలేపాప'లో కె. ఆర్. విజయ

చ్చుగా, మా అన్నయ్య చాలా మంచివాడు; ఆయన్నేమయినా అంటే నేను సహించను.

కృష్ణ: ఇప్పుడు నీకేం అర్థం కాదులే, స్నేహానికి ద్రోహంచేసిన మీ అన్నయ్య కావాలో, నేను కావాలో తేల్చుకో—అంటూ చర చర వెళ్ళిపోయాడు. 'కట్' అన్నారు దర్శకుడు కుటుంబరావు. ఈ సన్నివేశం రవిచిత్ర వారి 'పగ సాధిస్తా'లో కనిపిస్తుంది.

ఈ చిత్రాన్ని శ్రీ వై. వి. రావ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అప్పలాచార్య సంభాషణలను, సత్యం సంగీతాన్ని చలం శిల్పాన్ని, కత్తుల గోపాలకృష్ణ సహాయ దర్శకత్వాన్ని నిర్వహిస్తున్నారు. ఈ చిత్రంలో ఎస్. ఎస్. లాల్ కెమెరా రేసుగుర్రంలా పరుగెత్తింది. వ్రాస్తా ద్వారా విడుదలయ్యే ఈ చిత్రంలోని యితర ముఖ్యపాత్రలను ...నారాయణ, ప్రభాకరరెడ్డి, రాజబాబు, త్యాగరాజు, అనిత, సంధ్యారాణి, కనకదుర్గ, ...నాయుడు దేవి, విజయభాను, మాస్టర్ రాము పోషించారు.



'పిన్నిటిమనసులు'లో శోభన్ బాబు, శారద.

ప్రేమగా మారిన పరిచయం

హరనాథ్ విదేశాలకు వెళ్ళి, వ్యవసాయ పరిశోధనచేసి స్వదేశానికి తిరిగివచ్చాడు. తను చేసిన రిసెర్చిని ఎక్స్‌పెరిమెంట్ చేసి బంగారుపంటని పండించాడు. తన పొలందగ్గర్లో ఒక 'రెస్టు రూమ్' కట్టించాడు. ఆ కుటీరంచుట్టూ పూలమొక్కలను పెంచాడు. ఆ గదిని 'శాంతి నిలయం' చేసుకున్నాడు. దేశనాయకుల ఛాయాచిత్రాలను గదినిండా తగిలించాడు. హరనాథ్‌కి అతని మిత్రుడిచెల్లెలు చంద్రకళతో పరిచయం ఏర్పడింది. పరిచయం ప్రేమలోకి దింపింది. ఇద్దరి ఆశయాలు కలిసాయి. ఇద్దరూ అలా పైరుగాలిలో షికారు కొట్టారు. షికారులో హుషారు గొలిపే ప్రేమపాటను ప్రేమికు లిద్దరూ ఆడిపాడారు.

'ఇవేళే తలపుల వెన్నెలలు
ఇవేళే విరిసిన నా కలలు...'

అని చంద్రకళ పాడుతూంటే, హరనాథ్



'అఖండుడు'లో కృష్ణ, భారతి.



'ఖడ్గవీర'లో జ్యోతిలక్ష్మి.

ఆమె చెక్కిలిపై నాజూకయిన చిటికె వేసాడు. ఆమె ఒళ్ళు ఝల్లుమంది.

'ఇరువురము ఏకమైన వేళా
కలయే నిజమై కనిపించెనులే...'

అంటూ హరనాథ్ ఆమెను తన హృదయానికి హత్తుకున్నాడు. 'కట్' అన్నాడు దర్శకుడు రాధాకృష్ణ. ఈ శృంగార సన్నివేశాన్ని 'నా దేశం'లో చూస్తారు.

ఈ చిత్రానికి వసంతరావు మాటలను, బాబూరావు సంగీతాన్ని, జనార్దనరావు ఛాయను, సూరన్న శిల్పాన్ని నిర్వహిస్తున్నారు. శ్రీ కె. త్యాగరాజు, వి. శ్రీరామమూర్తిగార్ల నిర్మాణ నిర్వహణలో తయారవుతున్న 'నా దేశం' చిత్రానికి కె. రాధాకృష్ణ కథను, ఎడిటింగును, స్క్రీన్ ప్లేను-దర్శకత్వాన్ని నిర్వహిస్తున్నారు. ఈ దేశభక్తి ప్రపూరితమైన కథలో కనిపించే యితర ముఖ్యపాత్రలను 'షావుకారు' జానకి, మాలతి, విజయలలిత, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, త్యాగరాజు, ధూళిపాళ, అల్లు రామలింగయ్య, పెరుమాళ్ళు, ముక్కామల, మాస్టర్ బాబులు ధరిస్తున్నారు. సిడాక రవీంద్రనాథ్, జయంతి (నూతన తారలు) ముఖ్య భూమికలను పోషిస్తున్నారు.

* * *

ఏప్రిల్ 10న మాధవి కంబైన్స్ వారి పాటల రికార్డింగు విజయా గార్డెన్సులో ప్రారంభమైంది. శ్రీ కె. వి. మహదేవన్ సంగీతసారథ్యంలో సుశీల ఘంటసాలగార్లు పాడిన యుగళగీతం రికార్డు చెయ్యబడింది.

'చిలకమ్మ పిలిచింది
గోరంక వచ్చింది'—

ఈ పాట ఆచార్య ఆత్రేయగారిచే వ్రాయబడింది. ఈ డ్యూయెట్ అవుట్‌డోర్ లొకేషన్‌లో నాగేశ్వరరావు, లక్ష్మిలపై చిత్రీకరించబడుతుందని నిర్మాతల్లో ఒకరయిన ప్రసాద్ చెప్పారు.

మాధవీ కంబైన్స్ నిర్మించనున్న సాంఘిక చిత్రం యొక్క షూటింగు మే నెలలో ప్రారంభమవుతుంది. తాతినేని రామారావు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి గుహనాథన్ కథను, బొల్లిముంత శివరామకృష్ణ మాటలను వ్రాశారు. శ్రీ సుబ్బారావు, ప్రసాద్‌గార్లు భారీ ఎత్తున నిర్మించే ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలను నాగేశ్వరరావు, జగ్గయ్య, గుమ్మడి, పద్మనాభం, లక్ష్మి, అంజలీదేవి పోషిస్తారు. సారథి స్టూడియోలో నిర్మించబడే ఈ చిత్రానికి సెల్వరాజ్ ఛాయాగ్రహణాన్ని, మహ



'అగ్నిపరీక్ష'లో, విజయనిర్మల.



'భలే పాప'లో పద్మనాభం, బేబీరాణి.

సినిమా

దేవన్ సంగీతాన్ని, జి. వి. సుబ్బారావు శిల్పాన్ని. మార్తాండ్ కూర్పును, కృష్ణ ప్రొడక్షన్ వ్యవహారాలను నిర్వహిస్తాయి.

శోభన్ బాబుని ఆకర్షించిన మిస్ విజయ

శోభన్‌బాబు ఎం. బి. బి. ఎస్. విద్యార్థి. అందగాడు, చురుకయినవాడు. అందుకే ఆడపిల్లలందరూ అతని స్నేహాన్ని కోరారు. అతన్ని తన వాలు

మీకు తెలుసా?

బొంబాయిలో దాదాపు 300 చిత్రాలు రిలీజు కాకుండా సగంలో నిలబడి వున్నాయట.

హిందీ నటుల్లో చాలామంది తమకు జరిగే సన్మాన సభలకు తమ మాతృమూర్తులను తీసుకొచ్చి, వారి ఆశీర్వాదాల నందుకోవడం అలవాటు చేసుకున్నారట.

దక్షిణభారత చలనచిత్ర నటీనటులలో ఎక్కువ ఆదాయపు పన్ను చెల్లించే నటుడు శ్రీ ఎం. జి. రామచంద్రన్ అట.

'బ్యేతింగ్ సెన్సేషన్' పేరుతో హాలీవుడ్‌లో ఒక ఆంగ్ల డాక్యుమెంటరీ విడుదల అయిందట. వివిధ దేశాల్లోని వ్యక్తులు ఎలా స్నానం చేస్తారో యిందులో చిత్రీకరించారట

చూపులతో మిస్ విజయ ఆకర్షించింది. ఆమె వాడి చూపులకు శోభన్ అయినా అమ్మాయి చూపుల పోరు పెరిగింది. ప్రతిరోజూ యిద్దరూ కలిసేవాళ్ళు. తియ్యటి కబుర్లతో కాలం గడిపేవాళ్ళు, ప్రేమ ముదిరింది. పరిణయం వరకూ వచ్చింది. ఒకరోజు మిస్ విజయ తన ప్రియుణ్ణి సరాసరి తన యింటికి తీసుకొచ్చింది. ఇద్దరూ [illegible] సన్నిహితంగా సోఫాలో కూలబడ్డారు. మిస్ విజయను శోభన్‌బాబు తన బాహుబంధంలో ఇముడ్చుకపోయే సమయంలో వాళ్ళమ్మ

పుష్పకుమారి కోపంగా అరిచింది మిస్. విజయ బెదురుగా చూస్తూ 'ఈయన యిక్కడే ఎం బి బి ఎస్ చదువు తున్నారమ్మా, నా స్నేహితుడు' అని పరిచయం చేసింది 'నమస్కారమండీ' అన్నాడు శోభన్ ఎంతసేపయింది వచ్చి అని కుమార్తెను గద్దించింది, పుష్ప కుమారి 'ఇప్పుడేనమ్మా' అని విజయ నసిగింది పుష్పకుమారి వాలకాన్ని కని పెట్టిన శోభన్ తన ప్రేయసితో 'నే వస్తా, మళ్లీ కలుస్తా' అని స్టయిలుగా వెళ్లిపోతుంటే, మిస్ విజయ తదేకంగా చూస్తూ నిలబడింది 'కట్' అన్నారు దర్శకుడు బాబూరావు ఈ ఘట్టం రామవిజేతావారి 'తల్లిదండ్రులు' చిత్రంలో కనిపిస్తుంది

* * *

మిస్ విజయ 'తల్లితండ్రులు'లో ఒక ముఖ్యపాత్రను పోషిస్తూంది వెండి తెరకు అవసరమయిన అవయవసౌష్ఠవం చక్కటి నటన, మంచి వాచికం మిస్ విజయకు వుండడంవల్ల యీమె త్వరలోనే హీరోయిన్ స్థానాన్ని ఆక్రమించ గలదనిపిస్తుంది ఈమె చైతన్య చిత్ర వారి 'స్వర్గానికి నిచ్చెనలు' చిత్రంలోనూ, మాతా పిక్చర్స్‌వారి 'పెద్దలు మారాలి' చిత్రంలోనూ ప్రధాన పాత్రలను ధరిస్తూంది

* * *

— 'స్వర్గానికి నిచ్చెనలు' చిత్రంలో కనిపించే పాత్రలను, నూతన తారలు పోషిస్తున్నారు శ్రీ కె కామేశ్వరశర్మ భావగర్భితమైన సంభాషణలని సమకూర్చారు శ్రీ ఎస్ డి లాల్ దర్శకత్వంలో నిర్మితమవుతున్న ఈ చిత్రం పదిరోజుల్లో తయారైంది

ఉగాదినాడు రికార్డు చెయ్యబడిన మాతాపిక్చర్స్ మొదటి పాట

మాతాపిక్చర్స్ నిర్మిస్తున్న 'పెద్దలు మారాలి' చిత్రంయొక్క మొదటిపాట ఉగది పర్వదినాన విజయా గార్డెన్స్‌లో రికార్డు చెయ్యబడింది ఈపాటను శ్రీ బి. గోపాలం అండ్ శ్రీమతి లీల స్వరకల్పన చేశారు

మాయదారిలోకం తీరు
ఒకయ్యో చూడు,
అల్లిబిల్లి కల్లాకపటం
ఓ లమ్మో చూడు,
ఉన్నవాళ్లకు లక్ష్మి జాస్తి
లేనివాళ్లకు సర్వం నాస్తి.

ఈ పాటను శ్రీమతి కె రామలక్ష్మి వ్రాసారు ఎల్ ఆర్ ఈశ్వరి పాడారు ఈ చిత్రానికి పి సి రెడ్డి నిర్దేశకుడు ముఖ్యపాత్రలను జమున హరనాధ్, హీరో నాగేశ్వరరావుగారి కుమారుడు ధరిస్తున్నారు. శ్రీమతి వి సరోజిని నిర్వహణలో నిర్మిత



'జగత్ జెట్టిలు'లో వాణిశ్రీ, గుమ్మడి

సినిమా డైరీ

● ఉత్తమా చిత్ర వారి షూటింగు హైదరాబాదు సారథిలో ఏప్రిల్ 13 నుండి 20 వరకు జరిగింది శ్రీ ప్రత్యగాత్మ దర్శకత్వంలో నాగేశ్వరరావు, జమున, రామకృష్ణ పాల్గొన్నారు

● శిల్పక్రాఫ్ట్స వారి "దేశమంటే మనుషులోయ్" చిత్రానికి ఏప్రిల్ 10న శ్రీ ఎం జి రామచంద్రన్ స్విచ్ ఆన్ చేయగా, శ్రీ ధనెంకుల నరసింహం క్లాప్ కొట్టారు


● ఎస్ బి ఆర్ పిక్చర్స్ వారి షూటింగు ఏప్రిల్ 13న ఏ వి ఎం లో కె ఎస్ ప్రకాశరావు గారి దర్శకత్వంలో జరిగింది శోభన్‌బాబు, మణిమాల పాల్గొన్నారు

● టైగర్ ప్రొడక్షన్స్‌వారి "అఖండుడు" షూటింగు ఏప్రిల్ 12, 13 తేదుల్లో గోల్డెన్‌లో జరిగింది శ్రీ రామచంద్రరావు దర్శకత్వంలో రాజబాబు, రమాప్రభలు పాల్గొన్నారు

● నటి వాసంతి నిర్మిస్తున్న "భలేపాప" షూటింగు ఏప్రిల్ 11, 12 తేదుల్లో శారదాలో జరిగింది హరనాధ్, కె ఆర్ విజయ, రావికొండలరావు, రాధాకుమారి, ఏచూరి, బేబిరాణి పాల్గొన్న దృశ్యాలను శ్రీ కె ఎస్ ప్రకాశరావు చిత్రీకరించారు

● సుప్రజా పిక్చర్స్‌వారి "లాడి సింగన్న" షూటింగులో నాగభూషణం, విజయశ్రీ పాల్గొన్న సన్నివేశాలను శ్రీ అయ్యన్‌మూర్తి గోల్డెన్‌లో ఏప్రిల్ 14 నుండి 18 వరకు చిత్రీకరించారు

● "చిట్టితల్లి" షూటింగు ప్రభా స్టుడియోలో శ్రీ జి కె మూర్తి దర్శకత్వంలో ఏప్రిల్ 12, 13, 14 తేదుల్లో జరిగింది హరనాధ్, భారతి, త్యాగరాజు, బేబిరాణి పాల్గొన్నారు.



ఉత్తమచిత్ర వారి సాంఘిక చిత్రంలో జమున, నాగేశ్వరరావు

మధ్యే ఈ చిత్రంయొక్క షూటింగు మే మాసంలో ప్రారంభమవుతుంది.

సినిమా


వింత మనుషులకి విందు చేసిన నాగభూషణం

సుప్రజా పిక్చర్స్‌వారి 'కిలాడి సింగన్న' చిత్రానికోసం గోల్డెన్ స్టూడియోలో ఆర్టు డైరెక్టరు ఘంటం నిర్మించిన డెన్ సెట్టును చూసి ఆశ్చర్యపోయాను. ఫ్లోర్ మొత్తం నెయ్యబడ్డ ఈ డెన్‌లో విచిత్రమయిన సొరంగ మార్గాలు, చిత్రమయిన రహస్యదారులు అద్భుతంగా నిర్మించారు.

ఈ డెన్ ఎవరిదో తెలుసా? నాగభూషణం గారిదే. ఈ స్థలం ఆయనదని ఆయన అనుచరులకు మాత్రమే తెలుసు. ఒకరోజు నాగభూషణం దగ్గరికి వింతమనుషులు కొందరొచ్చారు. వారిని సగౌరవంగా ఆహ్వానించి వారి గౌరవార్థం విందు ఏర్పాటు చేసారు. విందు కాగానే కనువిందుగొలిపే ముద్దుల గుమ్మ నాట్యం చేసింది. ఆ అందాలభామ మరెవ్వరో కాదు, మీకు పరిచయమయిన విజయశ్రీయే. ఆమె ఆడుతూ పాడింది ఆ పాటలో అతిథులను కవ్వించింది.

నవ్వులరాణీ కవ్విస్తుంది నా రాజా
నీకూ నాకూ జోడైతేనే వుంది మజా
వద్దకు చేరిన ముద్దుల గుమ్మను
వదిలావంటే, టా...టా...టా

ఈ పాటను కొసరాజు వ్రాసారు. కోదండపాణి అధ్వర్యంలో ఎల్. ఆర్. ఈశ్వరి పాడింది. దర్శకుడు అయ్యన్ మూర్తి, కెమెరామెన్, కన్నప్ప సహాయంతో ఈ సన్నివేశాన్ని ఏప్రిల్ 14,15,16,17 తేదులలో చిత్రీకరించారు. ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలను ఎస్వీ రంగారావు,




'పెత్తందార్లు'లో రామారావు.

హరనాథ్, రాజబాబు, వాణిశ్రీ, విజయలలిత, విజయశ్రీ మరియు నాగభూషణం గార్లు పోషించారు.


* * *

అగర్భ శ్రీమంతుడు నాగభూషణం. ఆయన ఆస్తికి వారసులు యిద్దరే, ఆ యిద్దరూ అమ్మాయిలే. మొదటికూతురు ఒక అవిటివాణ్ణి పెళ్లిచేసుకుంది. రెండవ అమ్మాయికి రాజబాబుతో పెళ్ళి చెయ్యాలనే తలంపులో, రాజబాబును తన ఆఫీసు కార్యదర్శిగా పెట్టుకుంటాడు నాగభూషణం. రాజబాబు అయిదులక్షల ఆస్తికి వారసుడు. అందుకే నాగభూషణం కన్ను రాజబాబు పై పడింది.



'మాయని మమత'లో ఒక దృశ్యం.

ఆఫీసు సెక్రెటరీ జూనియర్ కాంచన రాజబాబును గాఢంగా ప్రేమించింది. ఒక రోజు ఆఫీసుకి ఒక టెలిగ్రాము వచ్చింది. విప్పిచూచిన రాజబాబు నిర్ఘాంతపోయాడు. విశ్చేష్టుడయ్యాడు. వ్యాపారం దివాలా తీసినందుకు కుయ్యో, మొర్రో అని రాజబాబు ఏడవడం ప్రారంభించాడు. సెక్రెటరీ కాంచన రాజబాబు దగ్గర కొచ్చి, వోదార్చింది. 'నేను వున్నానుగా, మీకెందుకండీ దిగులు. మిమ్మల్ని నేను కాపాడుతానుగా' అని రాజబాబు కన్నీళ్లను తుడిచింది. 'కట్' అన్నారు దర్శకుడు



'ధర్మదాత'లో ఒక దృశ్యం.



'మూగప్రేమ'లో వాణిశ్రీ

అయ్యన్‌మూర్తి. ఈ సన్నివేశాన్ని 'ఆడ జన్మ' చిత్రానికిగాను కన్యప్ప వాహినిలో చిత్రీకరించారు. శ్రీ జి. వి. ఎస్. రాజు నిర్మిస్తున్న యీ చిత్రంలోని ప్రధానపాత్రలను జమున, హరనాథ్, నాగభూషణం, రాజబాబు, సత్యనారాయణ, మొద్దుకూరి సత్యం, మాలతి, గీతాంజలిగార్లు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని జిల్లాలవారీగా విక్రయించదల్చినట్లు నిర్మాత శ్రీ రాజు వెల్లడించారు.

కోదండరాముడిగా ఎన్. టి. రామారావు

పురాణ పురుషుల పాత్రలను పోషించడంలో శ్రీ నందమూరి తారక రామారావు అందెవేసిన చేయి. రామ, రావణ పాత్రలను, కృష్ణ సుయోధన భూమికలను అసామాన్యంగా నటించిన దిట్ట శ్రీ ఎన్. టి. ఆర్. 'లవకుశ' తర్వాత శ్రీరాముడిగా నటించడానికి శ్రీ రామారావు అంగీకరించారని శ్రీ కళాలయ నిర్మాత వెల్లడించారు; కళాలయ ఆర్ట్ ప్రొడక్షన్స్ నిర్మించనున్న 'శ్రీ రామాంజనేయ యుద్ధం' చిత్రంలో శ్రీ ఎన్.టి. రామారావు కోదండరాముడిగా సాక్షాత్కరిస్తారు. ఈ చిత్రాన్ని ఈస్టమన్ కలర్‌లో నిర్మించడానికి నిర్మాత నిశ్చయించారు. జూనియర్ సముద్రాల రచనా విభాగాన్ని, మానాపురం అప్పారావు దర్శకత్వ భారాన్ని వహించే ఈ పౌరాణిక చిత్రానికి రాజేంద్ర కుమార్ ఆర్టు డైరెక్టరు.

* * *

స్వర్గీయ పి. పుల్లయ్యగారి దర్శకత్వ ప్రతిభతో 'పరమానందయ్య శిష్యులకథ' నిర్మాత తోట సుబ్బారావును చిత్ర పరిశ్రమలో బాక్సాఫీస్ ప్రొడ్యూసరుగా నిలబెట్టింది. ఆ తర్వాత నాల్గయిదు చిత్రాలను శ్రీ దేవి సంస్థ పేరిట నిర్మించారు



'నగ పాఠిస్తా'లో సత్యనారాయణ, కనకదుర్గ.

ఈ జోగానికి శ్రీ తోట సుబ్బారావు మిగాక సంస్థను స్థాపించారు. ఈ సంస్థకు లక్ష్మీ పిక్చర్స్ అని పేరు పెట్టారు. ఈ సంస్థ నిర్మిస్తున్న చిత్రానికి 'పట్టినదల్లా బంగారం' అని పేరు. మహేంద్రన్ వ్రాసిన కథకు, బి. ఎల్. వి. ఎన్. ఆచార్య సంభాషణలను సమకూర్చారు. జీ. వి. ఆర్. శేషగిరిరావు దర్శకత్వాన్ని; ఎస్. ఎస్. లాల్ ఛాయాగ్రహణాన్ని ఘంటసాల సంగీతాన్ని నిర్వహించే ఈ చిత్రంలోని ప్రధాన పాత్రలను చలం, జగ్గయ్య, రేలంగి, బాలకృష్ణ, అల్లు రామలింగయ్య, కె. వి. చలం, పి. డి. ద నాగేశ్వరరావు, సురేన్‌బాబు, రాజశ్రీ, విజయలలిత, మంజుల ఛాయాదేవి, మీనాకుమారి, సవితాదేవి పోషిస్తారు షూటింగు మే 16 న ప్రారంభం కాగలదని తెలుస్తోంది.

—శ్రీనివాస్ ●

చిత్రసమీక్షలు

(55 వ పేజీ తరువాయి)

పెళ్ళిసంబంధం

మంచి తారాగణమూ, చెప్పుకోదగ్గ సాంకేతిక సంపత్తికితోడు కథలో మరింత పటుత్వం వున్నట్టయితే ప్రవీణా పిక్చర్స్ వారి 'పెళ్ళిసంబంధం' ఇంకా ఘనంగా వుండివుండేదనిపిస్తుంది.

ఈ చిత్రంలో ఆదినుంచి చివరిదాకా నాటకీయత ఎక్కువగా కనిపిస్తుంది. పూర్తి కామెడీచిత్రంగా నిర్మించివుంటే ఈ నాటకీయతకి ఎక్కువ ప్రశంసలు లభించివుండేవి. పాత్రపై కామెడీ పులుముడంవల్ల (సహజత్వం లోపించి) పాత్రలతోపాటు నటీనటులూ కొంత ఇబ్బంది పడినట్టు కనిపిస్తుంది.

చెల్లెలు ప్రేమించి పెళ్ళి చేసుకుంటుంది. ఆమెతో సంబంధాలు తెగతెంపులు చేసుకుంటాడు అన్నయ్య. అతని కొడుకు మళ్ళీ ఆ చెల్లెలు కూతుర్నే ప్రేమిస్తాడు. అందుకోసం కొంత నాటకమాడవలసి వస్తుంది. ఆ అన్నగారు చివరకు పట్టుదల విడిచిపెట్టుకోక తప్పలేదు.

పంతానికి ఎక్కువ ప్రాధాన్యత వున్న ఈ కుటుంబ కథలో నాగభూషణం పాత్ర పెద్దది. ఆ పాత్ర దిద్దుబాటు సంగతి ఎలావున్నా నాగభూషణం నటన బాగున్నది. నాటకంలో ఒకపాత్ర అయి నందువల్ల గుమ్మడి పాత్ర విలువ తగ్గినా నటనలో అతనిదే పైచేయి. కృష్ణ విజయనిర్మలల జంట చూడ ముచ్చటగా వుండి చిత్రానికి ప్రత్యేక ఆకర్షణ కూర్చారు. వాణిశ్రీ పాత్రకి అంత ప్రాముఖ్యం లేనప్పటికీ వున్నంతలో బాగ రాణించిందనేచెప్పాలి. రావికొండలరావు, సాక్షి రంగారావు, అల్లు రామలింగయ్య, పాత్రోచితమైన హాస్యన్ని అందించి చిత్రానికి కొంత 'కామెడీ కళ' రప్పించారు. కృష్ణంరాజు నటన బాగున్నది. సన్నివేశంలో ఎబ్బెట్టుగా వున్నా జ్యోతిలక్ష్మి నృత్యంతో చిత్రానికి అన్ని హంగులూ సమకూరాయి.

కథలో సత్తువ వుంటే దర్శకుని ప్రతిభ కనపడి వుండేదే. వున్నంతలో ఎంతో చాకచక్యాన్ని చూపించి చిత్రాన్ని, రసభరితం చేసిన దర్శకుడు కె. వరప్రసాదరావు కృషిని అభినందించి తీరాలి. దర్శకుడే కథా రచయితకూడా. మొత్తం మీద ఎక్కువ ప్రజ్ఞ కెమెరా పర్కులో బాగా కనిపిస్తుంది. అందుకు వి. యస్. ఆర్. స్వామి ప్రశంసాపాత్రులు అవుతారు.

పెండ్యాల సంగీత సారథ్యం వహించిన 'పెళ్ళిసంబంధం' బంధుమిత్ర సపరివారంగా చూడతగ్గది. నిర్మాత: బి. విశ్వనాథం.

—సికరాజు ●



'పెళ్ళిసంబంధం'లో జ్యోతిలక్ష్మి.

అవీ-ఇవీ...

'గ్రహణంలో దశమగ్రహం' నాటకం ప్రదర్శన

ఆంధ్రపత్రిక అభ్యుదయ కామండలివారు ఏప్రిల్ 10 వ తేదీన స్థానిక అన్నామలై హాలులో 'గ్రహణంలో దశమ గ్రహం' అనే సాంఘిక నాటకాన్ని విజయవంతంగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకి పద్మశ్రీ రేలంగి అధ్యక్షత వహించారు.

శ్రీయుతులు పి. డి. ఎస్. రామయ్య, వి. నారాయణస్వామి, ఎ. వి. ఎల్. నరసింహారావు, కె. రాధాకృష్ణమూర్తి, ఎస్. జి. జానకేశరం, యు. గుణాకరరావు, ఎ. కుప్పుస్వామి, పి. దక్షిణామూర్తి, సి. ఎస్. సారంగపాణి, కుమారి పద్మిని, శ్రీమతి మంజుల. బేబి ఉమ మొదలగువారు పాత్రోచితమైన నటనతో రక్తి కట్టించిన ఈ నాటకానికి రచయిత, దర్శకుడు శ్రీ సి కనకాంబరరాజు.

పాటలని శ్రీ బసవేశ్వర్, కుమారి లలిత చక్కగా పాడి శ్రోతలకి వీనుల విందు చేశారు. [ఐ. వి.]

* * *

దేశభద్రత విశ్వశాంతి లక్ష్యముతో మహబూబ్ నగర మండలము నందలి అలంపూర్ తాలూకాలోని భటపల్లి క్షేత్రమున తేది 12—4—70 నుండి 16—4—70 వరకు రామకోటి మహాయాగము శ్రీ సీతారామలక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. [ఐ. వి.]

* * *


"ఆంధ్ర కళామండలి" హాల్లో 7—4—70 నాడు 11 వ వార్షికోత్సవము, యుగాది వేడుకలు జరుపుకొన్నది ●

రాబిన్ బ్లూ చెప్పేవన్నీ చేస్తుంది!




రాబిన్ బ్లూతో మరింత తెల్లదనాన్ని మీరు సాధించగలరు!

రాబిన్ బ్లూ ప్రత్యేకంగా తెలుపు చేయగలనట్టిది. ఇతర నీలిమందులు ఇవ్వలేనట్టి తెల్లదనాన్ని ఇది ఇవ్వగలదు. అందుకే రాబిన్ బ్లూతోనే అనేక బట్టలను తెల్లగా [illegible]



ప్రకృతి సహజమైన తెల్లదనానికి రాబిన్ బ్లూ

AABC-31 TEL)


జోతి సినీ సిండికేట్
పెత్తందార్లు
నిర్మాత U. విశ్వేశ్వరరావు B.Sc.; దర్శకత్వం C.S. రావు B.A. (Litt).
సంగీతం K.V. మహదేవన్., కెమెరా: G.K. రాము., మాటలు: T.P. మహారథి
ఆంధ్ర: జోతి, నైజాం: జోతి సినీ సిండికేట్, సీడెడ్: జయలక్ష్మి, మైసూరు: సుధా చిత్రా